# స్థానిక పాలన

సంపుటి: 3 సంచిక: 9

అక్టోబర్, 2011



ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

కె. అంబరీష్, ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

జి. గంగాధరం

డాక్టర్ సి. కృష్ణ మోహనరావు

ఎమ్.ఎ. కుమార రాజా

ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి

డాక్టర్ లీలా ప్రసాద్

హెచ్. కూర్మారావు

డాక్టర్ కె. లక్ష్మీపతి

ఎమ్. విజయలక్ష్మి

ఎ. సుభాష్‌చంద్ర గౌడ్

డా॥ వి. శివ శంకర ప్రసాద్



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్

హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్

రాజేంద్రనగర్

హైదరాబాద్-500 030

ఆంధ్రప్రదేశ్, ఇండియా

ఫోన్ : 040-24018656

ఫ్యాక్స్ : 040-24017005

E-mail : krishna.chandramouli90@gmail.com

editorsthanikapalana@gmail.com



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవిగా భావించనక్కరలేదు.


# విషయ సూచిక


సంపాదకీయం ..... 2

సమగ్ర గ్రామీణాభివృద్ధికి 'కీ క్యాప్' కార్యక్రమం ..... 3

భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు అరుదైన గౌరవం ..... 4

అపార్డుకు 'నంది' అవార్డు ..... 4

అపార్డును సందర్శించిన అంతర్జాతీయ విద్యార్థులు ..... 5

అపార్డును సందర్శించిన విస్తరణ శిక్షణా కేంద్ర జాతీయ బృందం ..... 6

త్రివేండ్రంలో జరిగిన జాతీయ సమ్మేళనంలో పాల్గొన్న
కొట్టాల భారత్ నిర్మాణ్ వాలంటీర్ సుధ ..... 7

ముగిసిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణ ..... 8

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య పరిపాలనా వికేంద్రీకరణకు అంకురార్పణ ..... 9

తరుగుతున్న అటవీ సంపద - పెరుగుతున్న ప్రమాదం ..... 11

గాంధీజీ చేపట్టిన వినూత్న ఆయుధం సత్యాగ్రహం ..... 15

అన్నదాత అరచేతిలోనే వైకుంఠం ..... 16

గృహస్థాయిలో వృథానీరు - సద్వినియోగం ..... 19

కొండరెడ్ల జీవన విధానం ..... 20

ప్రాచీన కళలకు దర్పణం భారతీయలోక్ కళామండల్ ..... 22

సేంద్రీయ వ్యవసాయంలో రాష్ట్రం ముందంజ ..... 24

స్త్రీ నిధి బ్యాంక్' ప్రారంభం ..... 25

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం! వాతావరణ మార్పుని అరికడదాం!! ..... 26

విజయదశమి - విజయాల దశమి ..... 28

సాగరాలు - పరిశోధనలు ..... 30

భారత 'మల్లయుద్ధ' యోధులు ..... 32

సమాజ సేవకు వైకల్యం అడ్డుకాదు ..... 36

పోట్లదుర్తి గ్రామంలో భారత నిర్మాణ్ వాలంటీర్ల వైద్య శిబిరం ..... 37

ఆనందహేల - దీపావళి వేళ ..... 38

కిశోర బాలికలలో నిండిన ఆత్మస్థైర్యం ..... 40

జయహో బామ్మా! జయహో! ..... 41

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీలు, సమాంతర సంస్థలు - ఓ పరిశీలన ..... 44

హోమియో వైద్యమే ఎందుకు మంచిది? ..... 47

గాంధీ మార్గం ఉత్తమ జీవనానికి సోపానం ..... 48

వాన ..... 50

నెలనెలా బహిష్టులు ఎందుకు వస్తాయి? ..... 53

శుభ్రమైన చేతులతో ఆరోగ్యం పదిలం ..... 55

డిసెంబరు లోగా దేశవ్యాప్తంగా లక్ష మంది భారత నిర్మాణ్ వాలంటీర్లు ..... 57

మీ అడుగు జాడల్లోనే మేము! ..... 59

గ్రామీణ నిరుపేదల జీవితాల్లో ఆశాదీపం - సెర్ప్ ..... 60

# గాంధీజీ స్ఫూర్తి - 'గ్రామ స్వరాజ్య' దీప్తి

ఆయన ఆలోచనల్లో గ్రామం కేంద్రస్థానం ఆక్రమిస్తుంది. ఆయన సిద్ధాంతాల్లో గ్రామం ఒక స్వతంత్ర రిపబ్లిక్‌లా పనిచేస్తుంది. ఆయన ఆకాంక్షల్లో సామాజిక, ఆర్థిక వ్యవస్థ నిర్మాణం గ్రామస్థాయిలోనే వేళ్లూనుకోవాలి. గ్రామస్థాయి నుంచే నిర్మింపబడాలి.

స్వాతంత్ర్యం రావటానికి ఎంతో ముందుగానే గాంధీజీ 'గ్రామ స్వరాజ్య' భావనలకు ప్రాణం పోశారు. 1942లోనే ఆయన గ్రామ స్వరాజ్యం గురించి రాశారు. భారతదేశంలోని ప్రతి గ్రామం ప్రాథమికంగా స్వావలంబన కలిగి ఉండాలని ఆయన వాంఛించారు. నిత్య జీవితానికి అవసరమైన అన్ని సదుపాయాలూ గ్రామంలోనే అందుబాటులో ఉండాలని, అక్కడే తయారు కావాలని ఆయన కోరుకున్నారు. ఆహారం, వస్త్రాలు, శుభ్రమైన మంచినీరు, పారిశుధ్యం, ఇళ్లు, సామాజిక భద్రత, ఉపాధి, విద్యాసదుపాయం మొదలైన వాటికి గ్రామస్థులు బయటి గ్రామాలపై ఆధారపడరాదని గాంధీజీ భావించారు. చివరికి పరిపాలన, గ్రామరక్షణ కూడా గ్రామమే చూసుకోవాలని ఆయన ఉద్ఘాటించారు. సామాజికంగా అవసరమయ్యే థియేటర్, పబ్లిక్ హాల్ వంటివి కూడా గ్రామంలోనే అందుబాటులో ఉండాలని గాంధీజీ అనేవారు. ప్రతి గ్రామం పూర్తి అధికారాలతో భాసిల్లే ఒక స్వతంత్ర రిపబ్లిక్‌గా మనుగడ సాగించాలనేది గాంధీజీ భావన.

గాంధీజీ ఆకాంక్షించిన 'గ్రామ రిపబ్లిక్'లలో ప్రజాభాగస్వామ్యం సంపూర్ణంగా ఉండాలి. గాంధీజీ సిద్ధాంతాల్లో మినహా, ఏ ఇతర కేపిటలిస్టు, సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యవస్థల్లో అధికార వికేంద్రీకరణ కన్పించదు. ఈ వ్యవస్థలన్నీ అధికారాలను అగ్రస్థాయిలో కేంద్రీకరించే లక్ష్యం కలిగినవే. గాంధీజీ మాత్రమే అధికారాలన్నీ గ్రామస్థాయిలో కేంద్రీకృతం కావాలని చెప్పేవారు.

**వివిధ సందర్భాల్లో గాంధీజీ 'గ్రామ స్వరాజ్య' కలలను ఇలా ఆవిష్కరించారు:**

- గ్రామ పరిపాలన నిజంగా ప్రజా భాగస్వామ్యంతో కూడినదై ఉండాలంటే, గ్రామంలోని ప్రతి పురుషుడికి, ప్రతి స్త్రీకి గ్రామ పరిపాలనలో ఒక పాత్ర ఉండాలి. ఈ భాగస్వామ్యం గ్రామంలోని సమాజమంతటికీ మినహాయింపుల్లేకుండా వర్తించాలి.

- గ్రామ పంచాయితీలో తీసుకునే నిర్ణయాలన్నీ ఏకాభిప్రాయ సాధన ప్రాతిపదికపైనే జరగాలి. విభిన్న రాజకీయ పక్షాలు, విభిన్న మతాలు, విభిన్న కులాలు, వర్గాలు, సంస్కృతుల సమూహాల నుంచి ఏకాభిప్రాయం రూపొందాలి.

- గ్రామంలోని అట్టడుగు స్థాయి వ్యక్తికి కూడా వనరుల పంపిణీ జరగాలి. స్వల్పంగా అందుబాటులో ఉన్న వనరులను కూడా సమానంగా పంపిణీ చేయాలి. 'అంత్యోదయ' అనేది ఆయన భావన.

- గ్రామంలో తలెత్తే వివాదాలన్నీ గ్రామం నాలుగు దిక్కుల పరిధి లోపలనే పరిష్కరించుకోవాలి. ఈ తగాదాలను గ్రామం వెలుపలికి తీసుకెళ్లరాదు. దీని వల్ల వివాదాల భారం గ్రామ ఆర్థికవ్యవస్థను దెబ్బతీయకుండా ఉంటుంది.

- బయటి వనరులపై ఆధారపడనంత స్థాయిలో గ్రామ సామాజిక ఆస్తులను సృష్టించుకోవాలి. తద్వారా, వృద్ధులు, బలహీనులు, వితంతువులు, అనాథలైన మహిళలు, పిల్లలు, శారీరక, మానసిక వికలాంగులు, నిరుద్యోగులు, నిస్సహాయులకు ఈ గ్రామ సామాజిక ఆస్తుల నుంచి అవసరమైన సహాయాలన్నీ అందించవచ్చు.

అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా, గాంధీజీ కలలు గన్న 'గ్రామ స్వరాజ్య' భావనలన్నీ మరింతగా ఆచరణలోకి రావాలని, వాస్తవరూపం ధరించాలని కోరుకుందాం.

( కె. చంద్రమౌళి )

వార్తల్లో 'అపార్డ్'

# సమగ్ర గ్రామీణాభివృద్ధికి 'కీ క్యాప్' కార్యక్రమం

**దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 64 సంవత్సరాలయింది. ఇటీవల 65వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొన్నాం. ప్రకృతి వైపరీత్యాలు, జాతీయ, అంతర్జాతీయ సంక్షోభాలను అధిగమించి దేశమెంతో అభివృద్ధి చెందింది. భారత్ ఒక దేశంగా మనుగడ సాగించడం కష్టమేమోనని 1947లో మనం స్వాతంత్ర్యం సాధించినపుడు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమైన అనుమానాలు పటాపంచలు చేస్తూ, సార్వభౌమ స్వతంత్ర దేశంగా నిలిచాం. ఇరుగు పొరుగు దేశాలకన్నా అగ్రస్థానంలో ఉన్నాం. అయినా స్వాతంత్ర్య ఫలాలు గ్రామాలకు, అట్టడుగు వర్గాలకు సంపూర్తిగా అందనందున ఈ స్వాతంత్ర్యంతో మాకు ఒన గూడినదేమిటి? అనే ప్రశ్నలు పలుచోట్ల వింటుంటాం. 'మన స్వాతంత్ర్యం మేడిపండు - మన దారిద్ర్యం రాచపుండు' అని వెక్కిరించారు ఆరుద్ర. దేశ జనాభాలో 70 శాతం నివశిస్తున్న గ్రామాలలో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా 'గ్రామ స్వరాజ్యం' ఏర్పడుతుందని గాంధీజీ కలలు కన్నారు.**

భారతీయుల ఆత్మ గ్రామాల్లో ఉన్నదని, భారతదేశం గ్రామాల్లో జీవిస్తున్నదని మహాత్ముడు పదే పదే చెప్పేవారు. నేడు దురదృష్టవశాత్తు నగరాలతో పోలిస్తే గ్రామాలలో ఆశించిన రీతిలో అభివృద్ధి జరగలేదు.

ఇటీవల ఓ సందర్భంలో గౌరవ ముఖ్యమంత్రి గారు మన రాష్ట్రంలో దాదాపు 4500 గ్రామాలకు రోడ్డు వసతి లేదని విచారం వ్యక్త పరిచారు. దేశ ప్రథమ పౌరురాలు శ్రీమతి ప్రతిభాపాటిల్ గ్రామాలలో వైద్య సౌకర్యం లేక విస్తరిస్తున్న డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా లాంటి జ్వరాలు, పురుడు సందర్భంలో ప్రాణాలు కోల్పోతున్న మహిళల దీనస్థితిని గాంచి తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. రైతుల వ్యథలకు చలించి తక్షణం గ్రామీణ సమస్యల పరిష్కారంపై ఆసక్తి చూపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైతం సమగ్ర గ్రామీణాభివృద్ధికై చర్యలకు ఉపక్రమించాయి.

గ్రామాల దుర్భర పరిస్థితి రూపు మాపి, గ్రామీణుల జీవన ప్రమాణాలు పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ 2011-12 సంవత్సరానికి 87,800 కోట్ల రూపాయలు కేటాయించింది. గ్రామాలలో నిరుపేదలకు ఉపాధి, రక్షిత త్రాగునీరు, సంపూర్ణ పారిశుధ్యం కల్పించడం కోసం, తద్వారా గ్రామీణ పేదరిక నిర్మూలనకు ఈ నిధులు వెచ్చించబడతాయి. ఇందుకు తోడుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు 8 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. దేశ రక్షణ తర్వాత అత్యధిక నిధులు గ్రామీణాభివృద్ధికి కేటాయించబడ్డాయి. ఈ నిధులు సక్రమంగా వినియోగపడితే గ్రామాలు సంపూర్ణ స్వాతంత్ర్య ఫలాలు పొందగలవు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేయటం ద్వారా ప్రణాళికా రూపకల్పనలు, మార్పుల ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రయోగశాల నుండి క్షేత్రస్థాయికి, అనగా ప్రభుత్వం నుండి ప్రజలకు అందేట్లు చర్యలు తీసుకొంటున్నది.

ప్రభుత్వ పథకాల పట్ల అధికారులతో బాటు ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించి, పథకాల అమలులో ప్రజల భాగస్వామ్యం ఉండేట్లు చేయడానికి 'ల్యాబ్ టు లాండ్' కార్యక్రమం చేపట్టడం జరిగింది. మన రాష్ట్రంలో ఈ కార్యక్రమ విజయానికి 'కీక్యాప్' పేరున ఉద్యమం మొదలైంది. పథకాల పట్ల అవగాహన పెంపొందించు కొనడం ద్వారా అందరూ సంపూర్ణ లబ్ధిపొందగలరు. ఈ 'ల్యాబ్ టు లాండ్' 'కీ క్యాప్' కార్యక్రమాన్ని ప్రజల చెంతకు చేర్చడానికి రాష్ట్రంలో ఎంపిక చేసిన గ్రామాల్లో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కృషిచేస్తారు.



ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ (అపార్డ్) ఆధ్వర్యంలో 79 గ్రామాలకు చెందిన దాదాపు 1100 మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లను ఎంపిక చేసి, మొదటి దశ శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది. అపార్డ్ కమీషనర్ శ్రీ కె.చంద్రమౌళి, ఐ.ఏ.యస్. గ్రామీణ ప్రజల దుర్భర పరిస్థితులను సవివరంగా చెప్పి గ్రామాల పురోభివృద్ధికి కృషి చేయువలసిన అవశ్యకతను పేర్కొన్నారు. అపార్డ్‌లోని సుశిక్షితులైన అధికారులు భారత నిర్మాణ్ వాలంటీర్లను అభినందించి వారిని కార్యోన్ముఖులు గావించారు. తద్వారా రాష్ట్రంలో 22 జిల్లాల్లో కీ క్యాప్ కార్యక్రమం ప్రారంభమైనది.

శిక్షణ పొందిన భారత నిర్మాణ వాలంటీర్లు స్వచ్ఛందంగా తమ తమ గ్రామాలలో మద్యపానం, గుట్కా, పొగత్రాగడంపై నిషేధానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తూ అనేక చోట్ల లక్ష్యం సాధించారు. సంపూర్ణ పారిశుద్ధ్యానికి, ప్లాస్టిక్ నిషేధానికి, బడిమానిన పిల్లలను పాఠశాలకు పంపడానికి, చెట్లు నాటడానికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలలో ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పించడానికి, ప్రజల సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకునిరావడానికి వారు చేస్తున్న కృషి ఎంతో అభినందనీయం.

అపార్డ్ సంస్థ చేపట్టిన 'ల్యాబ్ టు లాండ్' - 'కీ క్యాప్' కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన అధ్యాయం ప్రారంభించిందని చెప్పవచ్చు.

**- పి. సిద్ధయ్య నాయుడు**
**సి.యస్.ఆర్.యం., అపార్డ్ -రాజేంద్రనగర్**



# అపార్డుకు 'నంది' అవార్డు

**వికలాంగుల సంక్షేమం కోసం పంచాయితీరాజ్ ప్రజాప్రతినిధులు, గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బంది, పౌరులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అపార్డు నిర్మించిన "మీరు ఆలోచించండి" అనే డాక్యుమెంటరీ ఫిల్మ్ 2010 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం నుండి వెండి నందిని దక్కించుకున్నది.**

సామాజిక స్పృహ కల్గించే చిత్రాల వర్గంలో ద్వితీయ స్థానాన్ని పొందిన "మీరు ఆలోచించండి"ని నిర్మించినందుకు అపార్డుకు వెండి నందితో పాటు, రూ. 15,000/-లు నగదు బహుమతిని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీ నిరంజన్‌కు కూడా రజత నందితో పాటు రూ. 10,000/- నగదు బహుమతి దక్కింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాణానికి కృషి చేసిన సిబ్బందిని అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి అభినందించారు. అపార్డుకు దక్కిన నంది అవార్డు అపార్డుపై మరింత బాధ్యతను పెంచుతోందని, సిబ్బంది ఈ మేరకు కృషిచేయాలని కమీషనరు ఉద్బోధించారు.

చిత్రానికి దర్శకత్వం వహించిన శ్రీ నిరంజన్‌ను కూడా కమీషనర్ అభినందించారు. ఈ చిత్రం గతంలో సాప్‌నెట్ - మన టివి ద్వారా, దూరదర్శన్ ద్వారా ప్రసారమై, పలువురి ప్రశంసలు అందుకుంది. ■

# భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు అరుదైన గౌరవం

## బీహార్‌కు రిసోర్సు పర్సన్‌లుగా వెళ్ళిన ఆంధ్రప్రదేశ్ బి.ఎన్.వి.లు








### అనిల్, రామచంద్రాపురం

మా గ్రామంలో బి.ఎన్.వి. లు చేస్తున్న సేవా కార్యక్రమాలను గూర్చి విన్న తరువాత బీహార్‌లోని వాలంటీర్లు చాలా స్ఫూర్తిపొందారు. తాము కూడా ఇటువంటి కార్యక్రమాలు చేపడతామని నిర్ణయించుకోవటం ఒక మంచి పరిణామం. ఈ అనుభూతి మరువలేనిది.

### రమేష్, గంగదేవిపల్లి

బీహార్‌ని సందర్శించి మా అనుభవాలను అక్కడి బి.ఎన్.వి.లతో పంచుకోవటం చాలా ఆనందంగా ఉంది. మేము చెప్పే ప్రతీ విషయాన్ని వాళ్ళు జాగ్రత్తగా నోట్ చేసుకున్నారు. మా గ్రామంలో కమిటీల పద్ధతి వారిని బాగా ఆకర్షించింది. ఈ అరుదైన అవకాశాన్ని అందించిన అపార్డుకు కృతజ్ఞతలు.

**ల్యాబ్ టు ల్యాండ్ కీ క్యాప్ కార్యక్రమంలో ఎంపిక చేయబడిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సేవలకు దేశవ్యాప్తంగా అరుదైన గుర్తింపు లభిస్తోంది.**

స్వంత పనులను ప్రక్కనపెట్టి గ్రామ వికాసానికి ముందుకు వచ్చి స్వచ్ఛందంగా సేవలను అందచేస్తున్న యువత అనుభవాలను వివిధ రాష్ట్రాలలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్లతో పంచుకొని వారిని ప్రేరేపింప చేయటానికి భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ శ్రీకారం చుట్టింది.

తొలివిడతగా బీహార్ రాష్ట్రంలోని బీహార్ షరీఫ్ సమితిలోని మానిక్‌పూర్ ఒకనామా గ్రామంలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు శిక్షణ ఇవ్వటానికి 2011 సెప్టెంబరు 5 నుండి 7 వరకు అపార్డు సీనియర్ ఫాకల్టీ సుభాష్ చంద్రగౌడ్ నేతృత్వంలో కరీంనగర్ జిల్లా రామచంద్రపూర్ నుండి కె. అనిల్, వరంగల్ జిల్లా గంగదేవిపల్లి గ్రామం నుండి జి. రమేష్ లు ఒక బృందంగా బీహార్‌ను సందర్శించి ప్రజాభాగస్వామ్య పద్ధతిలో గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించటంలో స్థానిక బి.ఎన్.వి.లకు మెళకువలు నేర్పించారు. ■









# అపార్డును సందర్శించిన అంతర్జాతీయ విద్యార్థులు

హైదరాబాద్‌లో గల జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న అంతర్జాతీయ విద్యార్థుల బృందం సెప్టెంబర్ 7న అపార్డును సందర్శించింది. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి రంగంలో శిక్షణ అందచేయుటానికి అపార్డు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించటానికి ఈ బృందం అపార్డును సందర్శించింది. ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా, నేపాల్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ తదితర దేశాల నుండి విచ్చేసిన విద్యార్థులు అపార్డు ఫ్యాకల్టీతో సంభాషించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ఈకార్యక్రమాన్ని సమన్వయపర్చిన అపార్డ్ ప్రొఫెసర్ సూర్యనారాయణ రెడ్డి తొలుత గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది, పంచాయితీరాజ్ ప్రజాప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలకు అపార్డ్ చేస్తున్న కృషిని గూర్చి వివరించారు. అనంతరం 'అపార్డ్' ఇటీవల కాలంలో ప్రారంభించిన కీక్యాప్ ప్రయోగాన్ని గూర్చి వివరించారు. "గ్రామ సభను బలోపేతం చేయటానికి, గ్రామ అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేయటానికి అపార్డ్ చేస్తున్న కృషిని గూర్చి ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో అపార్డులో వివిధ సెంటర్ హెడ్‌లు శ్రీ డా. కృష్ణమోహనరావు, ప్రొ.లీలాప్రసాద్, డా. వి.ఎస్.ఎస్. ప్రసాద్, ఫ్యాకల్టీ సభ్యులు స్టీఫెన్‌నీల్, శ్రీమతి శ్రీలక్ష్మి, శ్రీమతి సత్యవతి, కన్సల్టెంట్ శ్రీపతిరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.ఐ.ఆర్.డి. ప్రొఫెసర్ శ్రీమతి జయలక్ష్మి సమన్వయపర్చారు. సందర్శకులందరికీ అపార్డ్ జ్ఞాపికలను బహూకరించారు.





# అపార్డును సందర్శించిన విస్తరణ శిక్షణా కేంద్ర జాతీయ బృందం

**ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ అమలుచేస్తున్న ల్యాబ్ టు ల్యాండ్ - కీ క్యాప్ కార్యక్రమ వ్యూహాలను గూర్చి తెలుసుకోవటానికి ఎన్.ఐ.ఆర్.డి. ఆధ్వర్యంలో 70 మందితో కూడిన విస్తరణ శిక్షణా కేంద్ర అధ్యాపకుల జాతీయ బృందం 07.09.2011న అపార్డును సందర్శించింది.**

ఈ బృందంలో దేశం నలుమూలాల గల సుమారు 70 ఇ.టి.సిల ప్రతినిధులు ఉన్నారు అపార్డు అనుసరిస్తున్న శిక్షణా వ్యూహాలను గూర్చి డిప్యూటీ డైరెక్టర్, రీసెర్చి & ట్రైనింగ్ డా॥ కృష్ణమోహన్ వివరించారు. ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం అమలు తీరుతెన్నులను డా॥ శివశంకర్‌ప్రసాద్ సందర్శకులకు వివరించారు. ప్రణాళికాబద్ధమైన ప్రక్రియ ద్వారా చీదేడు గ్రామంలో తీసుకువచ్చిన మార్పుపై అపార్డు రూపొందించిన చలనచిత్రం సందర్శకులకు చూపి తదనంతరం చేరి సందేహాలను నివృత్తి చేసారు.

ఈ సందర్భంగా భారత్ నిర్మాణ్ వాలంటీర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన శిక్షణా విధానంపై తీసిన చిత్రం, వాలంటీర్లను ప్రేరేపించటానికి రూపొందించిన చిత్రాలను కూడా ప్రదర్శించారు. ఈ చిత్రాలను వీక్షించిన అనంతరం విస్తరణ కేంద్ర అధ్యాపకులు పలువురు మాట్లాడుతూ, ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమంలో ఇ.టి.సి.లు నిర్వర్తించాల్సిన బాధ్యతలు స్పష్టంగా తెలిశాయని అన్నారు. అనంతరం 08.09.2011న ఈ బృందం సభ్యులు చీదేడు గ్రామాన్ని సందర్శించి, గ్రామం సాధించిన ప్రగతిని ప్రత్యక్షంగా తిలకించి సంతృప్తి వ్యక్తం చేసారు. అపార్డులో జరిగిన కార్యక్రమాన్ని ఫాకల్టీ డా॥ అరుణజ్యోతి, క్షేత్రస్థాయిలో జరిగిన కార్యక్రమాన్ని రిసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ సమన్వయ పర్చారు. ■

# త్రివేండ్రంలో జరిగిన జాతీయ సమ్మేళనంలో పాల్గొన్న కొటాల భారత్ నిర్మాణ్ వాలంటీర్ సుధ




**ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం అమలుపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల అధిపతులు, ఫాకల్టీలతో సెప్టెంబర్ 15 నుండి 17వ తేదీ వరకు త్రివేండ్రంలో జరిగిన సమ్మేళనంలో మన రాష్ట్రం నుండి చిత్తూరు జిల్లా కొటాల గ్రామపంచాయితీ నుండి భారత్ నిర్మాణ్ వాలంటీర్ శ్రీమతి సింగుసుధ పాల్గొన్నారు.**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సింగుసుధ మాట్లాడుతూ, అపార్డ్ నుండి పొందిన స్ఫూర్తితో తమ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమానికి పూర్వం తమ గ్రామంలో వివిధ కారణాల రీత్యా అభివృద్ధి కుంటుపడిందని, ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం అమలు ద్వారా తమ గ్రామంలో ప్రస్తుతం మద్యపానం నిషేధించామని, గుట్కా వినియోగం నిషేధించామని, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు వారానికొకసారి శ్రమదానం చేయటం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటున్నామని, పంచాయితీ వద్ద నిధులు లేనందున తామే స్వయంగా రూ. 30,000/- విరాళాలు పోగు చేసుకొని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలియచేసారు. పిల్లలకు క్రీడా పోటీలు నిర్వహించటం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేయటం, గ్రామానికి బస్ సౌకర్యం పునరుద్ధరించుకొన్నామని, రైల్వే శాఖతో సంప్రదించి, లెవెల్ క్రాసింగ్ పునరుద్ధరించుకొన్నామనీ, ఇంకా ఎన్నో విజయాలు సాధించామని అన్నారు.

పట్టణాలలో ఉన్న సౌకర్యాలను గ్రామాలలో కూడా నెలకొల్పిన నాడు పట్టణాలు - గ్రామాల మధ్య ఉన్న అంతరం తొలగిపోయి గ్రామసేవలు కూడా అభివృద్ధికి చిరునామాలుగా నిలుస్తాయన్నారు. తమ గ్రామాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా, సాంప్రదాయేతర ఇంధన వనరులు వినియోగించుకొని హరిత గ్రామంగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షను వ్యక్తం చేసారు.

కీ క్యాప్ కార్యక్రమం తమకొక వరంలా లభించిందని, ఈ కార్యక్రమాన్ని అందించిన అపార్డ్ కమీషనరుకు తన కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ సమ్మేళనానికి హాజరయిన కొటాల గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ మదన్ మోహన్‌నాయుడు మాట్లాడుతూ, తాను 5 సంవత్సరాలలో సాధించలేనిది 30 మంది యువకుల సాయంతో 6 నెలలల్లోనే సాధ్యమయిందని అన్నారు. చిత్తూరు జిల్లా పరిషత్తు సి.ఇ.ఓ. నాగేశ్వరరావు మాట్లాడుతూ, కొటాల భారత్ నిర్మాణ్ వాలంటీర్లు స్ఫూర్తిదాయకంగా పనిచేస్తున్నారని, వారి స్ఫూర్తిని చూసి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందచేస్తోందని తెలియచేసారు.



# ముగిసిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణ

**ల్యాబ్ టు ల్యాండ్ 'కీ క్యాప్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 79 గ్రామాల నుండి ఎంపిక చేయబడిన 2127 మంది భారత్ నిర్మాణ వాలంటీర్లకు సెప్టెంబరు మాసాంతారానికి శిక్షణ పూర్తి చేయడం జరుగుతుందని, ఇంతవరకూ 9 బ్యాచ్‌లలో 1737 మందికి 3 రోజుల ప్రత్యేక శిక్షణ అందచేయటం జరిగిందని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి తెలియచేసారు.**

స్వచ్ఛంద సేవతో గ్రామాల రూపురేఖలను మార్చటానికి భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేస్తున్న కృషి దేశవ్యాప్తంగా మన్ననలను పొందుతోందని, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసి గ్రామాభివృద్ధిని వేగవంతం చేయాలని కోరారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేపట్టిన మంచిపనుల ప్రభావం కీ క్యాప్ గ్రామాల చుట్టు ప్రక్కలనున్న గ్రామాలపై కూడా ప్రసరిస్తోందని, చాలా గ్రామాల నుండి తమ గ్రామాలను కూడా కీ క్యాప్ గ్రామాలుగా ఎంపిక చేయాలనే అభ్యర్థనలు అపార్డుకు అందుతున్నాయని అన్నారు.


ఈ ల్యాబ్ టు ల్యాండ్ కీ క్యాప్ విధానంలో గ్రామాలు గతంలో కంటే మెరుగైన ప్రగతిని సాధించాలని అన్నారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా అమలు అయ్యేలాగా చూడటంతో పాటు కీ క్యాప్ గ్రామాలు సంపూర్ణ పారిశుద్ధ్యం, సంపూర్ణ ధూమపాన రహిత గ్రామాలు, సంపూర్ణ మద్యపాన రహిత గ్రామాలుగా, వివాదరహిత గ్రామాలుగా, పర్యావరణ మిత్ర గ్రామాలుగా రూపాంతరం చెందే విధంగా భారత్ నిర్మాణ్ వాలంటీర్లు కృషి చేయాలన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమానికి సి.ఎస్.ఆర్.ఎం. సెంటర్ హెడ్ శ్రీ హెచ్. కూర్మారావు సమన్వయకర్తగా, ఫాకల్టీ సభ్యులు గాంధీ, లక్ష్మీనారాయణ, సిద్ధయ్యనాయుడు, మంజుల కోర్సు డైరెక్టర్లుగా వ్యవహరించారు. శిక్షణలో వివిధ అంశాలను సీనియర్ ఫాకల్టీ సభ్యులు ప్రొ. సూర్యనారాయణరెడ్డి, డా॥ కృష్ణమోహన్, డా॥ లీలాప్రసాద్, శ్రీమతి విజయలక్ష్మి, డా॥ నాగరాజు, ఫా. సుభాష్ చంద్రగౌడ్, డా॥ వి.ఎస్.ఎస్. ప్రసాద్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మణ్, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సిబ్బంది తదితరులు నిర్వహించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య పరిపాలనా వికేంద్రీకరణకు అంకురార్పణ షాద్‌నగర్ పంచాయతీ సమితికి 1959లో నాటి ప్రధాని నెహ్రూ ప్రారంభోత్సవం

## ప్రజలు చొరవచేసుకుని దేశాభివృద్ధికి పూనుకోవాలని నెహ్రూ ఉద్బోధ

(ఆంధ్రపత్రిక 1959, అక్టోబర్ నాటి సంచిక నుంచి పునర్ముద్రణ)



**రాష్ట్రంలో 3 అంచెల పంచాయితీరాజ్ పాలన అక్టోబరు 11, 1959 నుండే మొదలు అయ్యింది. 3 అంచెల పంచాయితీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన రెండవ రాష్ట్రం మన రాష్ట్రమే. గాంధి జయంతి, పంచాయితీరాజ్ వ్యవస్థల ఆవిర్భావంతో అక్టోబరు మాసం ఎంతో ప్రాధాన్యత సంతరించుకొన్నది. పంచాయితీరాజ్ వ్యవస్థను ప్రారంభించిన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి సంజీవరెడ్డిల ప్రసంగంలోని ముఖ్యాంశాలు పాఠకులకోసం - ఎడిటర్**

**హైదరాబాద్, అక్టోబరు 11 : పంచాయతీ సమితులూ, జిల్లా పరిషత్తుల కొత్త చట్టం ప్రకారం మొట్టమొదటిదిగా ఏర్పడిన షాద్‌నగర్ పంచాయతీ సమితికి ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఇవాళ ప్రారంభోత్సవం చేయడంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య పరిపాలన వికేంద్రీకరణకు నాంది అయింది. సమాజవికాస కార్యక్రమాలను అమలు జరిపే బాధ్యత, అభివృద్ధి శాఖ బాధ్యతలూ ఇక ఈ పంచాయతీ సమితికి మారుతవి.**

ప్రతి గ్రామంలోనూ పాఠశాల, పంచాయతీ, సహకార సంఘం ఉండాలని చెబుతూ ప్రజాస్వామిక వికేంద్రీకరణ విధానాన్ని ప్రవేశపెట్టడంలో ముందంజ వేసినందుకు ఆంధ్రప్రదేశ్‌నూ, రాజస్థాన్ రాష్ట్రాన్ని శ్రీ నెహ్రూ అభినందించారు.



ఆంధ్రపత్రిక
THE ANDHRA PATRIKA - MADRAS

ఆంధ్రలో ప్రజాస్వామ్య పరిపాలనా వికేంద్రీకరణకు అంకురార్పణ

షాద్‌నగర్ పంచాయతీ సమితికి ప్రధాన మంత్రిచే ప్రారంభోత్సవం

ప్రజలు చొరవచేసుకుని దేశాభివృద్ధికి పూనుకోవాలని నెహ్రూ ఉద్బోధ

శీఘ్రప్రగతి ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థలోనే సాధ్యం

హైదరాబాద్‌కు దాదాపు ముప్పై మైళ్ళ దూరంలో ఉన్న షాద్‌నగర్‌కు ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ వెళ్ళగానే ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవ రెడ్డి స్వాగతం చెప్పారు. దేశ ప్రజాస్వామ్య ప్రగతిలో ప్రధాన ఘట్టమైన పంచాయితీ సమితులూ, జిల్లా పరిషత్‌ల నిర్మాణ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నాందీప్రసావన చెయ్యడం హర్షించదగినదని గవర్నరు భీమసేన్ సచార అన్నారు.

విజయదశమి నాడు ఈ ప్రజాస్వామిక వికేంద్రీకరణ ఈ రాష్ట్రంలో ప్రారంభమవుతున్నందుకు హర్షం ప్రకటిస్తూ ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ ఇట్లా అన్నారు.

"బ్రిటీష్ పాలన అంతమైన తరువాత భారత ప్రజల నూతన యాత్ర ప్రారంభమైనది. పరాయి ప్రభుత్వం, నిజామ్ రాజరికం అదృశ్యమై ప్రజా పరిపాలన ఏర్పడినది. దేశాభివృద్ధి కార్యక్రమాలూ, సమాజ వికాస కార్యక్రమాలూ కొంత కాలంగా దేశంలో కొనసాగుతున్నవి. కానీ, వీటిలో ఇంతవరకూ అధికారులూ, ఉద్యోగులూ ప్రధాన బాధ్యతలు వహిస్తున్నారు. ఇకముందు ఈ కార్యక్రమాలను రూపొందించడంలోనూ, నిర్వహించడంలోనూ, ప్రజలే ప్రధానపాత్ర వహించవలసి ఉంటుంది. అధికారులు కేవలం ప్రజల సేవకులుగా ఉంటారు. ఈ ఆశయసాధనకు అవకాశం కలిగించేటందుకే పంచాయితీ సమితులను ఏర్పాటు చేస్తున్నారు.

పట్టణాలలో ప్రజలు సుఖంగా ఉండవలసింది

గానీ, గ్రామాలు సస్యశ్యామలం గానూ, సౌభాగ్యవంతం గానూ ఉండకపోతే దేశాభ్యుదయమే జరగదు. పొలాల్లో, కర్మాగారాలలో ఉత్పత్తి వృద్ధిచెందాలి. కర్మాగారాలలో తయారవుతున్న వస్తువులు ప్రజలకు చాలా అవసరమైనవే కానీ వాటిని కొనేటందుకు ప్రజల వద్ద ధనం ఉండాలి. గ్రామాలలో మీరు ఎక్కువ పండిస్తే, మీకు కావలసిన వాటిని మీరు కొనగలుగుతారు. అయితే అధికోత్పత్తికి తోడ్పడే విద్య, పరిజ్ఞానం మీకు లభించాలి."

### గ్రామ గ్రామానికి పంచాయితీ, సహకార సంఘం

ప్రజాస్వామిక వికేంద్రీకరణ వల్ల గ్రామాలలోని ప్రజలపై గురుతరమైన బాధ్యతలు పడతాయి. వాటిని మీరు శ్రద్ధగా నిర్వర్తించాలి. ఢిల్లీలో లోక్ సభ ద్వారానూ, హైదరాబాద్‌లో శాసన సభ ద్వారానూ ఇంత వరకూ ప్రజా స్వామ్య పరిపాలన కొనసాగినది. ఇక పంచాయితీ సమితుల ద్వారా స్వయంగా మీరే ఈ కార్యభారం వహించవలసి ఉంటుంది. ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ పంచాయితీ ఏర్పాటు కావాలి.

గ్రామాలలో ఆర్థిక వ్యవహారాలన్నీ సహకార పద్ధతిలో జరగాలని మన కోరిక. ప్రతి గ్రామంలోనూ సేవా సహకార సంఘం ఏర్పడాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి సంఘాలకు ప్రాముఖ్యం ఇస్తున్నారని తెలిసి సంతోషపడ్డాను. ఇవి జయప్రదం కావాలని కోరుతున్నాను. ఆర్థిక జీవితాన్ని సహకార పద్ధతిలో నడపడం సులభం కాదు. గ్రామంలో విద్యాలయం ఉంటే ప్రజలకు అవసరమయ్యే పరిజ్ఞానం లభిస్తుంది. అందుకే ప్రతి ఊళ్ళోనూ పాఠశాల, పంచాయితీ, సహకార సంఘం ఉండాలి. వీటిని సాధించడం కోసమే పంచవర్ష ప్రణాళికలను రచించి అమలు చేస్తున్నాము. ఈ ప్రణాళిక రచనలోనే కాక నిర్వహణలో కూడా ప్రజలే ఇక బాధ్యత వహించవలసి ఉంటుంది. అధికారుల ద్వారా పని జరిపించే కాలం గతించినది.

### ఉమ్మడి సహకార వ్యవసాయం

చిన్న చిన్న భూమి ఖండాలున్న రైతులు ఖర్చులు కలిసి రావడానికి వీలుగా ఇష్టమైతే ఉమ్మడి సహకార వ్యవసాయ క్షేత్రంలో చేరవచ్చు. విధిగా చేరితీరాలనే బలవంత మేమీ ఉండదని ప్రారంభోత్సవ సభలో ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ స్పష్టంచేశారు. ఇంకా ఇట్లా చెప్పారు : ఇష్టమైతే రైతులు తమంతట తాము ఉమ్మడి సహకార వ్యవసాయ క్షేత్రాలలో చేరవచ్చు. భూముల యాజమాన్యం హక్కును మార్చేది లేదు. సహకార వ్యవసాయ క్షేత్రంలో ఉండటం బాగా లేదని ఏ క్షణాన అనుకుంటే ఆ క్షణాన రైతులు బయటికి వచ్చే పూర్తి స్వేచ్ఛ ఉంటుంది.

### సంజీవ రెడ్డి ప్రసంగం

జిల్లా కొకటి చొప్పున పంచాయతీ సమితులను తాత్కాలికంగా రాష్ట్ర ప్రభుత్వం కిందటి సంవత్సరం ఏర్పాటుచేసి, ఆయా ప్రాంతాలలో అభివృద్ధి పనులను అమలు జరిపే బాధ్యతలను 20 పంచాయితీ సమితులకు ఒప్పచెప్పిందని ప్రధాన మంత్రికి స్వాగతం చెబుతూ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి అన్నారు. ఇంకా ఇట్లా చెప్పారు: "తాత్కాలిక" పంచాయితీ సమితులు సంతృప్తికరంగా పనిచేసి, కేవలం అధికారాలు మాత్రమే ఉండే సంస్థలకంటే, ప్రజలు తమ వ్యవహారాలను బాగా, సమర్థవంతంగా చక్కదిద్దుకోగలరన్న నిబ్బరం కలిగించి.

"విద్య, ఆహార ధాన్యాల ఉత్పత్తి, పంటల రక్షణ, చిన్న నీటి వనరులు, తక్కువ మొత్తాలను నిలవచేసే ఉద్యమం వంటి వాటిలో పంచాయితీ సమితులు లేని అభివృద్ధి కేంద్రాలలో కంటే అవి ఉన్న ప్రాంతాలలో చాలా ఎక్కువ కృషి జరిగింది. మూడు పంచాయితీ సమితుల ప్రాంతాలలో ప్రత్యేకంగా కృషిచేయగా, ఆయా ప్రాంతాలలోని పాఠశాలకు వెళ్ళే వయసువచ్చిన పిల్లలలో నూటికి 25 మంది దాకా పాఠశాలల్లో చేరడం ప్రత్యేకంగా ప్రశంసించదగిన సంగతి". ఆ తరువాత జిల్లా పరిషత్తులలో పంచాయతీ సమితుల ఒప్పందంలోని అంశాలను వివరిస్తూ, పంచాయతీ మొదటి ప్రజా స్వామిక సంస్థ అనే పద్ధతిలో ఈ వికేంద్రీకరణ విధానం పనిచేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు. ఆయా ప్రాంతాలలోని అభివృద్ధి పనులన్నింటినీ ప్రజల ప్రతినిధులకు ఒప్పచెప్పడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఇంకా ఇలా తెలిపారు. "అభివృద్ధి పనులను అమలు జరపడానికి కావలసిన డబ్బును సమకూర్చుకోవడానికి వీలుగా పన్నులు విధించే అధికారం కూడా ఈ సంస్థలకు ప్రభుత్వం ఇచ్చింది. ప్రభుత్వం కూడా కొంత డబ్బు ఇస్తుంది. తగినంత మంది ఉద్యోగులను ప్రభుత్వం ఇస్తుంది".

ఇదంతా కొత్త సీసాలో పోసిన పాతనీళ్ళననే విమర్శ అర్థం లేనిది. పాత సంస్థలు జిల్లా బోర్డులూ, తాలూకా బోర్డులూ ప్రజల అభీష్టాలకు అనుగుణంగా వ్యవహారాలను నిర్వర్తించలేదు." సభకు గవర్నరు శ్రీ భీమసేన్ సచార్ అధ్యక్షత వహించారు.

ఈ కొత్త పథకం ఉద్దేశ్యాలను కేంద్ర సమాజ వికాస శాఖ ఉపమంత్రి శ్రీ బి.ఎస్. మూర్తి విశదం చేసారు..

ఆర్థిక, ప్రణాళికల శాఖ మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి, తెలంగాణా ప్రాంతీయ సంఘం అధ్యక్షుడు అచ్యుత రెడ్డి, శాసన సభ సభ్యురాలు శ్రీమతి షాజహాన్ బేగం కూడా ప్రసంగించారు. ప్రధాని హిందీ ప్రసంగాన్ని తెలుగులోకి శ్రీ పి.వి. నరసింహారావు తర్జుమా చేశారు. షాద్ నగర్ పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ రామ్‌దేవ్ రెడ్డి వందన సమర్పణ చేశారు.

షాద్‌నగర్ పంచాయితీ సమితి పర్యవేక్షణలో 52,000 జనాభాలో 66 గ్రామాలు ఉండేవి. వాటి విస్తీర్ణం 280 చదరపు మైళ్ళు. జాతీయ విస్తరణ కేంద్రం షాద్‌నగర్‌లో 1954 అక్టోబరులో ఏర్పడింది. 1956 ఏప్రియల్‌లో సమాజాభివృద్ధి కేంద్రంగా రూపొందించారు. ఈ కేంద్రం అధ్వర్యాన విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలుజరిపే కృషి 1959 మార్చిలో పూర్తి అయినది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ విధానాన్ని అమలు జరపాలని కిందటి సంవత్సరం జూలైలో నిర్ణయించిన 20 సమితి బ్లాకలలో ఇదొకటి. ■

# తరుగుతున్న అటవీ సంపద - పెరుగుతున్న ప్రమాదం



**అడవులు ప్రకృతి విధానాన్ని, ధర్మాన్ని, పర్యావరణాన్ని కాపాడే వనరులు. సకల జీవరాశులకు స్వచ్ఛమైన గాలి, నీరు, భూమి, వాతావరణాన్ని అందించడంలో అడవులు ప్రముఖ పాత్ర వహిస్తాయి. మానవ జీవితానికి అవసరమైన ఆహారం, నిత్యావసరాలు, ఔషధాలను కొన్ని తరాల నుండి అడవులే అందిస్తున్నాయి. ఇంతటి మేలు చేసే అడవులను మనిషి తన అభివృద్ధి పేరుతో నరికి వేస్తున్నాడు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో వ్యవసాయ విస్తరణ, పారిశ్రామికీకరణ, అంతర్జాతీయ వ్యాపారాభివృద్ధి పేరుతో అడవులను నరికి వేయడం జరుగుతుంది. కాని ప్రత్యామ్నాయం ఆలోచించటం లేదు. దీని వలన భవిష్యత్‌లో మానవ సమాజం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది.**

మన రాష్ట్రంలో భూవినియోగాన్ని పరిశీలిస్తే, మొత్తం భూభాగం 2,75,068 చ.కి.మీ. విస్తీర్ణం కలిగి ఉంది. ఈ భూభాగంలో వ్యవసాయ నిమిత్తం 1,68,821 చ.కి.మీ (61.4%) చాలా ఎక్కువ భాగం వినియోగించబడుతుండగా, అడవులు 56,013 (20.4%) చ.కి.మీ. విస్తీర్ణం కలిగి రెండవ స్థానం ఆక్రమిస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం, ఒక దేశం లేదా రాష్ట్రం మొత్తం భూ భాగంలో 25%-30% విస్తీర్ణం వరకు అడవులు తప్పనిసరిగా ఉండాలి అని అభిప్రాయ పడడం జరిగింది. ఇది పర్యావరణ పరిరక్షణకు అత్యవసరంగాను, ముఖ్యమైనదిగాను గుర్తించడం జరిగింది. కాని మన రాష్ట్రంలో అడవుల విస్తీర్ణం 20.4% శాతంగా మాత్రమే ఉంది. పచ్చిక బయళ్ళను కలిపితే 22.3% శాతం మాత్రమే ఉంది. (Forest dept (2010), State of Forest Report).

మన రాష్ట్రంలో అడవుల విస్తీర్ణంలో వస్తున్న మార్పును గమనిస్తే, 1956-57లో 59,243.2 చ.కి.మీ. ఉండగా, 1960-61వ సంవత్సరానికి 64,012.91 చ.కి.మీ. వరకు విస్తీర్ణం పెరిగింది. అనగా 8.05 శాతం మేరకు పెరిగినట్లు ప్రభుత్వ లెక్కలు తెలియజేస్తున్నాయి. వాస్తవానికి ఇది ఏవిధంగా పెరిగిందో అర్థం చేసుకోవాలంటే, అడవులను, ప్రభుత్వం వర్గీకరణ ప్రకారం వచ్చిన మార్పుని గమనించాలి. ప్రభుత్వ వర్గీకరణ ప్రకారం మొత్తం అడవులను, రిజర్వ్, రక్షిత రకాలుగా విభజించడం జరిగింది. దీని ప్రకారం 1960-61కి అడవుల విస్తీర్ణం పెరగడానికి కారణం, చెట్లున్న పచ్చిక బయళ్ళను సాధారణ లేదా వర్గీకరణ చేయని అడవులుగా గుర్తించటం ద్వారా అదనంగా అడవుల విస్తీర్ణం పెరిగిందిగానీ, అవి ప్రభుత్వం ద్వారా గాని, ప్రజల ద్వారా గాని పెంచబడినవి కావు అనేది అర్థం అవుతుంది. 1970-71 సంవత్సరానికి మొత్తం అటవీ భూమి 64,956.66 చ.కి.మీ. వరకు పెరిగింది, అనగా 1.47 శాతం పెరిగింది. కాని, రిజర్వ్ అడవుల విస్తీర్ణం 40345.35 చ.కి.మీ (1960-61) నుండి 44756.85 చ.కి.మీ (1970-71) వరకు పెరిగింది, అంటే, రిజర్వ్ అడవులు 10.41 శాతం పెరిగాయి. కాని మొత్తం అడవుల విస్తీర్ణం కేవలం 1.47 శాతం మాత్రమే పెరిగింది. దీనికి కారణం, సాధారణ లేదా వర్గీకరణ చేయని అడవులలో ఎక్కువ భాగం రిజర్వ్ అడవులుగా గుర్తించటం ద్వారా రిజర్వ్ అడవుల విస్తీర్ణం మాత్రమే పెరిగి, మొత్తం అడవుల విస్తీర్ణం స్థిరంగా ఉంది. మొత్తం అడవుల విస్తీర్ణం 1980-81లో 63,971.44 చ.కి.మీ ఉండగా, అది 1990-91 సంవత్సరానికి 63,779.22 చ.కి.మీ.లకు తగ్గింది. అదే విధంగా, 1970-71లో రక్షిత అడవుల విస్తీర్ణం 19,050-39 చ.కి.మీ. నుండి 13,141.27 చ.కి.మీ (1980-81)కి తగ్గింది. మరొకసారి 12,362. 76 చ.కి.మీ (1990-91)కి తగ్గింది. కాని రిజర్వ్ అడవుల విస్తీర్ణం కొంతమేరకు పెరిగింది. రక్షిత అడవులలోని కొంతభాగం, రిజర్వ్


అడవిగా ప్రకటించడమే దీనికి కారణం. మొత్తం మీద మన రాష్ట్రంలో 1970-71 సం॥ నుండి 2001-08 సంవత్సరానికి అడవుల విస్తీర్ణం 64,956.66 చ.కి.మీ నుంచి 63,814.00 చ.కి.మీ.లకు తగ్గింది. అంటే 1142చ.కి.మీ. మేర అడవులు అదృశ్యమైనాయి. (Forest dept (2009), Forest and Figures).


కాని అడవుల అవసరాలు మాత్రం క్రమేపీ పెరుగుతూ వస్తున్నాయి 1956-57లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభా 3.31కోట్లు ఉండగా, 2007-08వ సంవత్సరానికి 7.62 కోట్లకు పెరిగింది. తలసరి అటవీ ప్రాంతం 1956-57లో 0.18 హెక్టార్లు ఉండగా, ఇది 2007-08 సంవత్సరానికి 0.11 హెక్టార్లకు తగ్గింది. అనగా మానవ సమాజానికి అడవుల నుండి వచ్చే ఆహారం, ఔషదాలు, ముడిసరకులు చాలా వరకు కొరత కానున్నాయనేది స్పష్టంగా అర్థమవుతుంది. అడవుల నుండి ప్రజలు అనేక రకాలుగా లబ్ధిపొందుతున్నారు, ఒక్కసారి మనం పరిశీలించినట్లయితే, అడవులు పర్యావరణాన్ని కాపాడడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి, సామాన్య ప్రజలకు జీవనోపాధిగా ఉపయోగపడుతున్నాయి.

### అడవులు - పర్యావరణం

పర్యావరణ పరిరక్షణలోను, సమతౌల్యాన్ని, జీవరాశుల వైవిధ్యాన్ని, కాపాడడంలోను, వాతావరణంలోని ఉష్ణోగ్రతలను నియంత్రించడం లోను, వివిధ జీవరాశులకు వాటి అవసరాన్ని బట్టి, వైవిధ్య భరితమైన ఆహారాన్ని, పోషకాలను అందించడంలోను అడవులు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం భూభాగంలో 22.1 శాతంగా ఉండగా, ఒక సంవత్సరకాలంలో వర్షపాతం 500 మి.మీ నుండి 1300 మి.మీ వరకు కురుస్తుంది. ఉష్ణోగ్రతలు అత్యల్పం 8°C నుండి అత్యధికం 52°C వరకు రికార్డు అవుతుంది. అడవులు ఇప్పటికన్నా తగ్గినట్లయితే, వర్షపాతం తక్కువ అవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. నీటినిల్వలు భూమిలోపల, బయట తగ్గుతాయి.

ఆంధ్రప్రదేశ్‌లో గమనిస్తే, పచ్చదనం వర్షపాతాన్ని, ఉష్ణోగ్రతలను ఏ విధంగా నియంత్రిస్తుందో అర్థం చేసుకొనవచ్చు. మన రాష్ట్రంలోని






రాయలసీమ, తెలంగాణా, ఆంధ్రా ప్రాంతాలను 2005-06 సం॥లో పరిశీలిస్తే, రాయలసీమ ప్రాంతంలో 67,10,134 చ.హెక్టార్లు విస్తీర్ణం ఉండగా, పచ్చదనం 15,04,936 చ. హెక్టార్లు (22.4%) విస్తీర్ణం ఉంది. తెలంగాణ ప్రాంతంలో 1,14,54,298 చ.హె. విస్తీర్ణం ఉండగా, పచ్చదనం 28,85,370 చ.హె. ఉంది. (25.2%) అదే ఆంధ్రప్రాంతం 92,52,615 చ.హె. ఉండగా, పచ్చదనం 27,85,660 చ.హె (30.1%)గా ఉంది అంటే, 2005-06 సం॥కి, రాయలసీమలో, తెలంగాణలలో కన్న ఆంధ్రప్రాంతంలో పచ్చదనం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది.

వర్షపాతం విషయంలో మూడు సంవత్సరాలకు సగటు విలువ తీసుకోవడం వలన సమగ్రంగా అర్థం చేసుకొనవచ్చు. 2004-05, 2005-06, 2006-07 సంవత్సరాలకు సగటు వర్షపాత నమోదును మూడు ప్రాంతాలలో పరిశీలిస్తే, రాయలసీమలో వర్షపాతం సంవత్సరానికి సగటు 671 మి.మీ. కురవగా, తెలంగాణలో 878 మి.మీ., ఆంధ్రప్రాంతంలో 1032 మి.మీ. నమోదు అయింది. దీనిని బట్టి ఎక్కువ పచ్చదనం ఉన్న ఆంధ్రలో ఎక్కువ వర్షపాతం, తక్కువ పచ్చదనం ఉన్న రాయలసీమలో తక్కువ వర్షపాత నమోదు గమనించవచ్చు. అదేవిధంగా ప్రాంతాల వారీగా గమనిస్తే, తెలంగాణ ప్రాంతంలో పచ్చదనం తక్కువగా 16.5% ఉండగా, వర్షపాతం తక్కువగా 623 మి.మీ సగటు నమోదు అయింది. పచ్చదనం ఎక్కువగా 50.3% ఉన్న ఖమ్మం జిల్లాలో, వర్షపాతం సగటు ఎక్కువగా 1226 మి.మీ. నమోదు అయింది. అదే విధంగా రాయలసీమ ప్రాంతంలో పచ్చదనం తక్కువగా ఉన్న అనంతపురం జిల్లాలో, వర్షపాతం తక్కువగా 545 మి.మీ, పచ్చదనం ఎక్కువగా 30.1% ఉన్న చిత్తూరు జిల్లాలో, వర్షపాతం ఎక్కువగా 915 మి.మీ. గా నమోదు అయింది. అదేవిధంగా ఆంధ్రప్రాంతంలో కూడా పచ్చదనం ఎక్కువగా 40.8%గా ఉన్న విశాఖపట్నం జిల్లాలో వర్షపాతం ఎక్కువగా 1143 మి.మీ.లుగా, పచ్చదనం తక్కువగా 26.1% ఉన్న ప్రకాశం జిల్లాలో, వర్షపాతం 756 మి.మీ.గా నమోదు అయింది. దీనిని బట్టి జిల్లాల వారీగా కూడా పచ్చదనమే వర్షపాతాన్ని నిర్ణయిస్తుందని అర్థమవుతుంది.

అదేవిధంగా ఉష్ణోగ్రతలు గమనిస్తే, పచ్చదనం తక్కువగా ఉన్న జిల్లాలైన అనంతపురం, మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాల్లో సగటు ఉష్ణోగ్రతలు ఎక్కువగాను, పచ్చదనం ఎక్కువగా ఉన్న జిల్లాలైన చిత్తూరు, ఖమ్మం, విశాఖ పట్టణాలలో సగటు ఉష్ణోగ్రత తక్కువగా నమోదు అయ్యింది. దీనిని బట్టి వాతావరణంలోని వర్షపాతాన్ని ఉష్ణోగ్రతలు, పచ్చదనం, అడవులు నియంత్రిస్తాయని చెప్పవచ్చు.

### అడవులు - వ్యవసాయాభివృద్ధి

భారతదేశం వ్యవసాయధార ఆర్థిక వ్యవస్థ కలిగిన అభివృద్ధి చెందుతున్న దేశం. దేశంలోను, రాష్ట్రంలోను వ్యవసాయం వర్షాధారం. సకాల వర్షాల పైనే వ్యవసాయరంగం అభివృద్ధి ఆధార పడివుంది. సకాల వర్షాలు వాతావరణ పరిస్థితులలో మార్పులపై ఆధారపడతాయి. వాతావరణంలోని మార్పులు భూభాగంపై ఉన్న పచ్చదనంపై ఆధారపడతాయి. అనగా అడవులపై ఆధారపడతాయి. అడవులు తగ్గటం వలన, అకాల వర్షాల వలన, నదులలో, చెరువులలో భూగర్భంలో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. పెరుగుతున్న జనాభా అవసరాలు, వినియోగం వలన కూడా నీటి నిల్వలు తగ్గుతున్నాయి. అకాల వర్షాల వలన పంటల దిగుబడి తగ్గవచ్చు లేదా పూర్తిగా దెబ్బతినవచ్చు. 20 సంవత్సరాల క్రితం జూన్ నెల మొదటి వారంలో తొలకరి చినుకులు నైరుతి రుతుపవనాల వలన వచ్చేవి. దీని వలన నవంబరు చివరకు తుపానులు వచ్చే కాలానికి ముందుగా పంటలు రైతులకు దక్కేవి. కాని 2010-11 సంవత్సరానికి జూలై నెల అఖరులో వర్షాలు రావడం వలన వరి సాగు చాలా ఆలస్యంగా మొదలవడం, పంట పండే సమయానికి తుపానులు, వరదలకు పంట వృధా కావడం, కొట్టుకు పోవడం లేదా మునిగిపోవడం వలన అప్పులు తెచ్చి పంట పండించిన రైతు వీధినపడడం, ఆత్మహత్యలు చేసుకోవడం వంటివి సర్వసాధారణమైనవి. ఈ సంవత్సరంలోనే ఉభయగోదావరి జిల్లాల్లో ఎక్కువ మంది రైతులు 'పంట శెలవు దినాలు' ప్రకటించడం వెనుక కారణాలు వాతావరణ అనుకూలత లేక పోవడం, పంటకు గిట్టుబాటు ధరలేకపోవడం. దీర్ఘ కాలంలో ఇటువంటి దుష్పరిణామాలు







ఎదురవ్వకుండా వుండాలంటే, వాతావరణాన్ని కాపాడుకోవాలి. దానికి పచ్చదనం లేదా అడవుల పెంపకం ఒక్కటే మార్గం. కనీసం ప్రస్తుతం ఉన్న పరిమాణం తగ్గకుండా చూసుకోవాలి.

వ్యవసాయ రంగంపై ఆధారపడే ప్రజల వత్తిడిని తగ్గించి, ప్రత్యామ్నాయ పనిని అడవులు అందుబాటులో ఉంచుతాయి. ముఖ్యంగా షెడ్యూల్డు కులాల వారికి, సాంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవించేవారికి అడవులే జీవనాధారాలు. వీరు అడవులలో 'పోడు వ్యవసాయం' చేస్తూ, ఆహారం సేకరించుకుంటూ జీవిస్తున్నారు. వ్యవసాయ రంగంలో 'వాణిజ్య పంటల సాగు' లో నైపుణ్యం లేని వారు అడవులపై వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు.


'పోడు వ్యవసాయం' అడవులకు చాలా ప్రమాదకరంగా తయారైన మాట వాస్తవమే. 25 సంవత్సరాల క్రితం పోడు వ్యవసాయంలో ఒక కమతం నుండి మరొక కమతానికి బదిలీ అయ్యే సమయం కనీసం 20 సంవత్సరాల నుండి 15 సంవత్సరాలు ఉండేది. దీని వలన అడవుల నరికివేత తక్కువగా ఉండేది, కాని ఇప్పుడు కమతాల మధ్య బదిలీ కాలం కేవలం 4 లేదా 5 సంవత్సరాలకు తగ్గడం వలన, అడవులు చాలా ఎక్కువగా నరికివేస్తున్నారు. అటవీక్షయాన్ని నియంత్రించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు విధాలుగా ప్రయత్నిస్తోంది. ఒకటి షెడ్యూల్డు కులాలు, అడవిపై ఆధారపడే ఇతరులు వీలైనంత ఎక్కువమందికి అడవిపై ఆధారపడకుండా, వ్యవసాయం లేదా ప్రత్యామ్నాయ జీవన విధానాలు వారికి అలవాటు చేస్తున్నది. రెండు మారడానికి ఇష్టపడని వారికి అడవిని సంరక్షించుకుంటూ, వారి జీవనోపాధికి కావలసిన వసతులు, వస్తువులు, శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. కాని, అనుకున్న మార్పును వేగంగా సాధించలేక పోతున్నాము. ఏది ఏమైనప్పటికీ, అభివృద్ధిలో భాగంగా వ్యవసాయంపై, అడవులపై ఆధారపడటం తగ్గించాలి. అడవులను ఉత్పత్తి కారకాలుగా కాక, పర్యావరణ పరిరక్షకాలుగా మనం పరిగణించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది దీర్ఘకాలిక ప్రయోజనాలను సమకూరుస్తుంది.

## అడవులు - పారిశ్రామికాభివృద్ధి

దేశంలోను, రాష్ట్రంలోను పరిశ్రమల అభివృద్ధి వ్యవసాయంపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఆధారపడుతుంది. పరిశ్రమల ఉత్పత్తికి కావలసిన ముడి పదార్థాలన్నింటిని వ్యవసాయ రంగం అందిస్తుండగా, వ్యవసాయ రంగం మాత్రం పర్యావరణంపై, పర్యావరణం అడవులపై ఆధారపడి ఉన్నాయి. అంటే పరోక్షంగా పారిశ్రామికాభివృద్ధి పర్యావరణం, అడవులపై ఆధారపడిఉంది. పేపరు పరిశ్రమ, రసాయన పరిశ్రమ, కలప పరిశ్రమ, ఔషధ పరిశ్రమ, ఆహార ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమలు, ఉత్పత్తి సంస్థలు అడవులపై, అటవీ సంపదపై ప్రత్యక్షంగా ఆధారపడతాయి. ఉదా : రేయాన్ గ్రేడ్ పల్ప్, ప్లైవుడ్, పార్టికల్ బోర్డు పేపరు ఉత్పత్తి సంస్థలకు యూకలిప్టస్ కలప, టేకు లేని కలప, వెదురు, కలపలను ముడి పదార్థాలుగా అడవులు పరిశ్రమలకు అందిస్తున్నాయి. 3 పేపరు మిల్లులకు ప్రతి సంవత్సరానికి 205 మెట్రిక్ టన్నుల కలపను అడవులు అందిస్తున్నాయి. ప్రభుత్వ రంపపు మిల్లులు 2, ప్రైవేటు రంపపు మిల్లులు 4173, ప్రైవేటు కలప డిపోలు 188, ప్రైవేటు వెదురు డిపోలు కలప పరిశ్రమలో పని చేస్తున్నాయి. వీటన్నిటికి ముడి పదార్థాలు / సరుకులు అడవులు అందిస్తున్నాయి. లక్షలమంది ప్రజలు అటవీ ఆధారిత పరిశ్రమలలో పనిచేస్తున్నారు. అడవుల పరిమాణం తగ్గటం వలన ప్రజలు జీవనోపాధులు కోల్పోతారు. పారిశ్రామికాభివృద్ధి కుంటుబడుతుంది.

## అడవులు - అంతర్జాతీయ వ్యాపారం

భారతదేశ అంతర్జాతీయ వ్యాపార చరిత్రలో అడవులది ఒక ప్రధానమైన పాత్ర. బ్రిటీషు వారిపాలనలో మనదేశంలో రైల్వే లైన్ల ఏర్పాటుకు, ప్రభుత్వ కార్యాలయాల్లో వస్తు సామాగ్రి కొరకు భారీ ఎత్తున అటవీ కలపను వినియోగించినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా బ్రిటన్, ఇతర దేశాలకు భారీ ఎత్తున కలపను ఎగుమతి చేయడం, దాని నుండి విదేశీ మారక ద్రవ్యాన్ని పొందడం జరిగింది. దీని వలన బ్రిటన్ దేశ అంతర్జాతీయ వ్యాపారం కూడా అభివృద్ధి చెందింది. ఈ క్రమంలో అడవులను, అడవి సంపదను స్థానిక ప్రజల వినియోగం




నుండి రక్షించి, అంతర్జాతీయ వ్యాపారంలో ముఖ్యమైన ఎగుమతిగా గుర్తించే క్రమంలో భారతదేశంలో 'అడవుల విధానం - 1894' మొదటగా బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

స్వాతంత్ర్యానంతరం కూడా అటవీ సంపద ఎగుమతి ద్వారా చాలా వరకు మనదేశం, మన రాష్ట్రాలు ఆదాయాలను సమకూర్చుకోవడం జరుగుతుంది. ముఖ్యంగా కలప, వంట చెరకు, అడవుల నుండి లభించే కాయలు, పండ్లు, విత్తనాలు, పువ్వులు, బంక, బెరడు, ఆకులు, ఇతరా పదార్థాలను ఎగుమతి చేయడం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి. 'సమిష్టి అడవుల యాజమాన్యం విధానం ద్వారా 'వన సంరక్షణ సమితి' సంస్థల ద్వారా జీడిపప్పు, మామిడి, ఇతర పండ్ల కాయలు ఎగుమతి చేయడం జరుగుతుంది.

## అడవులు జీవనోపాధులు

అడవులలోను, అడవుల చుట్టూ నివశిస్తున్న ప్రజల జీవన విధానం అడవులతో ముడిపడి ఉంది. ముఖ్యంగా షెడ్యూల్డు కులాలు, ఇతర అడవులపై ఆధారపడినవారి సంప్రదాయాలు, అలవాట్లు, ఆర్థిక విధానాలు, సాంఘిక, రాజకీయ పరిస్థితులు అడవులతో ముడి పడి ఉంటాయి. ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు నిరక్షరాశ్యులవటం వలన, వారి వృత్తులతో మార్పు తీసుకు రావడం అనేది చాలా కష్టసాధ్యమైన పని అవుతుంది. అందుకే ప్రభుత్వం 'సమిష్టి అటవీ విధానం' ద్వారా 'వన సంరక్షణ' వంటి సంస్థల ద్వారా వారికి పని కల్పించి, వారి ఆదాయాన్ని పెంచే ఏర్పాటు మొదటి నుండి చేస్తున్నప్పటికీ, తగిన మార్పురాలేదు. దీనికి కారణం ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు అడవులను 'వ్యాపార వస్తువు' గా చూడడం వలన, చేసే ప్రతి పని నుండి ఆదాయాన్ని ఆశించడం వలన - ఉత్పత్తిలో, ఉత్పత్తి విధానాలలో మార్పు వస్తుందే గాని, అక్కడ నివసిస్తున్న ప్రజలలో మార్పు రావడంలేదు. ప్రభుత్వం, అధికారులు, ప్రజలు కూడా ఈ సమస్యను కేవలం అడవులపై జీవించే ప్రజలకు మాత్రమే సంబంధించింది గాక, మొత్తం సమాజానికి సంబంధించిగా చూడగలిగినపుడు మాత్రమే పరిష్కారం లభిస్తుంది.

అడవులతో పాటు, అడవులలోపల, వాటి చుట్టూ నివసించే వారు కూడా సభ్య - సమాజంలో భాగంగా, అటవీ సంపదతో పాటు వాటిపై నివసించే ప్రజల అభివృద్ధి కూడా ముఖ్యమైన సమస్యగా గుర్తించాలి. సమాజం ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలంటే, పర్యావరణాన్ని రక్షించాలి. దానికి అడవుల్ని కాపాడాలి. వాటి విస్తీర్ణం పెంచాలి. ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాలను, సంక్షేమాన్ని కాపాడుకోవాలి.

డా॥ బి. నాగేశ్వరరావు
పోస్టు డాక్టోరల్ రీసెర్చ్ ఫెలో, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ


# గాంధీజీ చేపట్టిన వినూత్న ఆయుధం సత్యాగ్రహం

**బుద్ధ, మహావీర, క్రీస్తు, మహ్మామద్ బసవేశ్వరుల బోధనలను ఆచరణాత్మకంగా జీవించిన విశ్వచైతన్య స్ఫూర్తి గాంధీజీ. తాను ఆత్మారాముని సాక్షిగా సాగించిన స్వాతంత్ర్య సమరంలో అతని దివ్యాస్త్రాలు రెండే రెండు. ఒకటి - అహింస, మరొకటి - సత్యం.**

**సూర్యుడస్తమించని సామ్రాజ్యాన్ని ఎదుర్కొని విజయకేతనం రెపరెపలాడించిన మహానేత గాంధీజీ.**

**సత్యాగ్రహ మూల సిద్ధాంతం సహనం, సత్యం, దృఢ సంకల్పమే సత్యాగ్రహం. సత్యం, ఆగ్రహం రెండు పదాలు చేరి సత్యాగ్రహమైంది.**

"నా ప్రేమ సంకేతంతో పాటు ఆగ్రహం, అహింసతో మేళనమైన శక్తితో మనం ప్రపంచంలోనే వినూత్నమైన పోరాటాన్ని సాగించి విజేతలయ్యాం."


With Sardar Patel (Bardoli Satyagraha)

సత్యాగ్రహం దక్షిణ ఆఫ్రికాలో ప్రారంభమైంది. ఆ దేశంలోని భారతీయులు అడుగడుగునా అవమానాలెదుర్కొనే వారు. వాటిని నివారించటానికి గాంధీజీ కొన్ని ఆందోళనలను ప్రారంభించాడు. ఫొనిక్స్- టాల్ స్టాయ్ ఆశ్రమాలను ప్రారంభించి సత్యాగ్రహులకు శిక్షణనిచ్చాడు.

దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి వచ్చిన తర్వాత సబర్మతిలో కూడా అటువంటి ఆశ్రమం ప్రారంభించాడు.

గాంధీజీ ప్రారంభించిన ఆందోళనలో రెండు ముఖ్య లక్షణాలను మనం పరిశీలించాలి. మొదటిది అహింస. ఆంగ్లేయులను శస్త్రాలతో ఎదుర్కొనే శక్తి భారతీయులకు లేదు. ఈ వాస్తవం గాంధీజీ కంటే ముందుగా ఆంగ్లేయులతో పోరాడిన వారికి తెలుసు అందువల్లనే అహింసనే తన ఆందోళనకు సాధనంగా మలచుకొన్నాడు. మరొక ముఖ్యవిషయం గాంధీజీ ఏ పద్ధతిని చేపట్టినా బహిరంగంగానే ప్రారంభించాడు. రహస్య చర్యల పట్ల అతనికంతగా నమ్మకంలేదు. అది హింసకు దారితీయగలదని భావించాడు.

### సత్యాగ్రహ స్వరూపం

ఉప్పు సత్యాగ్రహం దండియాత్రతో మొదలైంది.

లాఠీదెబ్బల హోరు, వేదనా పూర్ణమైన నిట్టూర్పులు, అరుపులు మాత్రమే వినబడేవి. ఒక దళం నేలకూలితే మరోదళం క్షతగాత్రులకు శుశ్రూష చేసేది. సత్యాగ్రహం చేసే ప్రతి వ్యక్తి లాఠీ దెబ్బతిన్నపుడల్లా 'వందేమాతరం' అన్న నినాదాలు చేసే వాడు. ఈ దౌర్జన్యం గురించి గాంధీజీ పత్రికల్లో రాస్తుండేవారు. 'గాంధీ', సత్యాగ్రహం' అన్న రెండు పదాలు ప్రపంచమంతా వ్యాపించాయి.

### సత్యాగ్రహమంటే ?

గాంధీజీ చేపట్టిన సత్యాగ్రహం రెండు విధాలుగా వుండేది. వ్యక్తి చట్టాన్ని ఉల్లంఘించి జైలుకు వెళ్ళడం. అయినా వారి దేశంలోని చట్టాలు, నిబంధనల పట్ల గౌరవముండేది. చట్టములననుసరిస్తూ ప్రభుత్వాన్ని ధిక్కరించేవారు. దేశంలోని ప్రముఖులు సత్యాగ్రహం చేసే దేశ భక్తుల పట్ల ఎంతో గౌరవం ప్రదర్శించేవారు.

రెండో పద్ధతి సత్యాగ్రహం - సహాయ నిరాకరణోద్యమం. సమ్మెలు, పన్నులు చెల్లించకపోవడం మొదలగు పద్ధతులను అనుసరించేవారు.

తుపాకీ గుళ్ళకు - ప్రాణాలొడ్డి, ప్రపంచాన్నే పాలించిన ఆంగ్లేయులను సత్యాగ్రహమన్న వినూత్న ఆయుధం తలవంచేటట్లు చేసింది. ప్రపంచానికే వినూత్న సందేశమందించింది గాంధీజీ ప్రారంభించిన సత్యాగ్రహం.

*'భువన విజయము కోరడాతడు*
*మునిగి వడు గర్వమున తన*
*తనువునే త్యజియించు నాడా*
*గామియుగ సౌభాగ్యములకై'*

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

# వ్యవసాయోత్పత్తుల విపణి

## అన్నదాత అరిచేతిలోనే



**మనదేశంలో రైతులు పండించే పంటలకు లెక్కా పత్రాలు ఉండవు. శ్రమను నమ్ముకొని మొండిగా రెక్కలు ముక్కలు చేసుకొని పంట పండించటమే వారికి తెలుసు.**

అందులో ఏమైనా లాభ మొచ్చిందా, నష్టమొచ్చిందా అన్న విషయం పంట చేతి కొచ్చాక, మార్కెట్‌లో అమ్మకానికి పెట్టినప్పుడు మాత్రమే తెలుస్తుంది. ఈ పరిస్థితికి కారణం, శాస్త్రీయ పద్ధతులు పాటించకపోవడమే. శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే నష్టాలను బాగా తగ్గించి, వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయవచ్చని ఇటీవల కొందరు యువ రైతులు రుజువు చేశారు.

శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయాన్నే ఎలా చేయాలో చెప్పే శాస్త్రవేత్తలు, అధికారులు ప్రతిచోటా ఉంటారు గానీ, మారుమూల ప్రాంతాలకు వెళ్లి ప్రతీ రైతుతో మాట్లాడే అవకాశం ఉండదు. అందు వల్ల మన రైతులకూ, శాస్త్రవేత్తలకు మధ్య 'సమాచార అగాథం' (కమ్యూనికేషన్ గ్యాప్) ఏర్పడిందన్నది నిర్వివాదాంశం.

ఆధునిక యుగంలో శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరగడంతో వాటి ఫలాలు సామాన్య మానవుడికి సైతం అందుబాటులోకి వచ్చాయి. సాంకేతిక విజ్ఞాన ఫలాలను సద్వినియోగం చేసుకున్న యువరైతులు కొందరు వ్యవసాయ రంగంలో కూడా

## రైతుల సేవకు సెల్‌ఫోన్ కంపెనీలు బారులు



రాణిస్తున్నారు. ఆ యువకులు ఎలాంటి పద్ధతులు చేపట్టి విజయ శిఖరాలను అందుకోగలిగారో ఇప్పుడు చూద్దాం.

ఇప్పటి దాకా గ్రామాల్లో రైతులకు వ్యవసాయంలో చేపట్టాల్సిన మెలకువలను రేడియో, టీవిల ద్వారా మాత్రమే కొంతమేరకు వినగలిగేవారు. ఈ ప్రసార మాధ్యమాల ద్వారా వచ్చిన సాంకేతిక సమాచారం జనరల్‌గా ఉంటూ, ఒక్కో రైతుకున్న ప్రత్యేక సమస్యకు పరిష్కారం చూపేదిలా ఉండేది కాదు. అందువల్ల ఆ సమాచారాన్ని రైతులను అంతగా ఆకట్టుకోలేక పోయింది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విత్తు నాటిన నాటి నుంచి పంట మార్కెట్‌కు చేరేవరకు రైతుకు కావాల్సిన సకల సలహాలను వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు, అధికారులు, వ్యాపారస్తులతో నేరుగా సంప్రదించే వెసులుబాటు మన రైతు చేతికి వచ్చింది.

### చేతిలోనే శాస్త్రవేత్త

శ్రీకాకుళం జిల్లా మారుమూలలో ఉన్న ఓ కుగ్రామంలో అరటిసాగుచేసే అప్పలనాయుడు హైదరాబాద్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో పనిచేసే శాస్త్రవేత్తతో తన చేతిలోని సెల్‌ఫోన్‌తో తన అరటి పంటకు సోకిన తెగులు గురించి వివరిస్తున్నాడు. తెగులు లక్షణాలపై శాస్త్రవేత్త కొన్ని ప్రశ్నలను అప్పల్నాయుణ్ణి అడుగుతున్నారు. ఇలా అప్పల్నాయుడు తన పొలంలో ఉంటే, శాస్త్రవేత్త విశ్వవిద్యాలయంలోని తన ఆఫీసులో ఉండి, సందేహాలను నివృత్తి చేస్తున్నాడు. తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాడు. ఇది పేదరైతుకు 'సెల్‌ఫోన్' అందుబాటులోకి వచ్చినందునే సాధ్యమైంది. అలా ఎప్పుడంటే అప్పుడు రైతు తన సమస్యలకు నిపుణుల నుంచి సలహాలు పొంది, వ్యవసాయాన్ని శాస్త్రీయంగా లాభదాయకంగా ఉండేలా చేయగలుగుతున్నాడు.

### కంపెనీలపోటీ

సెలఫోన్ కంపెనీలు తమ ఉత్పత్తులకు రైతులకు అమ్ముకునేందుకు పోటీ పడుతున్న క్రమంలో రైతులకు మేలు కలిగేలా కొన్ని ఏర్పాట్లను చేశాయి. దేశంలో అత్యధిక సెల్‌ఫోన్లను అమ్ముతున్న నోకియా సంస్థ, వ్యవసాయానికి సంబంధించిన బోలెడంత సమాచారాన్ని సేకరించింది. ఆ సమాచారాన్ని క్రోడీకరించి రైతుకు అందుబాటులోకి తెచ్చేందుకు 24 ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సహాయాన్ని తీసుకుంటోంది. దేశంలోని 4 వేల మార్కెట్ యార్డులు, 8 వ్యవసాయ సంబంధ వాతావరణ కేంద్రాలతో ఒక నెట్‌వర్క్‌ను రూపొందించింది. **"నోకియా లైఫ్ టూల్స్"** పేరుతో ఈ సంస్థ దేశంలో రైతులకు అవసరమైన సమాచారాన్ని ఇస్తోంది. తెలుగుభాషతో సహా 12 ప్రాంతీయ భాషల్లో, గ్రాఫిక్స్‌తో రైతులకు తాజా సమాచారాన్ని ఇస్తున్నట్లు ఆ సంస్థ అధికారులు చెబుతున్నారు. నోకియా లైఫ్ టూల్స్‌ను దాదాపు 50 లక్షల మంది రైతులు దేశవ్యాప్తంగా వినియోగిస్తున్నట్లు ఆ సంస్థ ఇటీవలే వెల్లడించింది. ప్రస్తుతం నోకియా సేవలు పంటలు పండించే రైతులకు మాత్రమే ఉన్నాయి. వచ్చే రెండు నెలల్లో ఆక్వా, పౌల్ట్రీ రంగాలకు కూడా తమ సేవలను విస్తరిస్తామని నోకియా అధికారులు చెబుతున్నారు.



## సర్వీస్ ప్రొవైడర్ల మధ్య కూడా పోటీ

రైతులకు మేము అవసరమైన సమాచారం ఇస్తామంటే, మేమిస్తామని మొబైల్ టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు కూడా పోటీ పడుతున్నాయి. ఎయిర్‌టెల్, టాటా టెలీసర్వీసెస్ వంటి సంస్థలు రకరకాల ఆకర్షణీయ ప్యాకేజీలతో రైతులను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. వొడాఫోన్, రిలయన్స్, ఐడియా వంటి సంస్థలు కూడా ఈ రంగంలో అడుగుపెడితే లాభాల పంట పండించుకోవచ్చన్న ఆశతో కొత్త కొత్త ప్యాకేజీల రూపకల్పనకు కసరత్తు చేస్తున్నాయి. దేశంలో మొత్తం 40 కోట్ల మంది చిన్న వ్యవసాయదారులున్నట్లు అంచనా. వీరందరినీ సెల్‌ఫోన్‌ల ద్వారా నెట్‌వర్క్ పరిధిలోకి తేవాలన్నది ఆయా సంస్థల ఆలోచన. సెల్‌ఫోన్ల కంపెనీలే కాకుండా గోద్రెజ్, డాబర్ వంటి దేశీ కంపెనీలు కూడా ఈ బిజినెస్‌లో కాలుమోపాయి. విదేశీ బహుళజాతీ కంపెనీలైన కాడ్ బరీస్, కెల్లాగ్స్, ప్రొక్టర్ అండ్ గ్యాంబ్లర్, కోకోకోలా, పెప్సీ వంటి సంస్థలు కూడా వ్యవసాయ దారులతో నిత్యమూ సంబంధాలు కొనసాగిస్తూ, తమ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాయి.



## మొబైల్ ప్యాకేజీలు

ఆకర్షణీయమైన హంగులతో పెద్దగా చదువురాని రైతులకు సైతం అర్థమయ్యే విధంగా సమాచారాన్ని ఇవ్వాలని సెల్‌ఫోన్ కంపెనీలు పోటీపడుతున్నాయి. ప్రముఖ కంపెనీలు కల్పిస్తున్న సేవలు ఎలా రైతులకు ఉపయోగపడుతున్నాయో ఇప్పుడు చూద్దాం.

## నోకియా లైఫ్ టూల్స్

దాదాపు ఏడాదిన్నర కిందటే నోకియా తన 2320, 2323 మోడల్స్‌లో లైఫ్‌టూల్స్ ప్యాకేజీని ఇచ్చింది. వీటి ద్వారా మహారాష్ట్రలోని అనేక జిల్లాలలో రైతులు తమ వ్యవసాయోత్పత్తులకు సంబంధించిన ధరల వివరాలను తాజాగా తెలుసుకొనగలిగారు. తద్వారా దళారీల మోసపు మాటలకు తెరపడింది. ఉత్పత్తులు స్థానిక వ్యాపారికి అమ్ముకునేటప్పుడు తను ఆశించిన ధరకోసం బేరమాడటానికి రైతుకు వీలు కలిగింది. దళారీ చేతిలో తాను మోసపోలేదన్న సంతృప్తి ఫోన్ ద్వారా తమకు లభించిందని రైతులు భావిస్తున్నారు. ఈ ఫోన్ సౌకర్యం లేకుంటే ధాన్యం అమ్ముడు పోయే వరకు మార్కెట్ యార్డుల చుట్టూ, దళారీలు వ్యాపారుల చుట్టూ చేతులు కట్టుకొని తిరగాల్సిన పరిస్థితి ఉండేదని రైతులు భావిస్తున్నారు. ఫోన్ సమాచారం వల్ల తమ శ్రమ, డబ్బు, కాలం ఆదా కావడంతో పాటు ఆత్మ గౌరవంతో ఎవరి ముందూ తలవంచకుండా ఉండగలుగుతున్నామని మహారాష్ట్ర రైతులు అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు.

ప్రయోగాత్మకంగా చేపట్టిన లైఫ్‌టూల్స్ ప్రాజెక్టు 2009 లో మహారాష్ట్రలో విజయవంతమయ్యాక మరాఠీ, గుజరాత్, పంజాబీ, బెంగాలీ, కన్నడ, తమిళ్, మలయాలం, **తెలుగు**, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో కూడా సమాచారాన్ని ఇవ్వడం నోకియా ప్రారంభించింది. లైఫ్ టూల్స్ ద్వారా వ్యవసాయ సమాచారంతో పాటు విద్యా సంబంధ వినోదాత్మక సర్వీసులను కూడా నోకియా అందిస్తోంది. ఎస్.ఎం. ఎస్‌ల ద్వారా సమాచారాన్ని తెలుసుకొనే వెసులుబాటు కూడా అందులో పొందుపరిచారు. యువ రైతులకు కావాల్సిన క్రికెట్ స్కోరులు, వార్తలు, రోజువారీ రాశిఫలాలు, రింగ్‌టోన్స్ మ్యూజిక్, జనరల్‌నాలెడ్జి, ఇంగ్లీష్ భాషను నేర్చుకోవడం వంటివి కూడా అందులో చేర్చారు. నోకియా అందించే ఈ సమాచారం కోసం నెలకు 60 రూపాయల వరకు చార్జి వేస్తుంది. పంటలు లేని సీజన్‌లో ఈ ప్యాకేజీని డిస్‌కనెక్ట్ చేసుకొనే సౌకర్యం కూడా ఉంది.

ప్రస్తుతం మన రాష్ట్రంలో శాస్త్రవేత్తలతో, అధికారులతో నేరుగా సంప్రదించే సౌకర్యం లేనప్పటికీ, రానున్న కొన్ని నెలల్లో ఈ సౌకర్యాన్ని కూడా రైతులకు కలుగజేయాలని ఆయా కంపెనీలు ఆలోచిస్తున్నాయి. ఈ సౌకర్యం అమల్లోకి వచ్చాక 3జి ఫోన్‌లను ఉపయోగించి పంటలకు వచ్చిన తెగుళ్లను శాస్త్రవేత్తలకు నేరుగా చూపించే అవకాశం కూడా కలుగుతుంది. తదనుగుణంగా వారు నివారణోపాయాలు వెంటనే చెప్పగలుగుతారు.

### ప్రాజెక్టు 'ఖేతీ'

ఇంగ్లండ్‌కు చెందిన షెఫీల్డ్ హల్లం యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కూడా భారతదేశం రైతులకు తాజా సమాచారం ఎంత మెరుగ్గా ఇవ్వవచ్చునో పరిశోధనలు జరుపుతున్నారు. రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో సంప్రదింపులు జరుపుకునేలా మొబైల్‌ఫోన్‌లకు సాఫ్ట్‌వేర్‌ను రూపొందించడానికి వీరు కృషి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కింద రైతులు కోసం "కాల్ సెంటర్ల"ను కూడా నిర్వహిస్తున్నారు.

### రైటర్స్ మార్కెట్ లైట్

దేశంలోని వెయ్యి వ్యవసాయ మార్కెట్లతో నెట్‌వర్క్‌ను ఈ సంస్థ రూపొందించింది. 250 పంటల గురించి, 1800 కేంద్రాలలో నమోదయ్యే వాతావరణ సమాచారాన్ని ఈ సంస్థ అందిస్తోంది. 2007లో ఒక రాష్ట్రంలో మొదలైన ప్రస్థానం ఇప్పుడు 12 రాష్ట్రాలకు విస్తరించింది. ఈ సంస్థ వినియోగదారుల సంఖ్య ఏటా 8 నుంచి 10 రెట్లకు పెరుగుతూ వస్తోంది.

### టాటా టెలీ సర్వీసెస్

గ్రామీణ మార్కెట్ కోసం ఈ సంస్థ 3,4 సర్వీసులకు ఏక కాలంలో ప్రారంభించింది. తాజా మార్కెట్ సమాచారంతో పాటు వాతావరణ హెచ్చరికలు, తుపాను, వర్షాలకు సంబంధించిన సమాచారం, రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వివరాలను కూడా ఈ సంస్థ అందజేస్తోంది.


ఆన్ - కాల్ (ప్రత్యేకంగా కోరిన సమాచారం కోసం) సర్వీసును కూడా ఈ సంస్థ అందుబాటులోకి తెచ్చింది. ఇందులో రైతు కోరిన ప్రత్యేక సమాచారాన్ని నిపుణులు అందజేస్తారు. ఫలానా ధాన్యాన్ని ఇప్పుడు అమ్మితే లాభమా? నష్టమా? అని అడిగితే మార్కెట్ నిపుణుడు ఎప్పుడు అమ్మితే లాభమొస్తుందో సలహాలూ, సూచనలిస్తాడు. దీనికి ప్రత్యేక రేటును ఆ మొబైల్ సంస్థ రైతు నుంచి రాబట్టుకుంటుంది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లోనే ఈ సౌకర్యం అమల్లో ఉంది.

### రిలయన్స్ కమ్యూనికేషన్స్

ఇతర మొబైల్ సర్వీసుల మాదిరిగా వ్యవసాయ, మార్కెట్ సమాచారంతో పాటు రిలయన్స్ నీటి పారుదల సమాచారం, విద్యుత్ సరఫరా వంటి హంగులను చేర్చింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉండే రైతులతో ఏకకాలంలో చర్చించే ' కాన్ఫరెన్సింగ్' సౌకర్యాన్ని కూడా రిలయన్స్ తన వినియోగదారులకు కలుగజేస్తోంది.

### గోద్రెజ్ ఎగ్రోవెట్

ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, గోవా, రాష్ట్రాలలో ఉన్న 18 వేల మంది పామాయిల్ తోటల పెంపకందార్లు గ్రోద్రెజ్ ఎగ్రోవెట్ నిత్యమూ మొబైల్ ఫోన్‌ల ద్వారా సంప్రదింపులు జరుపుతూ సాంకేతిక సలహాలిస్తుంటుంది. ఈ నాలుగు రాష్ట్రాలలో 82 వేల ఎకరాలలో



పామాయిల్ తోటలను పెంచుతున్నారు. పామ్ పండ్లు పక్వానికి వచ్చిందీ లేనిదీ తెలిపే సాధనాల ద్వారా పరిశీలించి ఆ డేటాను గోద్రెజ్ కలెక్షన్ పాయింట్లకు పంపితే, రైతుల బ్యాంక్ అకౌంట్లలోకి డబ్బు చేరిపోతూ ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో సమర్థంగా వినియోగపడటం ఈ రైతులకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు.

గోద్రెజ్ సంస్థ 45 కేంద్రాల నుంచి పశుగ్రాసం, విత్తనాభివృద్ధి, పౌల్ట్రీ రంగాలలో వినూత్న సేవలను ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి రైతులకు సహాయ సహకారాలను అందజేస్తోంది. మొక్క పెరగటానికి దోహదపడే ఎరువులు, భూసారాన్ని పరిరక్షించే మందులు, పత్తికి సోకే తెగుళ్ల నివరణపై గోద్రెజ్ కృషి అనేక మంది రైతులను ఆకట్టుకొంటున్నది.

### ఇ - ఫ్రెష్ ఇండియా డాట్ కామ్

కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ గత ఆగస్టులో ఒక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. www.efreshindia.com పేరుతో ఉండే ఈ పోర్టల్ ద్వారా రైతులు, సప్లయిర్స్, వినియోగదారులను ఒక చోట కలిపాలన్నది ప్రధానోద్దేశం. ఇతర రంగాల్లో మాదిరిగా ఉత్పత్తిదారు మొదలు వినియోగదారు వరకు అందరూ ఒకే చోట బేరసారాలు సాగించడం, సంప్రదింపులు జరపడానికి దీన్ని ఉద్దేశించారు. ప్రస్తుతం ఇంగ్లీష్‌లోనే ఉన్న ఈ పోర్టల్ త్వరలో అన్ని ప్రాంతీయ భాషల్లోకి వెలువడుతుంది. దేశంలో రైతులకు సరైన సమాచార సౌకర్యాలు లేక ఏటా 30 వేల కోట్ల రూపాయల విలువైన వ్యవసాయోత్పత్తులు కుళ్లిపోవడమో, చెడిపోవడమో జరుగుతోంది. దీన్ని నివారించడానికి ఈ పోర్టల్ దోహదపడుతుందని అందరూ ఆశిస్తున్నారు.

ఈ పోర్టల్‌ను అంతర్జాతీయంగా ఇప్పటికే ఉన్న డచ్ దేశానికి చెందిన www. efresh.com కు అనుసంధానం చేశారు. దానితో భారతీయ రైతు తన ఉత్పత్తిని విదేశీ వినియోగదారునికి కూడా ఎగుమతి చేయగలిగే స్థితికి చేరుకుంటాడనడంలో సందేహం లేదు.

**- బి.లలిత**

# గృహస్థాయిలో వృధానీరు - సద్వినియోగం

**పారిశుధ్య సాధనలో వృధానీటి / మురుగునీటి నిర్వహణ ఒక ముఖ్యాంశం. ద్రవ వ్యర్థ నిర్వహణ సరిగా లేకుంటే, ఆరోగ్య పరమయిన సమస్యలు తలెత్తుతాయి. మొత్తం మనం వాడుతున్న నీటి సరఫరాలో 70% నుంచి 80% శాతం వరకు వృధా నీరుగా విడుదల చేస్తున్నాం. దీనిని సరిగా నిర్వహించకపోయినట్లయితే. కొన్ని రకాలైన సమస్యలు తలెత్తుతాయి.**

- వృధా నీరు రోడ్ల మీదుగా పల్లపు ప్రాంతాలకు ప్రవహించడం.
- పల్లపు ప్రాంతంలో నీరు నిల్వవుండడం
- దోమలు నిలయంగా మారి గుడ్లు పెట్టడం
- అనారోగ్య సమస్యలు తలెత్తడం జరుగుతుంది.

పై కారణాల దృష్ట్యా వృధా / మురుగు నీటి నిర్వహణ ముఖ్యమైనది. అంతేకాకుండా నీటి కొరత ఉన్న మన ఇండియా లాంటి దేశాలలో వృధా నీటిని తిరిగి వినియోగించేందుకు వీలుగా "రీసైకిల్" చేయడం చాలా లాభదాయకం. అయితే, రీసైకిల్‌కు కావలసిన సాంకేతికత, వ్యయం చాలా పెద్ద స్థాయిలో కావలసి ఉన్నందున గ్రామాలలో ఇది అమలు పరచడం కష్టతరం కావచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాలలో కూడా తక్కువ ఖర్చుతో, సాంకేతికతలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ వృధానీటిని కొన్ని పద్ధతుల ద్వారా సద్వినియోగం చేసుకోవచ్చు.

గ్రామీణ ప్రాంతాలలో వృధానీరు / మురుగునీరు అంటే సాధారణంగా గృహ స్థాయినుంచి ఉత్పన్నమయ్యే నీరు ఎక్కువగా వుంటుందని చెప్పుకోవచ్చు. ఈ గృహస్థాయి నుండి వెలువడే వృధా నీటిని కూడా కొన్ని మార్గాల ద్వారా మళ్ళీ ఉపయోగించి వృధా నీటివల్ల తలెత్తే యిబ్బందులు తొలగించడమే కాకుండా, ఆర్థికంగా కూడా లాభం పొందవచ్చు.

**గృహ స్థాయిలో మురుగు / వృధానీటి నిర్వహణ :-** క్రింది పద్ధతుల ద్వారా గృహస్థాయిలో వెలువడే మురుగు నీటిని నిర్వహించవచ్చు.

1. గృహస్థాయిలో వెలువడే వృధానీటిని మురుగు కాలువలకు మళ్ళించడం.
2. ఇంకుడు గుంతలు ఏర్పాటు
3. పెరటి తోటలకు మళ్ళింపు
4. లీచ్‌పిట్‌ల ఏర్పాటు

### పెరటి తోట పెంపకం

గృహస్థాయిలో ఖాళీ ప్రదేశం అందుబాటులో వున్నప్పుడు వంటగది నుండి, స్నానాలగది నుండి, ప్రైవేటు టాప్ వద్ద, బోరు బావుల నుండి వెలువడే వృధా నీటిని చిన్ని కాలువ ద్వారా, లేదా గొట్టం ద్వారా ఖాళీ ప్రదేశం లోనికి మళ్ళించి ఆ ప్రదేశంలో ఆకుకూరలు, కాయగూరలు, పండ్ల మొక్కలు మొదలగునవి పెంచడం ద్వారా మురుగు నీరు సద్వినియోగం కావడంతో పాటు వృధానీటిని పెరటి తోటకు వినియోగించి కూరగాయల రూపంలో లబ్దిపొందవచ్చు.

### పెరటి తోట నిర్వహించడం ఎలా అంటే -

- అందుబాటులో వున్న ఖాళీ స్థలాన్ని బట్టి ఇంటి ఆవరణలో ఒక దీర్ఘచతురస్రాకార గోతిని తవ్వాలి. అది ఇంటి కంటే పల్లంగా వుండే ప్రాంతంలో వుంటే మంచిది.
- ఒకటిన్నర అడుగుల లోతు వరకు మట్టిని కదిలించాలి.
- తవ్విన మట్టిని తీసి రెండు భాగాలుగా చేయాలి.
- ఆ మట్టితో గోతిని తిరిగి నింపాలి.
- సాళ్ళు, గొప్పులు లేకుండా చేసి మనం పెంచాలనుకుంటున్న కూరగాయ, ఆకుకూర విత్తనాలను నాటాలి.
- కాలువ లేదా గొట్టం ద్వారా గృహం నుండి వెలువడే వృధానీటిని పెరటితోటకు మళ్ళించాలి.

**గృహస్థాయి లీచ్‌పిట్ :-** గృహస్థాయిలో వెలువడే వృధానీరు ఎక్కువ పరిమాణంలో ఉన్నప్పుడు తగిన ఖాళీ ప్రదేశం తక్కువగా వున్నప్పుడు లీచ్‌పిట్ నిర్మాణం సరియైన మార్గం అని చెప్పవచ్చు. ఈ లీచ్‌పిట్ నిర్మాణానికి కొంత వ్యయం అవుతుంది కాబట్టి, కుటుంబం ఆ వ్యయాన్ని భరించవలసి వుంటుంది.

### లీచ్‌పిట్ నిర్వహించే పద్ధతి

- లీచ్‌పిట్‌ను నిర్మించడం చాలా సులభం.
- ఒక మీటరు లోతు వరకు గుంతను తవ్వాలి.
- గుంత చుట్టూ ఇటుకలను తేనెతుట్టె మాదిరి అమర్చాలి.
- అంటే రాయికి, రాయికి మధ్య కొంత ఖాళీ వదలాలి. పై భాగంలో రాయిని ఉంచుతూ అలా మొత్తం పైవరకు ఏర్పరచాలి. గృహస్థాయిలో ఉత్పన్నమయ్యే వృధానీరు పరిమాణాన్ని బట్టి గుంత పరిమాణాన్ని నిర్ణయించుకోవాలి.
- తయారైన గుంతపై మూతను అమర్చాలి.

ఇలా తయారైన ఈ గుంతలోనికి వృధానీటిని మళ్ళించాలి. దీనివల్ల ఉపయోగించిన నీరు అంతా భూగర్భంలోనికి ఇంకుతుంది. అంతేకాకుండా దోమల వృద్ధిని అరికట్టి ఆరోగ్యకరమైన పరిసరాలను అభివృద్ధి పరచవచ్చు.

**ఇంకుడు గుంత :-** గృహస్థాయిలో విడుదలయ్యే వృధానీటి పరిమాణం తక్కువగా వుండి ఖాళీ ప్రదేశం అందుబాటులో లేనప్పుడు గృహస్థాయిలో ఇంకుడు గుంత ఏర్పాటు సరియైన పద్ధతి. బాగా నీరు వృధా అయ్యే బోరుబావి, బట్టలుతికే ప్రాంతాల నుండి ఇంకుడు గుంతకు కాలువలు తవ్వి ఆ నీటిని అందులోనికి మళ్ళించాలి. అందువల్ల వృధా అయ్యే నీరు భూమిలోనికి ఇంకి భూగర్భ నీటి మట్టం పెరగడానికి దోహదపడుతుంది.

### ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునే పద్ధతి

- గుంతను ఇంటి ఆవరణలో బాగా పల్లంగా వున్న చోట తవ్వాలి.
- తదనుగుణంగా కాలువను వాలుగా ఏర్పాటు చేసుకోవాలి.
- ఒక మీటరు పొడవు, ఒక మీటరు వెడల్పు, రెండు మీటర్ల లోతు సైజులో గొయ్యి తవ్వాలి (అందుబాటులో వున్న స్థలాన్ని బట్టి కొలతలు నిర్ణయించుకోవచ్చు)
- గోతిలో అడుగున మూడింటిలో ఒక వంతు వరకు పెద్ద సైజు రాళ్ళను (4-5 అంగుళాల వ్యాసంగలవి) వేయాలి.
- వాటిపై మరోవంతు చిన్న సైజు (1-2 అంగుళాల వ్యాసం కలవి) రాళ్ళను వేయాలి.
- తరువాత ఇటుకముక్కలు (1-1 అంగుళాల వ్యాసం కలవి) అమర్చాలి.
- గోనె సంచిని ఇటుక ముక్కలపై ఏర్పాటు చేయాలి.
- అన్నింటి కంటే పైన శుభ్రమైన జల్లెడ పెట్టిన ఇసుకను వేయాలి.

పైన పేర్కొన్న విధానాలలో ఏఏ విధానాలు ఎవరెవరికి అనుకూలమో ఆయా విధానాలను ఆయా గృహస్తులు అమలు పరచాలి. ఇలా గ్రామంలోని అందరూ గృహస్తులూ తమ గృహస్థాయిలో వచ్చే వృధా నీటిని సద్వినియోగం చేస్తే మన గ్రామాలు సస్యశ్యామలంగా, ఆహ్లాదకర పరిసరాలతో, ఆరోగ్య పూరిత వాతావరణంతో భాసిల్లుతాయి. అంతేకాదు. గ్రామపంచాయితీకి వృధా నీటి నిర్వహణ సులభతరం అవుతుంది.

కనుక, ప్రతి గ్రామ పంచాయితీ గృహస్థాయిలో వృథా నీటి నిర్వహణపై గ్రామస్తులకు అవగాహనా సదస్సులు, సమావేశాలు నిర్వహించడం ఎంతో అవసరం.

- యం. ప్రదీప్‌కుమార్
రీసెర్చ్ అసోసియేట్, సి.డబ్ల్యు.ఎస్, అపార్డ్





# కొండరెడ్ల జీవన విధానం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల 8 ఆదిమ గిరిజన తెగలలో కొండరెడ్లు ప్రధానమైన గిరిజన తెగ. వీరు గోదావరి నదీ పరివాహక ప్రాంతమైన దట్టమైన అడవులుగల కొండ ప్రాంతాలతో కూడిన భద్రాచలం ఏజెన్సీ ప్రాంతం (ఖమ్మం జిల్లా), రంపచోడవరం (తూర్పుగోదావరి), కె. ఆర్. పురం (పశ్చిమ గోదావరి) గిరిజన ప్రాంతాలలో నివాసం ఉంటారు. 1991 జనాభా లెక్కల ప్రకారం. వీరి జనాభా 76,391. వీరి మాతృభాష తెలుగు (ప్రత్యేక మాండలికంగా ఉంటుంది).

కొండరెడ్లలో వివిధ సమూహాలు ఉంటాయి. ప్రతి సమూహం నిర్దిష్టమైన పూర్వీకుల నుండి ఉద్భవించిందని వారి నమ్మకం. ప్రతి సమూహాన్ని ఒక గోత్రంగా భావిస్తారు. వీరందరికి ఒకే ఇంటి పేరు ఉంటుంది (ఉదాహరణకు పల్లాల, రోలపల్లి, పీరు, కోసూరి, జర్దా). ప్రతి సమూహం బహిర్గత వివాహ పద్ధతి పాటిస్తుంది. కొండరెడ్లలో సాధారణంగా ఏక భార్యత్వం, అరుదుగా బహుభార్యత్వం ఉంటుంది. వివాహాలు, పద్ధతులు సాధారణంగా అన్ని గిరిజన తెగలలో ఉన్నట్టుగానే 1) సంప్రదింపులు 2) వశపరుచుకోవడం 3) సేవచేయటం 4) పరస్పరం ప్రేమించుకోవటం 5) లేచిపోవటం వంటి పద్ధతులలో భాగస్వామిని ఎంచుకోవటం జరుగుతుంది. మేనరికం పెండ్లిళ్ళు ఉంటాయి. వరకట్నం వంటి ఆచారాలు ఉన్నాయి. వితంతు పునర్వివాహాలకు గిరిజన తెగలో అనుమతి ఉంటుంది.

కొండరెడ్లలో సాంఘిక నియంత్రణ, సాంప్రదాయా పాటింపు తెగ పెద్ద అయిన ''పెద్ద కాపు'' ఆధీనంలో ఉంటుంది. అతనికి సాయంగా "పిన్న పెద్ద" లేదా "చిన్న కాపు" ఉంటారు. వీరికి పదవి వారసత్వంగా సంక్రమిస్తుంది. వీరితోపాటు ''బంట్రీకు'' ఉంటూ వీరి ఆచారాలు, సాంప్రదాయాలను అతిక్రమించిన వారిని హాజరు కావలసిందిగా సమాచారం అందిస్తుంటారు. సాధారణంగా లేచిపోవటం ద్వారా పెండ్లి చేసుకొన్నవారు, లొంగదీసు కొనటం, వశపరుచుకోవటం ద్వారా పెండ్లి చేసుకొన్న వారు, వివాహ పూర్వం, వివాహేతర లైంగిక సంబంధం కలిగి ఉండటం మొదలైన తప్పులు చేసిన వారి వివాదాలే కాకుండా, భూ వివాదాలు, తక్కువస్థాయి గల వారితో భోజనం చేసిన వారి వివాదాలు, విడాకుల వంటి తగాదాలను పరిష్కరిస్తారు. ఒకే సమూహంలో లైంగిక సంబంధం తప్పుగా భావిస్తారు. ఎవరైనా తప్పుచేస్తే వారిని తెగ నుండి బహిష్కరిస్తారు. తప్పుచేసిన వ్యక్తి సంబంధాన్ని త్యజిస్తే, శుద్ధి కార్యక్రమం






నిర్వహించి తెగలోకి అనుమతిస్తారు. శుద్ధి కార్యక్రమం సామూహిక భోజనాలతోపాటు జంగం కులస్థుని ద్వారా తప్పుచేసిన వ్యక్తి నాలుకపై వేడిచేసిన బంగారు ఉంగరంతో వాత పెట్టడం వంటి శిక్షలు ఉంటాయి.

కొండరెడ్ల ప్రధాన దైవం 'భూదేవర'. అంటే భూమాత. అంతేకాకుండా వారు ముత్యాలమ్మ, నూకాలమ్మ, పోతురాజులను కూడా పూజిస్తారు. వీరితోపాటు సమూహాలకు ప్రత్యేకంగా సింగారమ్మ, దేవతమ్మ వంటి దేవతలు ఉంటారు.

కొండరెడ్లు భూదేవతల పండుగలతోపాటు ప్రతి వ్యవసాయ ఉత్పత్తి కోత ముందు సంప్రదాయంగా, మామిడి కొత్త పండగ, కార్రకొత్త పండగ, చిక్కుడు కొత్త పండగ వంటివి జరుపుకోవడమే కాకుండా, అడవిలో వేటాడటం, సంచరించటం అనేది వీరి జీవనంలో సర్వసాధారణం. కావున అడవిలో ఎటువంటి హాని జరగకూడదనే ఉద్దేశ్యంతో "కొండరాజుల పండగ" ను ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

ఆదిమ గిరిజన తెగలలలో ఒకరైన కొండరెడ్ల ప్రధాన జీవనోపాధి వ్యవసాయం, పోడు వ్యవసాయం. తమ ఆవాసాలకు దగ్గరలో ఉన్న అటవీ ప్రాంతాన్ని కొంత వరకు నరికి, మిగిలిన మోడు గడ్డిని కాల్చి, చిరుధాన్యాలైన రాగులు, (చోళ్ళు) మొక్కజొన్న, జొన్న, చిక్కుళ్ళు, సామలు వెదజల్లి వర్షాధార పంటలు పండిస్తారు.






అంతేకాకుండా వాగులకు అడ్డుకట్టలు వేయడం ద్వారా చిన్న చిన్న కమతాలలో ఎత్తైన ప్రాంతాలలో వరి పండిస్తారు.

వ్యవసాయంతో పాటు వేటాడటం కొండరెడ్ల వృత్తిగా ఉంటుంది. వ్యవసాయ కూలీలుగా కూడా ఉంటారు. కలపేతర అటవీ ఉత్పత్తులు అయిన కొండచీపుర్లు, తేనె, కుంకుడు, విషముష్టి, చిల్ల గింజలు, నరమామిడి చెక్క, చింతపండు, అడ్డాకులు వంటి వాటి సేకరణ, అమ్మటం ద్వారా మనుగడ సాగిస్తారు.

ప్రభుత్వం కొండరెడ్లను పోడు వ్యవసాయం నుండి పునరావాసం కల్పిస్తూ, వివిధ కార్యక్రమాలను ఐ.టి.డి.ఎ.ల ద్వారా అమలు పరుస్తుంది. (ఉదా: జీడిమామిడి తోటల పెంపకం, చీని, బత్తాయి తోటల పెంపకం).

జి.సి.సి. ద్వారా కొండరెడ్లు సేకరించే కలపేతర అటవీఉత్పత్తులకు మంచి మద్దతు ధర లభించే విధంగా చేయటమే కాకుండా దళారుల నుండి కూడా రక్షణ కల్పిస్తుంది.

కొండరెడ్ల నివాస ప్రాంత అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, వ్యక్తిగత ఆదాయ అభివృద్ధి పథకాలను ఐ.టి.డి.ఎ. తన నిధుల ద్వారా, ట్రైకార్ నిధుల ద్వారా అమలు చేస్తూ, ఆదిమ గిరిజన తెగల అభివృద్ధికి కృషి చేస్తున్నది.

**ఎ. సుభాష్ చంద్రగౌడ్**
**సీనియర్ ఫ్యాకల్టీ, ఉపసంచాలకులు (గణాంక శాఖ), అపార్డ్.**





# ప్రాచీన కళలకు దర్పణం భారతీయ లోక్ కళామండల్

రాజస్థాన్ రాష్ట్రంలో గల ఉదయ్‌పూర్‌లో 1952లో పద్మశ్రీ దేవీలాల్ సామర్ గారిచే నెలకొల్పబడినది ఈ భారతీయ లోక్‌కళామండల్. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల జానపదకళలు, సంస్కృతీ - సంప్రదాయాలను ప్రతిబింబింపజేసే తోలుబొమ్మల ప్రదర్శనా విభాగం దీనిలోని ప్రత్యేకత.

### ముఖ్య ఆశయాలు

- జానపద కళలు, సాహిత్యం, నృత్యరీతులను, సంస్కృతీ సాంప్రదాయాలను గురించి తెలియపరచటం.
- ఈ అంశాలలో పరిశోధనకు ఆసక్తి కలవారికి అవకాశం కల్పించటం.
- పురాతన, సాంప్రదాయ, జానపద కళలకు ప్రాచుర్యాన్ని కలిగించటం.
- తోలుబొమ్మలాట, జానపద నృత్యాలు, జానపద సంగీతం వంటి అంశాలలో ప్రదర్శనలు నిర్వహించటం.
- ఈ అంశాలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం.
- ఇటువంటి కళాకారులను ప్రోత్సహించటం.
- విద్యావిషయక అంశాలకు వీటిని అనుసంధానం చేసే విధంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం.

### విభాగాలు

- పరిశోధనా కేంద్రం, సమాచార పరిరక్షణ కేంద్రం
- మ్యూజియం
- పప్పెట్ రీసెర్చ్ మరియు శిక్షణా కేంద్రం
- గ్రామీణ సమాచార సంస్థ
- క్రాఫ్ట్ ట్రైనింగ్ సెంటర్
- దేవీలాల్ సామర్ జానపద కళల శిక్షణా కేంద్రం
- గోవింద్ పప్పెట్ థియేటర్ (దీనిలో రోజూ మధ్యాహ్నం 12.00-1.00 గం॥ల మధ్య, సాయంత్రం 6.00-7.00 గం॥ల వరకు పప్పెట్రీ ప్రదర్శనలు జరుపబడుతున్నవి)

### కార్యక్రమాలు (ప్రత్యేకమైనవి)

- "దేవీలాల్ సామర్ మెమోరియల్ లోకానురంజన్ మేళా" - ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి నెలలో 22, 23 తేదీలలో వ్యవస్థాపనా దినోత్సవం జరుపబడుతుంది. రాజస్థాన్‌లోని కళాకారులేగాక పొరుగు రాష్ట్రాల కళాకారులకి కూడా ఇక్కడ తమ కళా ప్రాభవాన్ని ప్రదర్శించే అవకాశం కల్పించబడుతోంది.

### ప్రదర్శనలు, వాటి నమూనాలు

- ఇక్కడ జరిగే ప్రదర్శనలన్నింటినీ బొమ్మలతో నమూనాలుగా రూపొందించి పొందుపరిచారు.
- రాజస్థాన్‌లోని భిల్లులు జరుపుకునే "గౌరి" అనే పండుగకు సంబంధించిన నృత్యనాటిక ప్రతీసంవత్సరం కళాకారులతో ప్రదర్శించబడుతోంది.

### జానపద నృత్యాలు: (గిరిజనులు)

**భావాయ్** : రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో గల గిరిజనులు తలపై కుండలు వరుసగా

ఉంచి చేసే నృత్యం.

**తెర్‌తాల్** : "కమాద్" అనే గిరిజన జాతి మహిళలు చేతులకి, కాళ్లకి 13 చిన్నచిన్న మువ్వలు కట్టుకుని వారి ఇష్టదైవం "బాబారామ్‌దేవ్" అనుగ్రహం కోసం నృత్యం చేస్తారు. ఇదే "తెర్‌తాళ్".

**కాల్‌బేలియా** : రాజస్థాన్‌లోని "కాల్బేలియా" అనే గిరిజన జాతి వారు పాముల్ని పట్టటానికి చేసే ఒక నృత్యం.

**సాసరీయ** : రాజస్థాన్‌లో బాల్యవివాహాలు చాలా సర్వసాధారణం. వివాహం అనంతరం వధువు వరునితో కలిసి అత్తవారింటికి వెళ్లేటప్పుడు కన్నీటి వీడ్కోలు సన్నివేశాన్ని ప్రతిబింబించే నృత్యమే ఈ "సాసరీయ".

**ఘూమ్రు** : రాజస్థాన్‌లోని మేవార్ ప్రాంతంలోని గిరిజనుల సంస్కృతికి అద్దంపట్టే మరో నృత్యం ఇది. స్త్రీ, పురుషులు కలిసి చేసే నృత్యం ఇది. 'ఘూమర్" అనే మరో నృత్యంలో స్త్రీలు మాత్రమే చేస్తారు.

**టిప్పణి దాండియా రాస్** : ఈ నృత్యం సౌరాష్ట్రంలో గల గిరిజన మహిళలు రెండు కర్రలతో సంగీత వాయిద్యానికి అనుగుణంగా చేస్తారు.

**దాండియా** : ఇది కూడా కర్రలతో స్త్రీ, పురుషులు చేసే నృత్యం. రాజస్థాన్‌లోని దీనిని చూడవచ్చు

**గోర్‌బాంద్** : రాజస్థాన్ ఎడారులలో ఒంటెలను అలంకరించటానికి స్త్రీలు వాడే ఆభరణం తయారీకి సంబంధించిన నృత్యం ఇది.


## పప్పెట్ థియేటర్‌లో ప్రదర్శించబడుతున్న ప్రదర్శనలు

- **రామాయణం :** 108 పప్పెట్స్‌తో రామాయణ ఇతిహాసం ప్రదర్శించబడుతోంది.
- **భారతీయ జానపదగాథ :** పిచ్చుక - దాని పిల్లలకి సంబంధించిన కథ
- **మొఘల్‌దర్బార్‌కి సంబంధించినది :** ఈ పప్పెట్‌షో ఎన్నో అంతర్జాతీయ బహుమతుల్ని పొందింది.
- **సర్కస్**
- తబలా, సరంగి, నర్తకిలను ప్రతిబింబించే పప్పెట్స్

ఇవిగాక గుర్రపుస్వారీ, పాములు పట్టడం, సుజాత, మీరా, గౌతమబుద్ధుడు, మహావీరుడు, కృష్ణలీల ఇలా చాలా ఉన్నాయి.

## సాధించిన ప్రగతి

- మధ్యప్రదేశ్, రాజస్థాన్, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలలో గల గిరిజన నృత్యరీతులు, నృత్యనాటికలు, జానపద గీతాలు, సంస్కృతీ సాంప్రదాయాలు, కళలు వంటి అంశాలలో పరిశోధనలు నిర్వహిస్తోంది.




- రాజస్థాన్‌లోని జానపద కళారీతులపై సర్వే నిర్వహించింది.
- వియత్నాం దేశపు అత్యున్నతి సాంస్కృతిక పురస్కారం పొందింది.
- 3వ అంతర్జాతీయ సాంప్రదాయక తోలుబొమ్మల ప్రదర్శనలకు "రుమేనియా"లో జరిగిన మొదటి బహుమతి లభించింది.
- ట్యూనిషియాలో జరిగిన 5వ జానపద నృత్య ప్రదర్శనలో 2వ అత్యుత్తమ పురస్కారం ఈ కళాకారులకు లభించింది.
- అంతర్జాతీయ బాలల తోలుబొమ్మల ప్రదర్శనకు "జర్మనీ"లో ప్రత్యేక అవార్డు లభించింది.
- 6వ అంతర్జాతీయ జానపద నృత్య ప్రదర్శనకు ప్రత్యేక అవార్డు లభించింది.
- "రామాయాణం" ప్రదర్శనకు అఖిలభారత స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది.

## మరికొన్ని కార్యకలాపాలు

- అఖిలభారత స్థాయిలో తోలుబొమ్మల ప్రదర్శనలో వివిధ శిక్షణా కార్యక్రమాలను, సెమినార్‌లను నిర్వహిస్తోంది.
- పాఠశాల విద్యార్థులకు సంస్కృతీ సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు ఉచిత శిక్షణలను అందిస్తోంది.
- వివిధ గ్రామాలలో కూడా సంస్కృతీ సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు గ్రామీణ ప్రజలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.
- ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఈజిప్ట్, లిబియా, కువైట్, ఇరాన్, ఇరాక్, ఇండోనేషియా, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా, వియత్నాం, రుమేనియా, భూటాన్, ఆసియా, స్విట్జర్లాండ్, డెన్మార్క్, అమెరికా, స్వీడన్, నార్వే, స్పెయిన్, హంగరీ, జెకోస్లవేకియా, జర్మనీ, ఇటలీ మొదలైన దేశాలలో మన దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించే జానపద నృత్యాలు, తోలుబొమ్మలాటలను ప్రదర్శించటం.

**వి. నాగపద్మిని**
ఎస్.జి.టి., ఎం.పి.ఇ.ఎస్., పెదపాడు, ప.గో॥ జిల్లా

# సేంద్రీయ వ్యవసాయంలో రాష్ట్రం ముందంజ

**ఎరువులు లేవు. పురుగు మందులు అసలే లేవు. అయినా దిగుబడి ఏమాత్రం తగ్గలేదు. కొంచెం పెరిగింది కూడా. సేంద్రీయ సాగు ఫలితమిది. పంటలకు రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడటం వల్ల ఆరోగ్య సమస్యలు అధికమవడమే కాక భూసారం కూడా త్వరగా క్షీణించిపోతుండటంతో రైతుల దృష్టి ఈ సేంద్రీయ వ్యవసాయంపై పడింది. రసాయనాలు లేకుండా ప్రకృతిలో లభించే వాటినే ఎరువులు, పురుగుమందులుగా ఉపయోగించడమే ఈ సేంద్రీయ వ్యవసాయం.**

దీనివల్ల ఆరోగ్య భద్రతతో పాటు భూసారం కూడా చెక్కు చెదరకుండా ఉంటుంది. పైగా దిగుబడి కూడా కాస్తో కూస్తో ఎక్కువే వస్తుంది.ఫలితంగా సాగుకయ్యే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. లాభాలు పెరుగుతాయి. రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే అవసరం ఉండదు. క్యూబాలో రైతులందరూ ఈ సేంద్రీయ వ్యవసాయమే చేస్తున్నారు. సేంద్రీయ సాగులో క్యూబా ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. మన రాష్ట్రంలో కూడా ఈ సేంద్రీయ వ్యవసాయంపై రైతాంగం ఆసక్తి పెరుగుతోంది. ఈ ఏడాది 25 లక్షల ఎకరాలలో సేంద్రీయసాగు చేస్తూ, రాష్ట్రం క్యూబా తరువాతి స్థానం ఆక్రమించింది. మన రాష్ట్రంలో ప్రస్తుతం 4,024 గ్రామాల్లో ఆరు లక్షల మంది రైతులు ఈ తరహా వ్యవసాయం చేస్తున్నారు. రైతుల ఆసక్తికి ప్రభుత్వ సహకారం కూడా తోడవడంతో ఈ సేంద్రీయ సాగు మరింత విస్తరిస్తోంది.

గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం (సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటైన నాన్ పెస్టిసైడ్ ప్రోగ్రాం (ఎన్‌పీఎం) సేంద్రీయ ఎరువుల తయారీ, వినియోగాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, శిక్షణను రైతులకు అందిస్తోంది. ఇందు కోసం ఎన్‌పీఎం స్వచ్ఛంద సంస్థల సహాయాన్ని కూడా తీసుకుంటోంది. సేంద్రీయ ఎరువులతో 36 రకాల పంటలు పండిస్తున్నారు. సేంద్రీయ ఎరువులు వాడే పొలాల్లో రసాయనిక ఎరువుల వాడకాన్ని ఒక్కసారే నిలిపివేయకూడదని, దశలవారీగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ, సేంద్రీయ ఎరువుల

**అధికారిక లెక్కల ప్రకారం ఖరీఫ్‌లో సేంద్రీయ సాగు వల్ల రైతులు చేసిన ఆదా (రూ.కోట్లలో)**

| పంట | విస్తీర్ణం(ఎకరాల్లో) | మందులపై ఆదా | ఎరువులపై ఆదా | అధిక దిగుబడి+ అధిక ధరతో | ఆదామొత్తం రూ. కోట్లలో |
|---|---|---|---|---|---|
| వరి | 382655 | 30.26 | 24.87 | 38.26+76.53 | 177.92 |
| మిర్చి | 13529 | 20.29 | 1.57 | 2.16+8.17 | 32.19 |
| కందిపప్పు | 75607 | 9.07 | 2.64 | 4.08+7.56 | 23.35 |
| వేరుశనగ | 212194 | 16.97 | 8.48 | 10.60+10.60 | 46.05 |
| పత్తి | 48686 | 24.34 | 3.49 | ----- | 27.83 |
| కూరగాయలు | 22000 | 3.30 | 1.1 | 0.44 | 4.84 |
| ఇతరం | 177513 | 17.75 | ----- | ------ | 17.75 |
| మొత్తం | 932184 | 129.98 | 42.15 | 158.400 | 319.52 |

వినియోగాన్ని పెంచుకుంటూ రావాలని నిపుణులు చెబుతున్నారు. సేంద్రీయ ఎరువులతో సేద్యం చేసే రైతులతో సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రస్తుతం అనంతపురం, విజయనగరం, శ్రీకాకుళం, వరంగల్, ఖమ్మం, కర్నూలు, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో కనీసం జిల్లాకో లక్ష ఎకరాల్లో సేంద్రీయ సాగు చేస్తున్నారు. మిగిలిన జిల్లాల్లోనూ ఈ తరహా వ్యవసాయం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. పంటలకు పురుగు సోకకుండా సామూహిక మంటలు పెట్టడం, పురుగులను ఆకర్షించే రంగుపటాలు ఉంచడం, పొలానికి సారాన్నిచ్చే వర్మీ కంపోస్టు ఎరువులు వేయడం, పొలం గట్లపై చెట్లు పెంచి ఆ చెట్ల ఆకులను పొలంలోనే ఎరువుగా వాడటం వంటివి సేంద్రీయ సాగు పద్ధతులు. సేంద్రీయ సాగు జరిగిన పొలాల్లో గత ఖరీఫ్ సీజన్ ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం లేకపోవడం వల్ల రైతులకు దాదాపు 320 కోట్ల రూపాయలు ఆదా అయినట్లు అధికారులు అంచనా వేశారు. సేంద్రీయ సాగు వల్ల వరి పంటకు ఎకరాకు పురుగు మందులపై వెయ్యి రూపాయలు, ఎరువులపై 650 రూపాయలు ఆదా అవుతాయని, మిర్చిలో ఎకరాపై పురుగుమందుల్లో 15 వేల రూపాయలు, ఎరువులపై 1300 రూపాయలు ఆదా అవుతాయని, అలాగే పత్తిపై పురుగు మందులపై ఐదువేల రూపాయలు, ఎరువులపై ఎకరాకు 80 రూపాయలు ఆదా అవుతాయని అంచనా వేశారు. వరంగల్ జిల్లా జఫర్‌గఢ్ మండలంలో గతంలో 34 ఎరువుల దుకాణాలు ఉంటే, ఇప్పుడు సేంద్రీయ సాగు అమల్లోకి వచ్చాక ఆ దుకాణాల సంఖ్య నాలుగుకు పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం సేంద్రీయ సాగుపట్ల సంతృప్తితో ఉంది. 'నేషనల్ మిషన్ ఫర్ సస్టైయినబుల్ అగ్రికల్చర్'లో దీనిని ఒక భాగంగా చేర్చారు.

**- రాధాకృష్ణ**

# 'స్త్రీ నిధి బ్యాంక్' ప్రారంభం



**మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 1098 కోట్లతో 'స్త్రీ నిధి బ్యాంక్' ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పూళ్ళ, ఏలూరులలో సెప్టెంబర్ 15వ తేదీన పర్యటించి పలు పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేసారు.**

భీమడోలు మండలంలోని పూళ్ళలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పర్యాటక శాఖామాత్యులు శ్రీ వట్టివసంతకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి సునీతా లక్ష్మారెడ్డితో కలిసి మహిళల కోసం కొత్తగా రూపకల్పనచేసిన 'స్త్రీ నిధి బ్యాంక్'ను ప్రారంభించారు. "స్త్రీ శక్తి భవనాలకు" కూడా ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు.

రాష్ట్ర స్థాయి రైతు మహిళా సదస్సును కూడా ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు విడుదలైన పంటల బీమా సొమ్మును లబ్ధిదారులకు లాంచనంగా అందజేశారు.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, పావలా వడ్డీ, కౌలు రైతులకు రుణాలు, స్త్రీ శక్తి భవనాలు, స్త్రీ నిధి బ్యాంక్‌ల ద్వారా రాష్ట్రంలో 1.20 కోట్ల మంది లబ్ధిదారులకు 3 వేల కోట్ల రూపాయల విలువైన ప్రయోజనాలు కల్గిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు వివిధ బ్యాంక్‌లు 22 వేల కోట్లు ఇస్తుంటే, దానిలో రాష్ట్ర వాటా 9 కోట్ల రూపాయలని చెప్పారు. సూక్ష్మ రుణ సంస్థల బారినుంచి కాపాడటానికి స్త్రీ నిధి బ్యాంక్‌ను ఏర్పాటు చేశామని, దానికి పశ్చిమగోదావరి జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిని అధ్యక్షురాలిగా ఎంపిక చేశామని తెల్పారు.

అక్టోబర్ 15న ప్రారంభించే రచ్చబండ కార్యక్రమంలో అర్హులైన 24 లక్షల మందికి రేషన్ కార్డులు, 4 లక్షల పించన్లు ఇస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### ముఖ్యాంశాలు

- 1.16 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని, ఒకే రోజు వీరందరికి ప్రధానిమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందించాలని ఆలోచిస్తున్నామని చెప్పారు. సంవత్సరానికి 5 లక్షల చొప్పున మూడేళ్ళలో వివిధ కంపెనీలలో 15 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు.
- 250 కోట్ల విలువగల పథకాల ప్రయోజనాలకు సంబంధించి స్వయంశక్తి సంఘాలకు రుణాలు, పంటల బీమా, పావలావడ్డీ, 2 వేల మందికి ఇళ్ళ పట్టాలు అందించారు.
- 1098 కోట్లతో స్త్రీ నిధి బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు.
- స్త్రీ నిధి భవనాలను మండలానికి ఒకటి చొప్పున నిర్మిస్తారు.
- ఐకెపి మహిళలు కొనే ధాన్యం నిల్వ చేయడానికి వెయ్యి గోదాములు నిర్మిస్తున్నామని, 66 గోదాములు పశ్చిమ గోదావరిలో నిర్మిస్తామని సి.ఎం. ప్రకటించారు.
- రూ6 వేల కోట్లతో బల్క్‌మిల్క్ యూనిట్లను ప్రోత్సహిస్తామని వెల్లడించారు.

మంత్రులు శ్రీ వట్టి వసంతకుమార్, సునీతా లక్ష్మారెడ్డి, శ్రీ పితాని సత్యనారాయణ, శ్రీ ధర్మానప్రసాదరావు, ఎమ్‌పిలు శ్రీ కావూరి సాంబశివరావు, శ్రీ కనుమూరి బాపిరాజు, శ్రీ ఉండవల్లి అరుణ్‌కుమార్, జిల్లా శాసనసభ్యులు, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ రెడ్డి సుబ్రమణ్యం, ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీ బి. రాజశేఖర్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

**- కె. కోటేశ్వరరావు**
**ఎమ్‌పిడిఓ భీమడోలు మండలం, ప॥గో॥ జిల్లా**

### స్త్రీ నిధి బ్యాంక్

గ్రామీణ మహిళలు సూక్ష్మ రుణ సంస్థల వద్ద మోసపోకుండా గ్రామీణ మహిళలకు 'ఆర్థిక చేయూత నిచ్చేందుకు 'స్త్రీ నిధి' మహిళా బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు.


**ముఖ్య ఉద్దేశ్యాలు**

1. అధిక వడ్డీ రుణ భారం నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులను రక్షించటం.
2. 50% నిధులను నిరుపేద సభ్యులకు కేటాయించి రుణ సదుపాయం కల్పించడం.
3. సకాలంలో అవసరమైన రుణ మొత్తాన్ని సభ్యులకు అందచేయడం.
4. 48 గంటలలో సభ్యుల అవసరాలు తీర్చడం.

**ఋణ పరిమితులు - ముఖ్యాంశాలు**

- ఒక సభ్యురాలికి 50,000 రూ॥ మించకుండా రుణ సదుపాయం.
- నిరుపేదలకు ప్రాధాన్యత.
- బ్యాంక్ ద్వారా అతి తక్కువ రుణం పొందిన గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తారు.

# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం !



## వాతావరణ మార్పుని అరికడుదాం!!

**మన చుట్టూ ఉండే గాలి, నీరు, నేల, సూర్యరశ్మి వివిధ రకాల మొక్కలు, రకరకాల జంతువులు, అన్నింటిని కలిపి పర్యావరణం అంటారు. మనుషులు, జంతువులు, మొక్కలు బ్రతకడానికి గాలి, నీరు, నేల, ఆహారం కావాలి. ప్రపంచంలోని ప్రతి జీవికి అవసరమయిన శక్తి సూర్యుని నుంచి లభిస్తుంది.**

అన్ని జీవరాశులకు ప్రధానంగా ఆహారం మొక్కల నుండి అందుతుంది. మొక్కలు సూర్యుని శక్తి వలన, కిరణజన్య సంయోగక్రియ వలన ఆహారాన్ని తయారు చేసుకుంటాయి.

ప్రకృతిలోని ప్రతి జీవికి ఒక్కొక్క ప్రత్యేక స్థానం ఉంది. భూమిపై నివసించే రకరకాల జీవులు ఒక దానిపై మరొకటి ఆధారపడి జీవిస్తాయి. ఈ పరస్పర ఆధారిత సంబంధాలు దెబ్బతిన్నట్లయితే పర్యావరణం దెబ్బతింటుంది.

ఆధునిక కాలంలో ప్రతి పనికి శక్తి (ఇంధన) వనరులు అవసరం. వంట పనులకి, యంత్రాల కోసం, పరిశ్రమల కోసం, వాహనాలు నడపటానికి, వ్యవసాయానికి గృహాల కోసం ఇంధనాన్ని వాడుతున్నాం. ఇంధనాన్ని ఎక్కువగా శిలాజ వనరులైన బొగ్గు నుండి పెట్రోలియం, డీజిల్, సహజ వాయువుల నుండి పొందుతున్నాము. పెరుగుతున్న జనాభా వలన ఇంధన వాడకం ఎక్కువై బొగ్గు, పెట్రోలియం, డీజిల్ నిల్వలు తగ్గుతున్నాయి. అంతేకాకుండా, వీటిని మండించడం ద్వారా కార్బన్-డై-ఆక్సైడ్ విడుదల అయి వాతావరణం కలుషితం అవుతోంది.

ఆధునీకరణలో భాగంగా పట్టణాలలో చాలా పరిశ్రమలు ఏర్పడ్డాయి. ఇవి ఘన, ద్రవ, వాయు రూపాల్లో వ్యర్థ పదార్థాలను విడుదల చేయటం వలన వాతావరణం కలుషితమవుతోంది.

ఈ వ్యర్థ పదార్థాలు కొన్ని నీటిలో కరిగి మంచి నీరును కలుషిత నీరుగాను, కొన్ని ఘన రూపంలో విషరసాయనంగాను, కొన్ని గాలిలో కలిసిపోయి విషవాయువులుగాను నీరు, భూమి, గాలిని కలుషితం చేస్తున్నాయి.

మార్పు మానవ జీవితంలో ముఖ్యమైన అంశం అయినప్పటికీ, అది మంచిని కలగజేయాలి. అభివృద్ధి వినాశనానికి దారి తీయకూడదు. అభివృద్ధి సుస్థిర అభివృద్ధిగా ఉండాలి.

మనం బ్రతకడానికి నీరు అవసరం. భూమి మీద మూడు వంతులు నీరు, ఒక వంతు భూభాగం ఉంది. మూడు వంతులు నీరు ఉన్నా మనకు ఉపయోగపడే నీరు కేవలం చెరువులు, నదులు, భూగర్భజలం మాత్రమే. మిగతావి అంతా సముద్ర జలం/ ఉప్పునీరు. ఈ మంచి నీటిని కలుషితం చేయటం వలన వాటిలో ఉండే రసాయనాలు చేపల్లోకి చేరి, అలాగే ఆ చేపలను తినే అన్ని రకాల జంతువులలో చేరి, ఒక జీవి నుండి మరో జీవికి కాలుష్యం విస్తరించి మొత్తం పర్యావరణం వ్యవస్థకే నష్టం ఏర్పడుతుంది.

వాహనాలు, పరిశ్రమల నుండి వెలువడే పొగ, చెత్తను కాల్చడం ద్వారా గాలిలోనికి ప్రమాదకరమైన రసాయనాలు చేరటం వలన కూడా పర్యావరణం దెబ్బతింటుంది.

మన పరిసరాలలో ఉండే జంతువులను, చెట్లను సంరక్షించడానికి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలి. వీటిలో పాటు -

* పొగగొట్టాలను ఎక్కువ ఎత్తులో ఉంచి పొగ వదిలేలా చర్యలు తీసుకోవాలి.
* విషరసాయన పదార్థాలను ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద కాల్చి బూడిద చేయాలి.
* పారిశ్రామిక జోన్‌లను ఏర్పాటు చేసినట్లయితే, పరిశ్రమలు అన్నీ ఒకే చోట ఉంటాయి. వీటన్నిటికి ఒకే చోట వ్యర్థ పదార్థాలను శుద్ధి చేసే ఏర్పాటు చేసుకొనవచ్చును.

### ప్రజలలో పర్యావరణం పట్ల అవగాహన కల్గించటం

* చెట్లను నాటడం, విద్యుత్‌ను పొదుపుగా వాడటం
* ఇంధన వనరులను పొదుపుగా వాడటం
* వ్యర్థ పదార్థాల విసర్జనపై అవగాహన కల్గించటం

## వాతావరణ మార్పు

మానవులు, జంతువులు, చెట్లు అన్నీ పరిసరాలను బట్టి వాటి జీవనాన్ని కొనసాగిస్తాయి. వాతావరణంలోని మార్పులు అంటే వర్షపాతం, సూర్యరశ్మి, గాలి మొదలైన వాటిలో మార్పులు ఏర్పడినట్లయితే, ఆ మార్పులకు అనుగుణంగా మొక్కలకు, జంతువులకు జీవనం కొనసాగించటం కష్టం.

## వాతావరణం మార్పులకు కారణం ఏమిటి?

మానవులు అభివృద్ధి కోసం సహజ వనరులను విచ్చలవిడిగా వినియోగించటమే మొదటి కారణం. అధిక జనాభా, వాటి అవసరాలు, నాగరికత, శాస్త్రీయ విజ్ఞాన అభివృద్ధి వీటిని అధికం చేసే ప్రేరకాలు.

భవనాల నిర్మాణాల కోసం, రోడ్లు వెడల్పు చేయటానికి, నీటి ప్రాజెక్టుల కోసం మనం చెట్లను కొట్టి వేస్తున్నాం. దీని వలన మనకి తాజా గాలి ఉండదు. పక్షులు, జంతువులు కూడా నివసించటానికి స్థలం ఉండదు. తరుగుతున్న అడవుల వలన పులులు, ఏనుగులు వాటి ఆవాసాలు కోల్పోయి జనావాసాల వైపు వస్తున్నాయి. అభివృద్ధి/పర్యాటక రంగం కోసం సముద్ర తీరంలోని మడ అడవులను నాశనం చేయటం వలన జీవవైవిధ్యం అంతరించిపోతోంది. ఆధునిక వ్యవసాయం, పరిశ్రమల కారణంగా గాలి, నీరు, భూమి కలుషితం అవుతున్నాయి. పరిశ్రమల నుండి వచ్చే మలినాలు, వ్యవసాయానికి ఉపయోగించే ఎరువులు, క్రిమి సంహారిణుల వలన భూగర్భజలాలు కలషితం అవుతున్నాయి. పరిశ్రమలు విడుదల చేసే పొగ, వాహనాల నుంచి వచ్చే పొగ మూలంగా గాలి కలుషితంగా మారిపోతోంది.

## వాతావరణ మార్పు వల్ల కలిగే నష్టాలు

పర్యావరణంలోని మార్పుల వలన సరైన సమయానికి వర్షాలు రావడం లేదు. వర్షాలు సరిగా కురవకపోవటంతో పంటలు పండటం లేదు. ఈ చర్యల వలన ప్రకృతిలో మార్పులు ఏర్పడుతున్నాయి.

పారిశ్రామిక అవసరాలు, రవాణా, విద్యుత్ అవసరాల కొరకు శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను భూమి నుంచి వెలికితీసి మనం వినియోగిస్తున్నాం. దీని వలన వాతావరణంలో కార్బన్-డై-ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి వాయువుల సాంద్రత పెరిగిపోతోంది. ఈ వాయువులు భూమిపైన ఒక పొరలాగా ఏర్పడి సూర్యుని నుండి వచ్చే వేడిమిని నిలిపి ఉంచి భూగోళాన్ని క్రమంగా వేడెక్కిస్తున్నాయి. వాతావరణంలో ఈ వాయువుల సాంద్రత పెరిగే కొద్దీ సూర్యుని వేడిని అవి మరింత పట్టి ఉంచుతాయి. దీని వలన భూగోళం మరింత వేడిగా మారుతుంది.

ఈ వాయువుల సాంద్రత వలన గత 100 సంవత్సరాల కాలంలో భూమి ఉష్ణోగ్రత 1/2 డిగ్రీ నుంచి 1 డిగ్రీ వరకు పెరిగింది అని వాతావరణ మార్పులపై ప్రపంచ ప్రభుత్వం ప్యానల్ (1) ఇచ్చిన నివేదికలో తెలియచేస్తుంది. దీని వలన వాతావరణంలో విపరీతమైన మార్పులు ఏర్పడుతున్నాయి.

- ప్రాంతాలు మునిగిపోతాయి.
- ధృవాలు దగ్గర ఉన్న మంచు కరిగిపోతుంది. దీని వలన సముద్రాల నీటి మట్టం పెరిగి తీర ప్రాంతాలు మునిగిపోతాయి.
- ఋతుపవనాలలో మార్పులు ఏర్పడి ఒక ప్రాంతంలో అధిక వర్షపాతం, మరికొన్ని ప్రాంతాలలో కరువు ఏర్పడుతుంది. పంటల సీజనులలో మార్పులొస్తాయి.

సూర్యుడి నుండి వచ్చే అతినీల లోహిత కిరణాలు/మానవునికి హాని చేసే సూర్య కిరణాలను ఓజోన్ పొర అడ్డుకొంటుంది. మనం విడుదల చేస్తున్న మలినాల వలన ఓజోను పొర నాశనమయినట్లయితే, ఈ అతి నీలలోహిత కిరణాల వలన మనకు చర్మ సంబంధింత క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. గ్రీన్‌హౌస్ వాయువుల వలన ఓజోన్ తరిగిపోయి భూమి వేడెక్కుతుంది.

వాతావరణం వేడిగా ఉందని మనం చల్లదనం కోసం ఏసిలు, రిఫ్రిజిరేటర్లను ఎక్కువగా ఉపయోగిస్తున్నాం. ఈ ఉపకరణాలు చల్లదనాన్ని ఇస్తూ మళ్ళీ వాతావరణంలోనికి వేడిని, కాలుష్యాన్ని మిథేన్ రూపంలో పంపుతూ బయట వేడి మరింత పెంచుతున్నాయి.

## తీసుకోవలసిన జాగ్రత్తలు

నీటి ఆవిరి, కార్బన్‌ఆక్సైడ్, మిథేన్ లాంటి కొన్ని రకాల వాయువులను గ్రీన్ హౌస్ వాయువులు అని పిలుస్తారు. ఇవి ప్రకృతి సహజంగా విడుదల అయినప్పుడు భూమిపైన ఇన్‌ఫ్రారెడ్ కిరణాలు ఉత్పన్నం చేసే రేడియో ధార్మికత తగ్గించి ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు సాయం చేస్తాయి. అయితే శిలాజ ఇంధనాల వినియోగాల వలన అధిక మొత్తంలో విడుదలయ్యే గ్రీన్‌హౌస్ వాయవులు భూగోళంపై ఉష్ణోగ్రతలను పెంచుతాయి. దీనితో భూమి విపరీతంగా వేడెక్కుతుంది.



థర్మల్ విద్యుత్ కొరకు బొగ్గును కాల్చడం ద్వారా కార్బన్-డై-ఆక్సైడ్ ఎక్కువ మొత్తంలో వాతావరణంలోనికి విడుదల అవుతుంది. విద్యుత్ ఆదా చేయటం ద్వారా దీని పరిమాణాన్ని తగ్గించవచ్చును.

విద్యుత్ వినియోగం తక్కువగా ఉండే బల్బును మాత్రమే కొని ఉపయోగించటం, ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించటం, పర్యావరణపై ప్రజలకు అవగాహన కల్గించటం మొక్కలను పెంచటం, పేపరును తక్కువగా వాడటం వంటి చర్యలతో మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

- ఆసం నిర్మలా దేవి
ఫాకల్టీ, విపత్తు నిర్వహణ విభాగం, అపార్డ్

*అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పె*
*ద్దమ్మ సురారులమ్మ కడుపారడి బుచ్చినయమ్మ తన్ను లో*
*నమ్మెడి వేల్పుటమ్మల మనమ్ముల యుండెడియమ్మ దుర్గ మా*
*యమ్మ కృపాబ్ధి నీయుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్*

'దుర్గ' ఆదిపరాశక్తి. ముగ్గురమ్మలకీ మూలపుటమ్మ. ఎందరో లోకకంటకులైన రాక్షసులను సంహరించిన వీరమాత. 'దుర్గ' అంటే తెలుసుకోవటం అసాధ్యమైనదని అర్థం. వాక్కులకు అందని తత్వం. పరబ్రహ్మ స్వరూపిణి. పరాదేవత. అందుకే "తాం దుర్గాం దుర్గమాం దేవీం" అన్నారు.

దుర్గ అంటే సాంఘికశక్తి. దేవతలందరి శక్తితో ఒక దివ్యతేజస్సు ఆవిర్భవించింది. ఆ తేజస్సు కలిసి ఒక్కటై, దశదిశలా వ్యాపించింది. చూడటానికి అదో పర్వతంలా ఉంది. ఆ తేజస్సు క్రమంగా స్త్రీ ఆకృతి పొందింది.



# విజయదశమి-విజయాల దశమి

శివుడి ముఖం నుండి వెలువడిన తేజస్సుతో ముఖం, యముడి తేజస్సుతో వెంట్రుకలు, విష్ణు తేజంతో బాహువులు, చంద్రతేజంతో స్తనయుగం, ఇంద్ర తేజంతో నడుము, వరుణ తేజంతో పిక్కలు, తొడలు, బ్రహ్మతేజంతో పాదాలు, సూర్యతేజంతో కాలివేళ్ళు, వసువు తేజంతో చేతివేళ్ళు, కుబేర తేజంతో ముక్కు, ప్రజాపతి తేజస్సుతో దంతాలు, అగ్ని తేజస్సుతో కళ్ళు, వాయు తేజస్సుతో చెవులు, ఇతర దేవతల తేజస్సులూ కలిసి ఆవిర్భవించింది. ఇలా దుర్గ ఆవిర్భవించటం లోకకళ్యాణం కోసమే. భగవానుడు శ్రీమద్భగవద్గీతలో

*'యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత*
*అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం*
*పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం*
*ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే'*


అని చెప్పినట్లుగా దుర్గ కూడా - 'ఇత్థం యదా యదా బాధా దాన వోత్థా భవిష్యతి, తదాతదా అవతీర్యాహం కరిష్యామి అరి సంక్షయం' అంటూ శిష్ట రక్షణ కోసమూ, దుష్టశిక్షణ కోసమూ అవతరిస్తానని ప్రతినబూనింది. మహిషాసురాది మహారాక్షసులను సంహరించి ముల్లోకాలను కాపాడింది. అందుకే 'దుర్గ' అంటే 'దుర్గనాశిని', 'దుర్గతినాశిని' దుర్గమంటే కోట. అంతేకాదు దుర్గమమయిన భవసాగరాన్ని దాటించే పరబ్రహ్మ స్వరూపిణి, మోక్షప్రదాయని, తాపత్రయాలను ధ్వంసం చేసే సౌఖ్యదాయిని దుర్గ.

త్రిమూర్తులు దుర్గాదేవి సంకల్పం వల్లనే ప్రవర్తిస్తున్నారని మార్కండేయ పురాణం పేర్కొంటోంది. ముక్తి ప్రదాయిని కూడా అమ్మే -

*జ్ఞానినా మపి చేతాంసి దేవీ భగవతీ హి సా*
*బలాదాకృష్య మోహాయ మహామాయాప్రయచ్ఛతి*
*తయా విసృజ్యతే విశ్వం జగదేతలో చరాచరం*
*సైవా ప్రసన్నా వరదా నృణాం భవతి ముక్తయే*
*సంసార బంధ హేతుశ్చ సైవ సర్వేశ్వరేశ్వరీ*

వేదశాస్త్రోపనిషత్తులు దుర్గాదేవిని బ్రహ్మస్వరూపిణిగా, సగుణ, నిర్గుణ రూపిణిగా నిరూపిస్తున్నాయి. ఎవరికి ఎలా కావాలంటే అలా సాక్షాత్కరిస్తుంది దుర్గామాత. శ్రీకృష్ణ పరమాత్మ నిరూపించిన తత్త్వం పరాశక్తి ఒక్కటే. దుర్గను చతుర్భుజి, అష్టభుజి, దశభుజి, షోడశభుజిగా పూజిస్తుంటారు. దుర్గ మెరుపు వంటి కాంతి కలది.

కత్తి, డాలు, శరము, ధనువు, గుణము, తర్జనీముద్ర చేతులలో ధరిస్తుంది. చంద్రకళను, త్రినేత్రాలను ధరించిన 'మహిషాసురమర్దిని' అమ్మ, విద్యుల్లత, మృగపతి, భీషణ, కన్యాసేవిత, అష్టభుజ అనే విశేష స్వరూపాలతో ఆరాధింపబడుతోంది. ఇచ్ఛ, జ్ఞాన, ఐశ్వర్య, శక్తి సమన్విత



## దుర్గే మహాకాళికే

అజ్ఞాన తిమిరేషు నిర్మూలన క్రియా వైదగ్ధ్య విద్యామయీ
గైర్వాణ భారతీ ప్రౌఢవాక్ పరిఫుల్ల సాహిత్య రత్నాకరీ
భోగిరాడ్హిమశైల కైలాస డిండీర సంతుల్య శ్వేతాంబరీ
కావ్యాద్యనేక సద్రచనా కళానికష భాషాను సంధాయిని
మాం పాహి మాం పాహి
బ్రాహ్మీ దయాకమలనేత్రీ స్ఫురద్రూపిణీ
మాం పాహి మాం పాహి
అంబా జగజ్జనని త్రైలోక్య సంపోషిణీ
మాం పాహి మాం పాహి
వాణీ వివేకమయ వేదార్థ సంచారిణీ
మాం పాహి మాం పాహి
దేవీ వ్యధాభరిత భవరోగ సంహారిణీ
బ్రహ్మేశవిష్ణ్వాది దైవాంశ సంభూత
దుర్గా మహాకాళికా!
రక్షించు రక్షించు లోకాలనేలే
అపర్ణా! ఉమా! శాంభవీ

దుర్గ. రురువు, భండాసురుడు, విశుక్రుడు, విషండుడు, దుర్గమాసురుడు మొదలగు రాక్షసులను లోకకళ్యాణం కోసం సంహరించింది.

ఇచ్ఛాశక్తికి కామేశ్వరి, లలిత; జ్ఞానశక్తికి శ్యామల, సరస్వతి; క్రియాశక్తికి లక్ష్మీదేవి ప్రతినిధులు. అందుకే 'అమ్మ' ముగ్గురమ్మల మూలపుటమ్మ. అనేక రూపాలలో దుర్గాదేవిని ఆరాధిస్తారు. దుర్గాదేవిని మూలానక్షత్రంలో సరస్వతిగా అష్టమిరోజున అష్టవర్ష కన్యగా కొలుస్తారు. ఈ తొమ్మిది రోజులు శరన్నవరాత్రులుగా ఒక్కొక్క రూపంలో అమ్మ వారిని కొలుస్తుంటారు.

**1. శైలపుత్రి 2. బ్రహ్మచారిణి 3. చంద్ర ఘంటాదేవి 4. కూష్మాండదేవి 5. స్కంధమాత 6. కాత్యాయిని 7. కాళరాత్రిదేవి 8. మంగళగౌరి 9. సిద్ధిధాత్రి 10. విజయదశమి.**

ఈ పేర్లతో పదిరోజులు ఒక్కొక్క రోజు ఒక్కొక్క కన్యను 2 సంవత్సరాల బాలికతో మొదలుపెట్టి పూజిస్తారు. వీరిని నవదుర్గలు అంటారు. ఈ ఉత్సవాలు ఆశ్వయుజ పాడ్యమి నుండి నవమి వరకు జరుగుతాయి. ఈ మాసంలోనే ఆశ్వయుజ బహుళ ద్వాదశిని 'గోవర్స ద్వాదశి'గానూ, తదియను అట్లతద్దిగాను, త్రయోదశిని 'ధన త్రయోదశి' (ఈ రోజు లక్ష్మీపూజ చేస్తారు) గానూ, చతుర్దశిని 'నరక చతుర్దశి'గానూ జరుపుకొంటాం. ఈ విధంగా ఆశ్వయుజ మాసం పరమ పవిత్రమయినది.

ఆశ్వయుజం అంటేనే స్త్రీ అనీ, దేవి అనీ, సరస్వతి అనీ అర్థం. అందువల్ల ఈ మాసం స్త్రీలకు ప్రత్యేక గౌరవాన్ని సంతరింపజేసే మాసంగా చెప్పవచ్చు. నరకాసుర సంహారంలోనూ 'సత్యభామ' వీరోచిత ప్రదర్శన లోకవిదితమే కదా! ప్రకృతి పురుషుల సంకేతమైన ఈ సృష్టిలో కాలాన్ని కూడా స్త్రీ పురుష పరంగా విభాగం చేశారు మన పూర్వులు.

చైత్రమాసం నుంచి భాద్రపదమాసం వరకు పురుష పరంగా ఆశ్వయుజం నుంచి ఫాల్గుణం వరకూ స్త్రీపరంగా అన్వయించారు. పుష్యమాసంలో ప్రారంభమయ్యే ధనుర్మాసవ్రతం 'ఆచరించి గోదాదేవి శ్రీరంగనాయకుడిలో' ఐక్యమై ప్రకృతి పురుషుల బంధాన్ని ఈవిధంగా నిరూపించింది.

స్త్రీ శక్తి అనన్య సామాన్యం. దేవతలలో 'లలితారాధన' మహోత్కృష్టం. అందుకే లలితా ఉపాసన ద్వారా ఎందరో మోక్షగాములయ్యారు. అంతటి అద్భుతమైనది 'దుర్గ' అనే నామం. ఇది విశిష్ట గుణోపేతమైనది. అందుకే శంకరాచార్యులు ఎక్కడ 'దుర్గ' నామస్మరణ జరుగుతుందో అక్కడ అమ్మవారు వేంచేసి ఉండే దివ్య కైలాసమని కీర్తించారు. దుర్గలో అన్ని గుణాలూ ఉన్నాయి. శైవ, వైష్ణవ, గాణపత్య మొదలైన వివిధ సంప్రదాయవాదులకు కావలసిన గుణాలన్నీ అమ్మవారిని ఉపాసించే సంప్రదాయమైన 'శాక్తేయం'లో దొరుకుతాయి.

*దుర్గాస్మరణజం దేవి దుర్గా స్మరణజం ఫలం*
*శైవోవా వైష్ణవో వాపి శాక్తోవా గిరినందిని*
*భజేద్దుర్గాం స్మరేద్దుర్గాం యాచేద్దుర్గాం శివప్రియామ్*

అందువల్ల దుర్గనామస్మరణ మాత్రులకి మోక్షం కరతలామలకం.

*దుర్గే దుర్గేతి దుర్గాయాః దుర్గే నామ పరంమనుమ్*
*యో జపేత్ సతతం దేవి జీవన్ముక్త స్సమానవః*

పిచ్ఛలాతంత్రం, ముండమాలాతంత్రం వంటి గ్రంథాలు దుర్గ నామ మహిమను ప్రకటిస్తున్నాయి. ఇది సర్వసులభం. మహాఫలదాయకం. అకఠినం. అగ్ని, చోర, సింహ, వ్యాఘ్ర, పిశాచాది భయాలు, దారిద్ర్య బాధలు, అనారోగ్య బాధలు, ఈతిబాధలూ పటాపంచలైపోతాయి. సమస్త సంపదలు సిద్ధిస్తాయి. ఒక్క దుర్గ నామజపంతోనే ఇది సాధ్యం. ధనధాన్యాలకూ, సౌభాగ్యానికి, ధైర్యానికీ, స్థైర్యానికీ దుర్గామాత ప్రతీక. జగన్మాతగా, ఆదిశక్తిగా, ధనలక్ష్మిగా, ధాన్యలక్ష్మిగా ప్రజలను కాచే తల్లి దుర్గ. అందుకే ఎందరెందరో రాజులు, చక్రవర్తులు, సామాన్యులు, అసామాన్యులు యుగయుగాలుగా పూజిస్తున్నారు. కీర్తిస్తున్నారు.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సీత, రుక్మిణి మొదలైన దివ్యపురుషులు, అశోకుడు మొదలైన చారిత్రక పురుషులు విజయదశమిని ఘనంగా నిర్వహించేవారు. ఆబాలగోపాలాన్నీ అలరించే దివ్యమైన పర్వదినం విజయదశమి. సంస్కృతీ సంప్రదాయాల సమ్మేళనంతో, స్త్రీలనూ, పిల్లలనూ ఆనందింపజేస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రకాశింపజేస్తూ జరిగే మహోత్సవమిది.

ఈ పుణ్యకాలంలోనే తిరుపతిలో స్వామివారి బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయి. మానవులకు కావలసిన భౌతిక, ఆధ్యాత్మిక, దైవితమైన తాపత్రయాలను ఉపశమింపజేసి చిత్తశాంతిని కలిగించి, ఆత్మస్థైర్యాన్ని పెంచే దివ్యమాతను సదా ధ్యానించటం ద్వారా సుఖశాంతులు, ఇహపరసాధన సులభంగా లభిస్తాయి. అందుకే దుర్గను స్మరిద్దాం. దుర్గనే భజిద్దాం. దుర్గనే యాచిద్దాం.

**- డా॥ అద్దంకి శ్రీనివాస్**

## అమ్మకు వందనం

అనాదిగా సృష్టి, స్థితి, లయలకు పరోక్ష కారణం అమ్మే
అమ్మ–ముగురమ్మల మూలపుటమ్మ
సహనం మూర్తీభవించిన స్త్రీ స్వరూపిణిగా అమ్మ
నిలువునా కరిగిపోయింది.
దుర్మార్గం కారుచీకటై కమ్ముకొస్తున్నా
వెలుగుదీపమై ప్రసరించటం అమ్మకికాక ఇంకెవరికి తెలుసు?!
'దుష్టత్వం' వ్యష్టి నుంచి సమిష్టికి చీడపురుగై వ్యాపిస్తే
భద్రకాళికై తుంచివేయటమూ అమ్మకే తెలుసు.
అమ్మ జీవితంలో ఎన్నెన్ని దశలు.. ఎన్నెన్ని స్వరూపాలు
ఎన్ని ప్రశ్నలు.. ఎన్ని సమాధానాలు..
ఇవ్వటంలో ఉన్న ఆనందం అమ్మనుంచే కదా తెలిసేది..
బాధను మునిపంటి కింద నొక్కిపెట్టగల స్థైర్యం
అమ్మ గోరుముద్దలే కదా నేర్పాయి.
ఎంతనేర్చినా ఎంత ఎదిగినా ఇంకా ఎప్పటికీ
అమ్మ పాఠంలోని కొత్తదనం
అమ్మ చూపే దారిలో కనిపించే విలువలు
ఎంతని చెప్పగలం.
అందుకే అమ్మలుగన్న అమ్మ.. ముగురమ్మల మూలపుటమ్మ
సర్వమూ తానై.. తానే సర్వమై..
ఇంటింటా ఒక అమ్మలా.. తానే..
తన ఒడిలో విశ్వాన్ని లాలిస్తూ.. పాలిస్తూ..
లేకపోతే.. అమ్మే లేకపోతే
ఈ జగత్తులో కదలికల్ని.. చైతన్యాన్ని.. ప్రాణాన్ని
ఊహించుకోగలమా..
అమ్మా! అందుకే.. అందుకో ఈ వందనం...

**- డా॥ ఎస్.ఎ.టి. రాజ్యలక్ష్మి**

**సైన్సు ఎంత అభివృద్ధి చెందినా ఇంకా ప్రకృతిలో మనిషికి అంతుబట్టని రహస్యాలు ఎన్నో ఉన్నాయి. ఇటువంటి రహస్యాల ను ఎన్నింటినో తనలో దాచుకున్న వాటిలో సముద్రం ఒకటి. సాగర గర్భాల్లోకి పయనించి పరిశోధకులు ఎప్పటికప్పుడు కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటూనే ఉన్నారు.**

సాగర గర్భంలోని అగ్నిపర్వతాల విస్పోటనం వల్ల సముద్ర అడుగుభాగం అయస్కాంత ప్రభావానికి లోనైందని తెలుసుకున్నారు. సాగరాలలో నిల్వ వున్న ఖనిజ సంపదల గురించి అధ్యయనం చేయగలిగారు. టైటానియం నిల్వలు, మాంగనీసు ఖనిజాల సంపదలు, ఆయిల్ నిక్షేపాల గురించి తెలుసుకోగల్గుతున్నారు.

# సాగరాలు - పరిశోధనలు





శత్రుదేశాల జలాంతర్గాములు సముద్రాలలో ఎంత అడుగు నుండి దూరంగా, నిశ్శబ్దంగా ప్రయాణిస్తున్నా ఇట్టే పసిగట్టగల్గుతున్నారు.

## పగడాల దిబ్బ

సముద్రం అడుగున వున్న కోరల్ రీఫ్సను మనం పగడాల దిబ్బగా చెప్పుకుంటాము. ఇది కొన్ని దశాబ్దాలలో కనుమరుగు కానుందా? అని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

కోరల్స్ అనేవి ఒకటి రెండు కాదు, కొన్ని వందల రకాలుగా వున్నాయి. ఒక్క ఆస్ట్రేలియన్ గ్రేట్ బారియర్ రీఫ్‌లోనే 429 కోరల్ జాతులు వున్నాయి. వీటికి ఏ మాత్రం ప్రమాదం వాటిల్లినా పర్యావరణంపై దాని ప్రభావం ఉంటుంది.

కోరల్స్ రకరకాల ఆకృతుల్లో ఉండే ఒక నిమ్నజాతి జంతువు అని చెప్పుకోవచ్చు. ఎన్నెన్నో స్పర్శకాలతో ఉండే జలచరం అది. వీటి శరీర కళేబరాలు కాల్షియమ్‌తో నిండి ఉంటాయి. ఇవి రకరకాల విషపదార్థాల ను ఉత్పత్తి చేస్తూ ఉంటాయి. ఈ విషపదార్థాలు మనుషుల దీర్ఘ రోగాలను నయం చేయగల ఔషధాల తయారీకి పనికి వస్తాయి.

ఈ కోరల్సను నాశనం చేయడంలో మనిషి తన వంతు విశేషంగా కృషి చేస్తున్నాడు. ఇది విచారించతగ్గ విషయం.

## మానవ హాని

గ్లోబల్ వార్మింగ్, చేపల్ని అసంఖ్యాకంగా పట్టివేయడం, సముద్ర జలాల్ని కలుషితం చేయడం వంటి పనులు కోరల్స్ పాలిట శాపాల వుతున్నాయి. తుపానులు, తోకచుక్కల దాడి, హిమయుగాల తాకిడి వంటివి కోరెల్సకు ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి.

కోరల్ ఎకాలజీ, కోరల్ కెమిస్ట్రీ శాఖలలోని పరిశోధకులు వీటిపై పరిశోధనలు చేస్తున్నారు.

## కోరల్స్ ఎలా ఉంటాయి?

కోరల్స్ కొన్ని వేల సంఖ్యతో సూక్ష్మాతి సూక్ష్మమైన టెంటకల్స్, స్పర్శకాలతో ఉంటాయి. వీటి ఆకారాలు వేలాది రూపాల్లో ఉంటాయి. కొన్ని చెట్ల రూపంలో, మరికొన్ని దుబ్బుల రూపంలో, పళ్లాల రూపంలో, శిలల రూపంలో, బండరాళ్ల రూపంలో ఉంటాయి.


చేపలు, లోబ్‌స్టర్స్, మొలాస్కులు, ఆక్టోపస్‌లు, సీ-ఎనిమోన్స్ వంటివి ఈ ఆకారాల మధ్య తలదాచుకుంటాయి. ఈ కోరల్స్ విడుదల చేసే విషాలతో ఎన్నెన్నో కొత్త కొత్త ఔషధాలు తయారు చేయవచ్చునంటున్నారు ఈ రంగంలోని పరిశోధకులు. కడుపునొప్పి తగ్గేందుకు, వాయువుకు ఉపశమనంగా ఉండే మందుల తయారీ సాధ్యం అంటున్నారు. వీటితో ఎయిడ్స్‌కు చికిత్స చేయగల మందులు కూడా తయారు చేయవచ్చని కొందరి అభిప్రాయం.

కోరల్స్ విషప్రభావానికి కొన్ని జాతుల కోరెల్స్ మరణిస్తున్నాయి.

కొన్నయితే మరణం లేకుండా బ్రతికేస్తున్నాయి. బండరాళ్ల రూపంలో వున్న కోరల్స్ కొన్ని శతాబ్దాల కాలం నుండి జీవిస్తూ వున్నాయని వారి అభిప్రాయం.

1980లో 'హరికేన్ అవెన్' కరిబియాన్ దీవుల్లో వచ్చింది. ఈ తుపాను దెబ్బకు కొమ్ములు తిరిగిన జింకలు మాదిరి రూపం గల కోరల్స్, శాఖోప శాఖలుగా పెరిగినవి తుడిచి పెట్టుకుపోయాయి. అయితే తిరిగి మళ్లీ అవి తలెత్తి రూపొందడం విశేషం. ఇంతటి బలమైన ప్రత్యుత్పత్తి శక్తి గల ఈ జాతి మానవుని వికృత చేష్టలకు కనుమరుగై పోతుందేమోనని శాస్త్రవేత్తలు భయపడుతున్నారు.

సముద్రాల అడుగున దాగి వున్న ఈ కోరల్స్ పై కూడా మనిషి తన ప్రభావం చూపడానికి వెనుకాడక పోవడం ఇచట కొసమెరుపు.




## మానవ నేత్రానికి చిక్కనవి!

మనిషి నేత్రానికి దొరకని ఎన్నో జీవులు సాగరాల్లో ఉండడం మరొక విశేషం. ఈ జీవుల్లో కొన్ని చాలా పెద్దవి కూడా వున్నాయి. స్క్విడ్ చేప అరవై అడుగులు పొడవు ఉంటుంది. ఈ జాతి చిన్న చేప కూడా మన పెద్ద లారీ సైజులో ఉంటుంది.

ఈ స్క్విడ్ చేపలు సాగర అగాథాల్లో ఉంటాయి. అచటకు కాంతికిరణం అనేది చొరలేదు. దీని గురించి 1870లో తొలి రికార్డు లభించింది. అప్పట్లో మత్స్యకారులు తమకు దొరికిన ఒక స్క్విడ్ చేప కొమ్మును అమెరికాలో ఒక శాస్త్రవేత్తకు బహూకరించారు. అది స్క్విడ్ చేప తంతువుల్లో చివరి భాగంగా ఆ శాస్త్రవేత్త గుర్తించాడు.

ఈ స్క్విడ్ చేపలు చచ్చిపోయినవి, చచ్చిపోతున్నవి సాగర తీరాలకు రావడం చాలామందికి తెలుసు. కాకపోతే ఇవి సాగర గర్భంలో తమ నివాస ప్రాంతాల వద్ద ఈతకొడుతూ ఉండగా చూసిన వారెవ్వరు లేరు.

'ఆర్కిటూతిస్' వంటి వేలాది జలచరాలు సముద్రం అడుగున ఇప్పటికీ ఉన్నాయని, అయితే వాటి గురించి మనిషికి ఇంతవరకు ఏమీ తెలియదని శాస్త్రవేత్తలు ఒప్పుకుంటున్నారు.

సముద్ర జలాల దిగువ భాగంలో జెల్లీఫిష్, ఎనిమోన్స్, కోరల్స్, మొలస్కా, క్లామ్స్ వంటి సాధారణ సముద్ర చరాలే కాదు, అసాధారణమైన లాంప్‌షెల్స్, పీనట్‌వార్మ్స్, మాస్ యానిమల్స్, రిబ్బన్ వార్మ్స్, ఇంకా పేరేమి లేని జీవులు వేల సంఖ్యలో ఉంటున్నాయని పరిశోధకులు భావిస్తున్నారు.

కాంతిచొరని అగాథాల లోతుల్లోకి చాలా శక్తివంతమైన కెమెరాలతో చూడగలిగితే 'మరో ప్రపంచం' కన్పిస్తుందని వీరి ఊహ.

## ద్వీపాలు ఏమవుతున్నాయి?

పది లక్షల సంవత్సరాల నుండి ఓహూ ద్వీపంలో సగభాగం కనబడటం లేదు. అది ఏమయ్యిందో శాస్త్రవేత్తలు ఆరా తీస్తూనే వున్నారు. ఓహూ ద్వీపంలోంచి ఒక ముక్క విరిగి సముద్రంలో పడిపోయింది.

భూమి లోలోపల కరిగిన శిలాద్రవం లావాగా భూమి పైకి ఉప్పొంగింది. ఈ లావా కారణంగానే ద్వీపాలు అవతరించాయి. హవాయి ద్వీపాలలో కొండరాళ్లు విరిగిపడడం వల్ల, సముద్రంలో లేచిన కెరటం ఉప్పెన రూపం ధరించి 2300 అడుగుల ఎత్తుకు లేచి ఆ కొండరాళ్లను సముద్రం లోపల 15 వేల అడుగుల వరకు విసిరి వేసిందని తెలుసుకున్నారు.





గ్లోరియా అనే సోనార్ వ్యవస్థ ఆధారంగా ఒకేమారు 60 మైళ్ల విస్తీర్ణంలోని సముద్ర అగాథాలలోని నైసర్గిక స్వరూపాన్ని చిత్రపటంగా పొందే వీలుంది. దీనిని బ్రిటిష్ పరిశోధనా నౌక 'ఫార్నెల్లా' వెనుక వేలాడదీసి సముద్రంపై పరిశోధనలు చేస్తున్నారు. దీని ఆధారంగానే ఓహూ ద్వీపంలోంచి ముక్క విరిగి సముద్రంలో పడిపోయిందని తెలుసుకోగలిగారు.

హవాయి ద్వీపం గురించిన సమాచారం వెలుగులోకి వచ్చింది. సాగర గర్భంలోకి వెళ్లి పరిశోధనలు జరపగల అధునాతన పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి.

- సి.వి. సర్వేశ్వర శర్మ

టెలివిజన్ కార్యక్రమాల్లో కార్టూన్ షోలు చూసే ఏ చిన్నారినైనా అడగండి - ఏ కార్యక్రమాలు ఇష్టం అని 'ఛోటా భీమ్' అనో, 'కృష్ణ బలరామ్' అనో సమాధానం వస్తుంది. లేదా ఇటువంటి పాత్రలు ఉన్న మరేవో కార్యక్రమాల పేర్లు చెప్పటం ఖాయం.

అదే ఇంకొంచెం అధిక వయస్సున్న వారిని ఇదే ప్రశ్న ప్రశ్న అడిగితే 'డబ్ల్యు డబ్ల్యు ఎఫ్' (వరల్డ్ రెజిలింగ్ ఫెడరేషన్) పోటీలని ఆ టీనేజర్లు సమాధానం ఇస్తారు.




# భారత 'మల్లయుద్ధ'

ఒలింపిక్ పోటీల్లో సుశీల్ కుమార్ పాల్గొని కుస్తీ పోటీల్లో కాంస్య పతకం గెలుచుకోవటం, న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో భారతీయ 'మల్లయుద్ధ' వీరులు అధిక సంఖ్యలో పతకాలు గెలుచుకోవటం, వాటి ప్రత్యక్ష ప్రసారాలను టెలివిజన్‌లో వీక్షించటం మొదలైనవన్నీ ఔత్సాహిక క్రీడాకారులపై మంచి ప్రభావాన్ని కనబరిచాయి. భారత దేశంలో ప్రాచీన కాలంనుంచి ప్రాచుర్యంలో


దారాసింగ్

ఉన్న కుస్తీ పోటీలపై ఇటీవలి కాలంలో ఆసక్తి పెరిగి, ప్రాచీన క్రీడకు మరింత ప్రాణం వచ్చింది. ఇప్పటి వరకూ కుస్తీ పోటీల ప్రభావం ఎక్కువగా పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లోనే కన్పించేది.

భారతదేశ సాంప్రదాయిక కుస్తీ పోటీలు లేదా 'మల్లయుద్ధం' క్రీడకు శతాబ్దాల చరిత్ర ఉంది. క్రీస్తు పూర్వం 5వ శతాబ్దంలోనే ఇది ఆవిర్భవించింది. 13వ శతాబ్దం నాటి 'మల్ల పురాణం' కూడా కుస్తీ పోటీలకు సంబంధించినదే. ప్రస్తుతపు కుస్తీ పోటీలు భారత, పర్షియన్ల విధానాల మేళవింపని చెప్పవచ్చు. మొఘల్ యుగంలో దీన్ని ప్రవేశపెట్టారు.


గామా

కుస్తీ పోటలు సాధారణంగా మట్టి నేలపై జరుగుతాయి. మద్యపానం, పొగతాగటం, మాంసాహారం వంటి వాటికి ఆటగాళ్లు దూరంగా ఉండాలని కుస్తీ పోటీ నిబంధనలు నిర్దేశిస్తాయి. 'మల్ల యుద్ధ' వీరుల ఆహారంలో పాలు, నెయ్యి, బాదం, గుడ్లు, చపాతీలు మొదలైన బలవర్ధక పదార్థాలుంటాయి. భయంకరమైన కుస్తీ పోటీల



# యోధులు



లక్షణమైన 'రజోగుణాన్ని' ఎదుర్కొనేందుకు పైన పేర్కొన్న సాత్వికాహారం ఉపయోగపడుతుంది.


కుస్తీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ శరీర దారుఢ్యాన్ని పెంచుకోవడానికి వ్యాయామశాలల్లో కఠినమైన ఎక్సర్‌సైజులు చేస్తారు. సిలిండర్ ఆకారంలో ఉన్న బరువైన రాతిని ఎత్తడం, గుది బండను మెడనుంచి వేలాడ దీసుకోవడం, గద విన్యాసాలు వంటివి సాధన చేస్తుంటారు.

కుస్తీ పోటీల్లో గెలిచిన వారికి 'రుస్తుమ్ - ఎ - హింద్', లేదా 'రుస్తుమ్ - ఎ - పంజాబ్', లేదా 'భారత్ కేశరి' లేదా 'రుస్తుమ్ - ఎ - జమానా' (ప్రపంచ ఛాంపియన్) అని కాని బిరుదులు ఇస్తారు. ఇదివరకటి పర్షియాకు చెందిన ఒక మల్ల యోధుడి పేరును ఈ బిరుదుల్లో చేర్చారు.

భారతదేశ కుస్తీ పోటీల చరిత్రలో అత్యంత ప్రసిద్ధి చెందిన వారు ఎవరంటే, దారాసింగ్ అని నిస్సందేహంగా చెప్పవచ్చు. కుస్తీ పోటీల ద్వారా ఎంత ప్రాచుర్యం వచ్చిందో, అంతకంటే ఎక్కువ ప్రాచుర్యం ఆయనకు సినిమాల ద్వారా వచ్చింది. 100 పైగా సినిమాల్లో ఆయన నటించటంతో దారాసింగ్ పేరు దేశంలోని ఇంటింటా మారుమోగి పోయింది. అయితే, దారాసింగ్ కంటే ఘనమైన రికార్డులు సాధించిన వ్యక్తి గులామ్ మొహమ్మద్. 'గామాపహిల్వాన్'గా ఈయన ప్రసిద్ధుడు. అయితే, ఇప్పటి తరానికి ఇవన్నీ పెద్ద గొప్పగా అన్పించకపోవచ్చు.

50 ఏళ్లపాటు వరసగా ఎదురులేని ఏకైక 'మల్లయుద్ధ' యోధునిగా చరిత్రలో నిలిచిపోయిన వ్యక్తి గామా. 1882లో అమృత్‌సర్‌లో జన్మించిన





గామా 1910లో ప్రపంచ హెవీ వెయిట్ ఛాంపియన్ అయ్యారు. ఆయన గురించిన కొన్ని ఆసక్తికరమైన విశేషాలు:

10 సంవత్సరాల వయస్సులోనే గామా ఒక కుస్తీ పోటీలో పాల్గొని అందరినీ అబ్బురపరిచాడు. జోధ్‌పూర్‌లో జరిగిన ఒక కుస్తీ పోటీలో 400 మంది పైగా మల్లయోధులు పాల్గొన్నారు. చివరికి పోటీలో నిలిచిన ఆఖరు 15 మందిలో గామా కూడా ఉన్నాడు. అప్పుడు జోధ్‌పూర్ మహారాజు జోక్యం చేసుకుని పోటిని నిలిపివేసి, గామాను విజేతగా ప్రకటించాడు. ఈ పోటీల్లో గామా కనబరచిన శారీరక దారుఢ్యం, శ్రద్ధ, అంకిత భావం గమనించిన మహారాజు చిన్నవాడైన గామాను విజేతగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యంలో ముంచాడు.


10 సంవత్సరాల తరువాత గామాకు మరింత కీర్తి ప్రతిష్ఠలు వచ్చాయి. పంజాబ్‌కు చెందిన మల్లయోధుడైన రహీమ్ బక్ష్ సుల్తానివాలా అప్పటికే భారత మల్లయుద్ధ ఛాంపియన్‌గా ఉన్నాడు. అప్పుడు జరిగిన ఒక పోటీలో గామా రహీమ్‌తో పోటాపోటీగా తలపడ్డాడు. 5 అడుగుల 7 అంగుళాలున్న గామా 7 అడుగుల ప్రత్యర్థి రహీమ్‌తో ఏ మాత్రం సాటి రాడనుకున్నారు. గంటలకొలదీ ఆ పోటీ జరిగింది. చివరికి డ్రాగా ముగిసింది. మొదట్లో గామా రక్షణార్థం కలబడ్డాడు. అయితే, తరువాత ముక్కు, చెవుల నుంచి విపరీతంగా రక్తం కారుతున్నప్పటికీ, రహీమ్ బక్ష్‌ని తీవ్రంగా గాయపరచగలిగాడు.


1910 నాటికి దేశంలోని అత్యున్నత స్థాయి మల్లయోధులందరినీ మట్టి కరిపించిన గామా పోటీలలో, పాల్గొనడాన్ని మరింత విస్తరించాడు. ఇంగ్లాండుకు వెళ్లి, పాశ్చాత్య మల్లయోధులకు సవాలు విసిరాడు. 30 నిమిషాల వ్యవధిలో ఏ ముగ్గురు మల్ల యోధులనైనా మట్టికరిపిస్తానని సవాలు విసిరాడు.

తరువాత స్తానిస్లాస్ బైస్కో, ఫ్రాంక్ రోలర్‌లకు సవాలు చేస్తూ -వారిద్దరినీ ఏకకాలంలో ఓడిస్తానని, లేని పక్షంలో మొత్తం ప్రైజు మనీ వారికిచ్చేసి ఇంటికెళ్లిపోతానని ప్రకటించాడు. అమెరికాకు చెందిన బెంజమిన్ రోలర్ ఈ సవాలును స్వీకరించాడు. బెంజమిన్ రోలర్‌ను మొదటి 100 సెకండ్లలో పడగొట్టి, రెండవ మల్లయోధుణ్ని 9 నిమిషాల 10 సెంకడ్లలో మట్టి కరిపించాడు మన గామా.

1910 సెప్టెంబర్‌లో అంటే సరిగ్గా 101 సంవత్సరాల క్రితం బైస్కో వంతు వచ్చింది. 250 డాలర్ల ప్రైజు మనీ, జాన్ బుల్ బెల్ట్ పందెంగా తలపడ్డారు. ఒక నిమిషంలోపే బైస్కోను ఓడించాడు గామా. అయితే,







రెండు గంటల 35 నిమిషాల పాటు బైస్కో నేలపై ఉన్న మ్యాట్‌ను కరిచిపెట్టుకుని అలాగే ఉండిపోయాడు - గామాకి గెలుపు దక్కకుండా చేయడానికి. అయితే, వారం తరువాత మళ్లీ ఇద్దరూ తలపడ్డారు. బైస్కో ఈసారి కూడా విఫలం కావటంతో, గామానే విజేతగా ప్రకటించారు.

ఈ పాశ్చాత్యదేశాల పర్యటనలో గామా అత్యున్నత స్థాయి మల్లయోధులందరినీ ఓడించాడు. ఎంతగా అయన ఎదురులేకుండా తయారయినాడంటే, ప్రత్యర్థులు గామాతో తలపడటానికి ఏమాత్రం ఇష్టపడనంత. గామా సవాళ్లను స్వీకరించే వారే లేకపోయారు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత అలహాబాద్‌లో రహీమ్ బక్ష్‌ని ఓడించి, 'రుస్తుమ్ - ఎ - హింద్', టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. అందరిలో రహీమ్ బక్ష్ తన బలమైన ప్రత్యర్థి అని గామా అనేవాడు. 1916 నుంచి 1928 వరకు గల మధ్యకాలంలో గామాతో తలపడటానికి క్రీడాకారులే కరువయి పోయారు.

ఇదే కాలంలో ఒక సారి పాటియాలాలో బైస్కోకి, గామాకి మధ్య కుస్తీ పోటీ జరిగింది. 42 సెకండ్లలోనే బైస్కో మట్టి కరవాల్సి వచ్చింది. ఆ తరువాత సంవత్సరం జెస్సి పీటర్‌సన్‌ను 90 సెకండ్లలోనే గామా ఓడించాడు. బహుశా ఇదే అతని ఆఖరి కుస్తీ పోటీ కావచ్చు. ఆ తరువాత 23 సంవత్సరాల్లో గామా సవాళ్లను స్వీకరించడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. చివరికి 1952లో గామా ఓటమి అనేదే ఎరుగకుండా కుస్తీ పోటీలనుంచి రిటైర్‌మెంట్ ప్రకటించాడు.

దేశ విభజన జరిగిన తరువాత గామా తన సహోదర మల్లయోధుడైన ఇమామ్ బక్ష్ కలిసి పాకిస్తాన్‌లో ఉండడానికే నిశ్చయించుకున్నాడు. అయితే, 1960 మే 21న లాహోర్‌లో దుర్భర దారిద్ర్యంతో గామా కన్నుమూశాడు. పేదరికం కారణంగా తన ట్రోఫీలన్నిటినీ, చివరికి ప్రిన్స్ ఆఫ్ వేల్స్ 1922లో తనకు బహూకరించిన వెండి పతకాన్ని కూడా గామా అమ్మేశాడు, అయినా అతని పేదరికం తీరలేదు.

పంజాబ్‌కి చెందిన దారాసింగ్ కూడా అమృత్‌సర్‌లో , జాట్ కుటుంబంలో పుట్టాడు. ఇప్పుడాయన వయస్సు 83 సంవత్సరాలు. చిన్నతనంలోనే దారాసింగ్ శారీరక దారుఢ్యం గమనించిన పెద్దలు ఆయనకు భారతీయ తరహా కుస్తీ పోటీల్లో పాల్గొనవలసిందిగా ప్రోత్సహించారు.

భారతదేశంలో జరిగిన కుస్తీ పోటీల టోర్నమెంట్లలో దారాసింగ్‌నే గెలుపు వరిస్తుండేది. భారత సంస్థానాధీశుల ఆహ్వానం మేరకు ఆయన పాల్గొంటుండేవాడు. తరచుగా ఫెయిర్లు, కార్నివాల్స్‌లో కుస్తీ పోటీలకు హాజరయ్యేవాడు. అమెరికాలోని అత్యున్నత స్థాయి మల్లయోధులను కూడా ఆయన ఓడించాడు.

భారతదేశంలో 1940,1950,1960 దశకాలన్నిటిలో జరిగిన కుస్తీ పోటీల్లో ఆయన పాల్గొన్నాడు. తరువాత అనేక చలన చిత్రాల్లో దారాసింగ్ నటించాడు. 100కు పైగా చలన చిత్రాలు, ఆ తరువాత టెలివిజన్ సీరియల్‌లలో నటించాడు. హనుమంతుడు, భీముడు వంటి పాత్రలను ఈ సీరియళ్లలో ఆయన పోషించాడు. ఆయన ఇటీవలి తాజా చిత్రం కరీనా కపూర్ నటించిన 'జబ్ వుయ్ మెట్'. నటించడమే కాక, కొన్ని చిత్రాలను నిర్మించి, దర్శకత్వం కూడా వహించాడు.

1983లో దారాసింగ్ కుస్తీ పోటీలకు స్వస్తి చెప్పాడు. రుస్తుమ్ - ఎ- పంజాబ్, రుస్తుమ్ - ఎ- హింద్ వంటి వాటితో పాటు, ఆయన అనేక టైటిళ్లు గెలుచుకున్నాడు. 1996లో రెజ్లింగ్ అబ్జర్వర్ న్యూస్‌లెటర్ హాల్ ఆఫ్ ఫేమ్‌లోకి ఆయనను తీసుకున్నారు. 2003లో రాజ్యసభకు కూడా దారాసింగ్ నామినేట్ అయ్యారు.

**- దాసు కేశవరావు**


**(అనువాదం : వై. సరోజ)**




భారత నిర్మాణ వాలంటీర్లు యం.పి.డి.ఓ. వి. బాలమునెయ్య, అబ్దుల్‌హమీద్, టి.యల్.పి.ఓ. శ్రీమతి ఎన్. రాజేశ్వరమ్మ, జిల్లా లింక్ ఆఫీసర్ శ్రీ వి.సి. నరసింహారెడ్డి, డి.టి.యం. వి. సాంబయ్య, వ. సెక్రటరి

# సమాజ సేవకు వైకల్యం అడ్డుకాదు

## భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా ముందుకు వచ్చిన శ్రీరాములు



సమాజ సేవకు వైకల్యం అడ్డంకి కాదని నిరూపిస్తున్నాడు అనంతపురం జిల్లాలోని పెనుగొండ మండలం, వెంకటరెడ్డి పల్లి గ్రామస్తుడు శ్రీరాములు. గ్రామంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లు చేస్తున్న సేవా కార్యక్రమాల నుండి స్ఫూర్తి పొందిన శ్రీరాములు తాను అంగవికల ఎడైనప్పటికీ, గ్రామంలో గోడ పత్రికను నిర్వహించటానికి ముందుకి వచ్చి ఇతర భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు తనదైన రీతిలో సహకరిస్తున్నాడు. 30 జూలై 2011 నుండి గ్రామంలో గోడపత్రికను నిర్వహిస్తూ గ్రామస్తులకు ఎప్పటికప్పుడు వివిధ వార్తాంశాలను అందచేస్తున్నాడు.




అపార్డ్ నుండి శిక్షణ పొందిన వెంకటరెడ్డిపల్లి గ్రామ పంచాయితీలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామంలో గ్రామసభను చైతన్యపర్చటం, పచ్చదనం, పరిశుభ్రం కార్యక్రమాలు చేపట్టటం వంటి పనులు స్వచ్ఛందంగా చేస్తున్నారు. నిర్వీర్యమవుతున్న యువకుల ఆదర్శాలు ఈ కార్యక్రమం ద్వారా జాగృతమైతాయని, యువత తమ అమూల్యమైన సమయాన్ని దుర్వినియోగం చేస్తూ అల్లరి చిల్లరగా తిరగకుండా మంచి ఆదర్శంతో భావి నాయకులుగా, భావి భారత పౌరులుగా, ఎదగడానికి అవకాశం కలుగుతుందని అంటూ, మంచి కార్యక్రమాన్ని గ్రామంలో ప్రవేశపెట్టినందుకు అపార్డ్‌ని అభినందిస్తున్నాడు.

*- ఎన్. రాజేశ్వరమ్మ, లింక్ ఆఫీసర్, అనంతపురం*



# పోట్లదుర్తి గ్రామంలో భారత నిర్మాణ్ వాలంటీర్ల వైద్య శిబిరం

**వై.యస్.ఆర్. కడప జిల్లా, యర్రగుంట్ల మండలం, పోట్లదుర్తి గ్రామంలోని చేనేత కాలనీలో చేనేత కార్మికులకు సాధారణంగా వచ్చే నొప్పులు, వ్యాధులపై స్థానిక ఫిజియో థెరపిస్టు డా॥ నాగేంద్రతో భారత నిర్మాణ్ వాలంటీర్ బృందం వారు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ శిక్షణా కార్యాలయం నుండి జిల్లా లింక్ అధికారి శ్రీమతి ఏ. ప్రశాంతి, జిల్లా పరిషత్ శిక్షణా మేనేజర్ తదితరులు హాజరయ్యారు.**

ముందుగా భారత నిర్మాణ్ వాలంటీర్ బృందం సభ్యులు గ్రామంలోని చేనేత కార్మికుల నుండి పూర్తి వివరాలు సేకరించి, వాటిని క్రోడీకరించారు. వారికి వచ్చే సాధారణమైన నొప్పులు, వ్యాధుల మీద సర్వే చేసి, సర్వే ఆధారంగా గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని భారత నిర్మాణ్ వాలంటీర్ బృందం నిర్ణయం తీసుకుంది. స్థానిక వైద్యులు డా॥ నాగేంద్రని సంప్రదించి, తమ గ్రామంలో చేనేత కార్మికులు పడుతున్న నొప్పులకు తగు వ్యాయామ పద్ధతులను సూచించవలసిందిగా కోరిన మీదట డా॥ నాగేంద్ర సమ్మతించారు.

మెడికల్ క్యాంపునకు సుమారు 100 మంది పైగా గ్రామంలోని ప్రజలు హాజరైనారు. అందులో 75 మంది మహిళలు. వచ్చిన వారు అందరికీ భారత నిర్మాణ్ వాలంటీర్ బృందం తగు వసతి ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా జిల్లా శిక్షణా మేనేజర్ మాట్లాడుతూ, భారత నిర్మాణ్ వాలంటీర్ బృందం చాలా కార్యక్రమాల గురించి ప్రజలకు తెలపటం జరిగినదని చెప్పారు. భారత నిర్మాణ్ వాలంటీర్ బృందం నుండి శ్రీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, అపార్డ్ ద్వారా గ్రామంలో 26 మంది శిక్షణ పొంది స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధికి పాటుపడుతున్న దానిలో భాగంగా చేనేత కార్మికుల వివరాలు సేకరించిన మీదట ఈ మెడికల్ క్యాంపు నిర్వహించామని అన్నారు.

తరువాత డా॥ నాగేంద్ర చేనేత కార్మికులకు వచ్చే సాధారణమైన నొప్పులు, వాటి నివారణోపాయాలను భారత నిర్మాణ్ వాలంటీర్ల ద్వారా చూపించడం, కొన్ని పద్ధతులను తానే స్వయంగా చూపించడం చేశారు. ప్రజలు పూర్తిగా సహకరించారు. ప్రజలు వ్యక్తిగతంగా తమకు వచ్చే నొప్పులను డాక్టర్‌కు చెప్పారు. వాటికి కూడా డాక్టరు నివారణోపాయాలు సూచించారు.

తరువాత శ్రీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరగడానికి సహకారం అందించిన గ్రామ పెద్ద మాజీ సర్పంచ్ అయిన శ్రీ సురేష్ నాయుడు, ప్రస్తుత సర్పంచ్ శ్రీ బాలముని, డా॥ నాగేంద్ర, శ్రీమతి ప్రశాంతి, జిల్లా శిక్షణా మేనేజర్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

**- ఏ.వి. సురేష్ కుమార్**

***జిల్లా పరిషత్ శిక్షణా మేనేజర్***

# ఆనందహేల - దీపావళి వేళ



*దీపజ్యోతి పరబ్రహ్మ దీపస్సర్వ తమోపహో*
*దీపేన సాధ్యతే సర్వం సంధ్యాదీప నమోస్తుతే*

దీపావళి భారతీయ సంస్కృతికి, నాగరికతకూ, వారసత్వానికీ ప్రతీక. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న భారతదేశంలో ఎన్నెన్ని ఆచార వ్యవహారాలు ఉన్నా, వేరువేరు పద్ధతుల ద్వారానైనా జరుపుకొనే దివ్య పర్వదినం దీపావళి. ఆశ్వయుజ మాసం పరమ పవిత్రమైనది. ఇది శరన్నవరాత్రులతో మొదలై దీపావళి అమావాస్యతో ముగుస్తుంది. దీపావళి ముందు రోజు నరకచతుర్దశి.

### నరక చతుర్దశి

'నరకాసురుడు' అనే రాక్షసుణ్ణి సంహరించాలని దేవతలంతా శ్రీకృష్ణుడికి విన్నవించుకొన్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి వెళ్ళి నరకుడితో యుద్ధం చేసి సంహరించాడు. నరకుడు మరణించిన ఈ రోజునే 'నరక చతుర్దశి' అంటారు.

పాపాత్ముడైన నరకాసురుణ్ణి సంహరించటం వల్ల అందరికీ ఆనందం. ఆ ఆనందానికి ప్రతిరూపమే దీపావళి పర్వదినం. అలాగే బలి చక్రవర్తిని వామనుడు పాతాళానికి పంపిందీ ఈ రోజే. అందువల్ల ఈ రోజు అపమృత్యు నివారకమని విశ్వాసం.

ఈ రోజు తెల్లవారు ఝామున పెద్దలందరూ నరకచతుర్దశి స్నానం చేస్తారు. ఈరోజు లోకాన్నంతటినీ పాలించే లక్ష్మీదేవి నీటిలోనూ, తైలంలోనూ ఆవహించి ఉంటుంది. అందువల్ల శరీరానికి నువ్వుల నూనె పట్టించి అభ్యంగన స్నానం చేస్తారు. ఇది తెల్లవారు జామునే చెయ్యాలి. ఎందుకంటే ఆ సమయంలో స్వాతి నక్షత్రకాంతి నీటిపై తన ప్రభావాన్ని చూపిస్తుంది. మరుసటిరోజు అమావాస్య కాబట్టి సూర్యుడూ తన ప్రభావాన్ని సంపూర్ణంగా చూపుతాడు. నీటికి అధిపతి అయిన వరుణ దేవుడూ  అనుగ్రహదాయియై సిద్ధంగా ఉంటాడు. ఇటువంటి శుభ సమయంలో స్నానం చేయటం ఇటు ఆరోగ్యపరంగానూ, అటు లక్ష్మీ అనుగ్రహప్రాప్తికీ దోహదం చేస్తుందని పెద్దల అభిప్రాయం.

*దీపావళి అమావాస్యా యదారాత్రే దివాభాగే చతుర్దశీ*
*పూజనేయా తదాలక్ష్మీ ద్వజ్ఞేయా సుఖరాత్రికా:*

దీపావళి రోజున అందరూ తెల్లవారు జామునే లేచి లక్ష్మీపూజ, కుబేరపూజ చేస్తారు.

- శ్రీరామచంద్రుడు రావణుని సంహరించిన తరువాత సీతాదేవి, లక్ష్మణ స్వామి, ఆంజనేయాది వానరులు వెంటరాగా భరతుడిని

## ప్రతిరోజూ దీపావళే !

కాకరపువ్వొత్తులు కాల్చటం
టపాకాయలు పేల్చటం
పిండివంటలు తినటం
పురాణాలు వినటం
ఇదేకాదు దీపావళి పండగంటే,
నాడు నరకాసుర వధ జరిగితే
నేడు సామాన్యుని వ్యధ తీరాలి,
అభాగ్యులందరి జీవితాలలో
సూర్యకాంతులు చూపలేకపోయినా
కనీసం వారి కళ్ళల్లో చిరుదివ్వెలు వెలిగించాలి,
పస్తులున్నవారికి పరమాన్నం పెట్టలేకపోయినా
ప్రేమతో పట్టెడుమెతుకులు పంచాలి,
నా అన్నవాళ్ళులేని అనాథలను ఆదుకోవటంలో



మనమంతా మదర్ థెరీసాలం కాలేకపోయినా,
మానం దాచుకోటానికి మానవత్వంతో-
మూరెడు ముతకగుడ్డయినా కప్పగలగాలి,
మనంబాగుంటే అందరూ బాగున్నట్లే-
నా కడుపునిండితే అందరి ఆకలి తీరినట్లే
అనే భ్రమలో బ్రతుకువెళ్ళదీయకుండా
తోటిమనిషికి సాయపడే సాటిమనిషిగా బ్రతకాలి,
మనచుట్టూ వున్నవాళ్ళకు-మేం అనాథలంకాదు
మాకు అందరూ ఉన్నారు
అనే బలమైన భరోసాను ఇవ్వాలి,
అలా, ఆసన్నులను ఆదుకుంటే కలిగేదే తృప్తి  సంతృప్తి,
అదే మన జీవితాలకు అర్థం  పరమార్థం
అప్పుడు-నీకు ఏడాదికొక్కసారే కాదు-
అందరికీ ప్రతిరోజూ దీపావళే.

- డా॥ వి. రాజేంద్రప్రసాద్, రీజనల్ డైరెక్టర్,
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, రాజమండ్రి

కలుసుకొని పట్టాభిషిక్తుడైనప్పుడూ,

- మహావిష్ణువు వామనావతారం ఎత్తి, బలి చక్రవర్తిని మూడడుగుల నేల అడిగి అతణ్ణి పాతాళానికి తొక్కిన సందర్భంగానూ,
- సురాసురులు అమృతం కోసం సముద్ర మధనం చేసినప్పుడు లక్ష్మీదేవి అవతరించిన సందర్భంగానూ,
- శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి నరకాసురుణ్ణి సంహరించిన సందర్భంలోనూ,
- విక్రమార్కుడు పట్టాభిషిక్తుడైనప్పుడూ,
- అశోకుడు కళింగ దేశాన్ని జయించినప్పుడూ ప్రజలు దీపావళిని జరుపుకున్నారు.

చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదు. చెడు లక్షణాలను వదలి మంచిగా మారటానికి 'నరక చతుర్దశి' రోజునే నాంది పలకాలి. దీనికో ఆచారం ఉంది. నరకచతుర్దశి రోజున గడ్డితో గానీ, కాగితాలతో గానీ తయారుచేసి ఊరంతా ఊరేగించి, ఊరిబయటకు తీసుకువెళ్ళి, దానిని తగలబెట్టి అభ్యంగన స్నానం చెయ్యాలి. ఆ మరుసటి రోజు దేవుడికి దీపారాధన చేసి మొట్టమొదటి దీపాన్ని తులసికోట వద్ద పెట్టి నమస్కారం చేస్తారు. మంచినూనె, నెయ్యి, ప్రమిదెలతో దీపాలను వెలిగిస్తారు. ఇంటిని దీపాలతో అలంకరిస్తారు. దివిటీ కొట్టి, తీపి తిని సాయంత్రం మందుగుండు సామాగ్రి కాలుస్తారు. ఊరంతా కాంతులు వెద జల్లుతాయి. అందరిలోనూ ఆనందం వెల్లివిరుస్తుంది.

ఆంధ్ర ప్రాంతంలో దీపావళి రోజున 'కేదార గౌరీవ్రతం' చేస్తారు. కేదారం అంటే పంటపొలాలు. వ్యవసాయదారులు తమ కష్టానికి తగిన లభించి, పొలాలన్నీ పచ్చగా కన్నుల పండుగగా ఉండటాన్ని చూసి కలకాలం తమ జీవితాన్ని ఇలాగే సాగిపోనివ్వాలని దేవుడిని కొలుస్తూ వ్రతం చేస్తారు.

ప్రకృతి స్వరూపుడైన స్త్రీ దేవతల్ని పూజించటం ఈ ఆశ్వయుజ మాసం ప్రత్యేకత. దీపావళి మానసిక వికాసాన్ని కలుగజేసే పండుగ. సమస్యల్ని అధిగమించటానికి మనిషికి విజ్ఞానం కావాలి. తన ప్రయాణాన్ని, కష్టం నుంచి సుఖానికి తనే మరల్చుకోగలగాలి. దీనికి కావలసింది విజ్ఞానం. జ్ఞానజ్యోతి ప్రకాశించగానే అజ్ఞానం తొలగి పోతుంది. 'తమసోమా జ్యోతిర్గమయా' అంటే అర్థం ఇదే.

## బలిపాడ్యమి

దీపావళి తరువాత రోజు బలిపాడ్యమి. ఈ పండుగ వెనుక అనేక పురాణ గాథలున్నాయి. ఈనాడే బలిచక్రవర్తిని బంధించి శ్రీహరివామన రూపంలో అవతరించి, పాతాళానికి పంపాడు. అందువల్ల ఈరోజు 'బలిపూజ' చేస్తారు.

వామనుడి ఆదేశానుసారంగా పాతాళానికి వెళ్ళిన బలి చక్రవర్తి ఈరోజు తిరిగి భూలోకానికి వచ్చి సంచరిస్తాడని, ఇంటింటా అతనికి స్వాగతం లభిస్తుందని పూర్వుల విశ్వాసం. అందుకే బలికి అతిథి పూజలు నిర్వహిస్తారు. బలిచిత్రాన్ని గీసి రంగురంగుల ముగ్గులతో షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. దీనికే 'కారప్రతిపత్' అని పేరు.

ఈ రాత్రి కొందరు ద్యూతక్రీడ ఆడతారు. ఈ రోజు శివుడు పార్వతితో జూదమాడాడనీ, అందువల్ల ఈరోజు ఈ క్రీడలో గెల్చినట్లయితే ఈ సంవత్సరమంతా లాభదాయకంగా ఉంటుందని నమ్మకం. 'బలిపాడ్యమి' ఉదయం శ్రీకృష్ణుడి ప్రీతి కోసం గోవర్ధనగిరి పూజ చేస్తారు.

## తమసోమా జ్యోతిర్గమయ



ప్రకృతి
ఒక పరిణామాత్మకమైన చైతన్యచిత్రం
ప్రతి పర్వమై మానవజీవన వికాసక్రమంలో
ఒక మైలురాయి
పంచభూతాత్మకమైన పరబ్రహ్మతత్వాన్ని
సంప్రదాయంలో అందించే కరతలామలకం
పండుగ మానవ జీవనానికి ప్రతీక
ఆదిమస్వరం విచ్చుకొన్నది మొదలు
మానవ మనుగడ ప్రారంభమయినది మొదలు
పండుగే మనిషికి ఆహ్లాదాన్ని అందించేది.
అసత్యం సత్యంవైపు
చీకటి నుండి వెలుగు వైపు నడిపే దివ్యజ్యోతి
అపమృత్యు భయాలను పటాపంచలు చేసి భవ్యజ్యోతి
లోకమంతటా వెలగాలి
దీపం వెలగగానే చీకటి చిట్లిపోయినట్లు
విజ్ఞానం తాకిడికి అజ్ఞానం వీడిపోవాలి
కుసంస్కారపు కుహరాల్లోకి సంస్కారం చొచ్చుకొనిపోయి
అంతరాలూ, అపార్థాలూ వీగిపోయే
దివ్యజ్యోతిర్మయ ప్రపంచం కోసం ఇప్పుడే
ఒక 'దివ్వె'ను వెలిగించాలి.
హృదయం నుండి హృదయాన్ని వెలిగించే జ్ఞానజ్యోతి
హృదయాంతరాలలో చైతన్య పరిధిని విస్తృతం చేసి
సార్వజనీనమైన ఒక సమైక్యభావనని
సర్వత్రా జ్వాజ్వల్యమానం చేయాలి
అప్పుడే లోకానికి దీపావళి వెలుగు
మానవాళికి ఆనందాల జిలుగు

దేశంలో మరికొన్ని ప్రాంతాలలోనూ గోపూజ చేస్తారు. ఈ రోజునే లక్ష్మీదేవి గోవులలో ఆవహించి ఉంటుందని, అందువల్ల గోరూప లక్ష్మిని పూజించటం అందరి విధి అని ధర్మశాస్త్రాలు ప్రకటిస్తున్నాయి. లక్ష్మి గోరూపంలో వచ్చి దేవతలకు యజ్ఞార్థం ఘృతాన్ని ఇస్తుందని విశ్వాసం.

ఐదో రోజున కూడా 'యమద్వితీయ' ను జరుపుకొంటాడు. చెల్లెలి ఇంట్లో భోజనం చేసి ఆదరణ పొందవలసిన రోజు ఇదే. యమునాదేవి తన సోదరుడైన యముడికి విందు చేసినందువల్ల దీనిని 'భ్రాతృ ద్వితీయ' అని కూడా పిలుస్తున్నారు. దీనికి 'భగినీహస్త భోజనం' అని వ్యవహారం.

ఈ విధంగా దీపావళినీ తదితర పర్వదినాలనూ దీపావళికి అనుబంధంగా చేసుకొంటూ మానవ జీవన వికాసానికి దోహదం చేసే విధంగా మన సంప్రదాయాలను పూర్వులు ఏర్పరచారు. మనదేశంలో ప్రతి ఒక్కరికీ ఆనందంతో పాటు ఆధ్యాత్మికతను పంచే దీపావళి పండుగ ప్రశస్తమయినది.

- ఎస్.ఎ.టి. రాజ్యలక్ష్మి



మెదక్‌జిల్లాలోని 10 నియోజక వర్గాలలోని 82 బాలికా వసతి గృహాలకు చెందిన బాలికలు, వార్డెన్‌లకు '17' బ్యాచ్‌లుగా ఇచ్చిన శిక్షణా కార్యక్రమాలు కిశోర బాలికలలో నూతనోత్సాహాన్ని, ఆత్మస్థైరాన్ని నెల కొల్పాయని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

కిశోర బాలికలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో భాగంగా అపార్డ్ నుండి శ్రీమతి. పి. మాధురి, శ్రీమతి కొండేపూడి నిర్మల, డా॥ నాగమణిల బృందం మెదక్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా -

* 'రజస్వల' అంటే ఏమిటి?
* శారీరకంగా వచ్చే మార్పులు
* గర్భాశయం, అండాశయాలు, అండాల విడుదల, ఫలదీకరణ, పలధీకరణ జరగకపోవడం, నెలసరి సంభవించే విధానం.
* వ్యక్తిగత పరిశుభ్రత
* బహిరంగ మలవిసర్జన వలన కలిగే నష్టాలు

మొదలైన అంశాలపై బాలికలకు శిక్షణనందించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమాల వలన సుమారు 82 మంది హాస్టలు వార్డెన్లు, 420 మంది విద్యార్థినులు ప్రత్యక్షంగా లబ్ధిపొందగా, సుమారు 8000 వేల మంది బాలికలు పరోక్షంగా లబ్ధి పొందగలిగారు.

# కిశోర బాలికలలో నిండిన ఆత్మస్థైర్యం

"మేము ఈ శిక్షణా కార్యక్రమానికి రావడం వల్ల నిత్యజీవితంలో ఉపయోగపడే అనేక విషయాలను నేర్చుకున్నాం. పరిశుభ్రత గురించి నేర్చుకున్నాం. పరిశుభ్రతలో మనం తినే ముందు గానీ, బయటికి వెళ్ళి వచ్చినపుడు గానీ, ఐదు రకాలుగా చేతులను కడుక్కోవడం నేర్పించారు. బాలికలు యవ్వన దశలో పడే ఆందోళనల గురించి కూడా వివరంగా తెలిసింది. నెలసరి గురించి, యవ్వన దశలో బాలికలలో వచ్చే మార్పులను గురించి తెలుసుకోగలిగాం. గర్భాశయం గురించి పటం ద్వారా వివరించి, నెలసరి ఏ విధంగా అవుతుందో మొత్తం వివరించి చెప్పారు. క్లాత్ నాప్‌కిన్స్‌లు ఎలా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చో నేర్చుకున్నాం. మల విసర్జనకు బయటకు పోకుండా, ఇంట్లోనే మరుగుదొడ్డి నిర్మించుకుని వాడుకునేలా అమ్మ నాన్నలను ఒప్పించాలని నిర్ణయించుకున్నాం. ఇలా అనేక కొత్త విషయాలను తెలుసుకున్నాం. ఈ విషయాలనీ మా స్నేహితులకు, ఇంట్లో వాళ్ళకు వివరంగా చెప్తాం."

*- వి.స్వర్ణ, పదవతరగతి,*
*కస్తూరి బా గాంధీ బాలికల వసతిగృహం, రాగోలు*

## మెదక్‌లో అపార్డ్ యునిసెఫ్‌ల శిక్షణా కార్యక్రమాలు

"ఇంతకు ముందు నేను ఒకసారి మాత్రమే స్నానం చేసేదాన్ని, ఇప్పుడు రోజుకు రెండుసార్లు స్నానం చేయాలని అనిపిస్తుంది. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఇతరులకు చెప్పాలని కూడా ఉంది. శుభ్రంగా ఉండాలి అని ఇంతకుముందు నేర్చుకున్నాం కానీ, అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు బొమ్మల ద్వారా బాగా చూపించారు. కాబట్టి చాలా బాగా అర్థం అయింది. చెప్పినవన్నీ చేసి, ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటాం."

*- కె. సురేఖ, షెడ్యూలు కులాల వసతి గృహం, అల్లాదుర్గ్*



"రజస్వల నుండి పరిశుభ్రత వరకూ అనేక విషయాలు నేర్చుకున్నాం. ఎలాంటి బట్టలను ఉపయోగించాలో, ఉపయోగించిన వాటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలో నేర్చుకున్నాం. గర్భాశయం కడుపులో ఉంటుంది అని తెలుసు కానీ, గర్భాశయం గురించిన అనేక విషయాలను తెలుసుకోగలిగాం. రజస్వల కాకముందు, రజస్వల అయిన తర్వాత గల తేడాలను తెలుసుకున్నాం.

*- ఎమ్.నాగరాణి, కస్తూరిబా గాంధీ వసతి గృహం, అల్లా దుర్గ్*

*- పి. మాధురి, ఫాకల్టీ, అపార్డ్*

# జయహో బామ్మా! జయహో!

యం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి



సైరన్ మోగించుకుంటూ ఇంటిముందుకు వచ్చి ఆగిన పోలీస్ జీప్ చూసి కంగారు పడ్డాడు కామేశ్వరరావు. బామ్మని తోడు పిలుద్దామనుకునే సరికి సర్కిల్ ఇన్‌స్పెక్టరు, సబ్ ఇన్‌స్పెక్టరు జీపు దిగి గబగబా లోపలికి వచ్చేశారు. వారి వెనుకే ఇద్దరు కానిస్టేబుల్స్ కూడా దిగారు.

"కామేశ్వరరావు గారు మీరేనా?" అడిగాడు సి.ఐ.రమేష్.

గొంతెండిపోయి, గుండె రెండువందల సార్లు కొట్టుకోగా, నోటిలోంచి మాట రాక అవునని తలాడించాడు కామేశ్వరరావు. సి.ఐ. బయటకెళ్లి 'సుమో'లో వున్న ఎస్.పి.కి కామేశ్వరరావు ఇంట్లోనే వున్నాడని చెప్పాడు. వెంటనే ఎస్.పి.జోగారావు సుమో దిగి గన్‌మెన్ తోడు రాగా, ఇంట్లోకి వచ్చాడు. ఎస్.పి.ని చూడగానే కామేశ్వరరావు పైప్రాణాలు పైకి పోవడానికి సమాయత్తమయ్యాయి. చొక్కా చెమటతో తడిసిపోయింది. బూట్ల చప్పుడు విని చేతిలో అట్లకాడతో వంటింట్లోంచి బయటకు వచ్చింది కామేశ్వరరావు బామ్మ మందారవల్లి.

బామ్మగారిని చూడగానే ఎస్.పి, సి.ఐ.ఎస్.ఐ.లు శాల్యూట్ చేసి తమని తాము పరిచయం చేసుకున్నారు. బామ్మగారు ఆనందంగా తల పంకించి "కూర్చోండి, ఇప్పుడే వస్తానని" చెప్పి "ఒరేయ్ కాముడూ లోపలికి రారా" అంటూ నెత్తి మీది ముసుగు సవరించుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది.

కామేశ్వరరావుకి బుర్ర పనిచేయడం లేదు. ఇంతమంది పోలీసులు ఎందుకొచ్చారు? మొన్న మన్మధరావు పదివేలు అప్పు అడిగితే లేదన్నాడు. అవి మనసులో పెట్టుకొని లేనిపోనివి చెప్పి పోలీసుల్ని తనపైకి ఉసికొల్పాడా? లేకపోతే, నిన్న లంచ్ అవర్లో కొలీగ్ లావణ్యతో మితి మీరిన ఆనందంతో పిచ్చిజోకులు వేశాడు. ఆమె అపార్థం చేసుకొని తన భరతం పట్టమని పోలీసులకు ఫిర్యాదు చేసిందా?

ఆలోచిస్తూ పరధ్యానంగా నడిచి గుమ్మానికి భుజం కొట్టుకోగా వాస్తవలోకంలోకి వచ్చి బామ్మ పక్కకెళ్ళి నిలబడ్డాడు. అప్పటికే వంటింట్లో సెటిలైపోయిన పక్కింటి పద్మాంజలి టిఫిన్లు ప్లేట్లలో సర్దేసింది. బామ్మగారు పెనం మీద ఆఖరి వాయి పెసరట్లు వేగంగా వేస్తున్నారు.

"ఒరేయ్ కాముడూ, ఈ టిఫిన్లు వాళ్ళకిచ్చేసిరా" అంది బామ్మగారు.

కామేశ్వరరావుకి ఉక్రోషం కట్టలు తెంచుకొని వచ్చింది. ఒకటి, తనని 'కాముడూ' అని పిలవద్దని చెప్పినా బామ్మ అలాగే పిలవడం. అదీ తనని ఎప్పుడూ ఆట పట్టించే పద్మాంజలి ముందు పిలవడం. పైగా సర్వెంటు లాగ పోలీసులకి తను టిఫిన్లు అందివ్వడమేంటి? పద్మాంజలి యివ్వచ్చుగా! కానీ... ఏమనలేక మౌనంగా టిఫిన్లు తీసుకువచ్చి టీపాయ్ మీద పెట్టాడు కామేశ్వరరావు.

"అయ్యో! మీరు తేవడం ఏమిటి? మేమే లోపలకు వచ్చి తెచ్చుకునే వాళ్ళంగా" అంటూ పోలీసాఫీసర్లు పెసరట్ల మీద దాడి ప్రారంభించారు. గన్‌మేన్, కానిస్టేబుల్స్ పెసరట్టు, ఉప్మాల ఘుమఘుమలు ఆస్వాదించి నడుములకున్న బెల్టులు వదులు చేసుకొని తమ వంతుకోసం వంటింటి గుమ్మంకేసి ఆశగా చూడసాగారు. పద్మాంజలి వాళ్ళకి కూడా టిఫిన్ ప్లేట్లు అందించి లోపలికి వెళ్ళి మంచినీళ్ళు పట్టుకురమ్మని కామేశ్వరరావుకి పురమాయించింది.

ఆమె మాటలకి కామేశ్వరరావుకి చిర్రెత్తుకొచ్చింది. బామ్మే కాకుండా ఈ ఆకతాయి పిల్ల కూడా తనని ఆట పట్టిస్తోంది కదా! అని బాధపడి.... లోపలికెళ్ళి వాళ్ళందరికీ మంచినీళ్ళు పట్టుకొచ్చాడు.

మూడు నిమిషాలు కూడా ముగియకుండానే మొత్తం ప్లేట్లన్నీ ఖాళీ చేయడమే గాక చెట్నీలని కూడా వేళ్ళతో నాకేసి, ఇటువంటి పెసరట్లు,

**కన్సోలేషన్ బహుమతి పొందిన హాస్య కథ**

ఉప్మా యింతవరకు తినలేదని, నేటితో తమ జీవితం ధన్యమయిందని చెబుతున్న పోలీసుల్ని చూసి అవాక్కైపోయాడు కామేశ్వరరావు. పద్మాంజలి వాళ్ళందరికీ బ్రూ కాఫీలు తెచ్చియిచ్చింది. వాటిని కూడా సేవించి 'తాజ్' హోటల్లో కూడా ఇంత రుచికరమైన కాఫీ దొరకదని, బామ్మగారి చేతివంట తింటున్న కామేశ్వరరావు చాలా అదృష్టవంతుడని పోలీసులందరూ ఏకగ్రీవంగా తీర్మానించి, సదరు తీర్మానాన్ని పద్మాంజలి ద్వారా బామ్మగారి చెవికందించారు. ఆ అభినందనల్ని కొంగున ముడివేసుకుని ముసి ముసి నవ్వులతో సావిట్లోకి వచ్చింది బామ్మగారు.

"ఒరేయ్ కాముడూ! చొక్కా అంతా అలా తడిపేసుకున్నావేరా? వెళ్ళి మొహం కడుక్కుని ఇంకో చొక్కా వేసుకో. అమ్మాయ్ పద్మా! మా వాడికి బీరువాలోంచి మంచి చొక్కా ఒకటి తీసియ్యమ్మా! వెర్రినాగన్న! ఏం తెలియదు."

బామ్మగారి మాటలకి కిసుక్కున నవ్వుతున్న పద్మాంజలిని చూసి మరింతగా ఉడుక్కున్నాడు కామేశ్వరరావు. చంటిపిల్లాడికి చెప్పినట్లు చెప్పడమే కాకుండా, ఈ పిల్ల కోతి పద్మాంజలి పెత్తనమేంటి తన మీద? తన ఏ షర్టు వేసుకోవాలో కూడా ఈవిడగారు చెప్పాలా?

అంటే తనని పోలీస్‌స్టేషన్‌కి పంపడం ఖాయమేనా! అందుకే తనని మంచి షర్టు... బామ్మ పరిభాషలో చొక్కా... వేసుకోమంటోందా? అక్కడ తనని లాఠీలతో కుళ్ళబొడవకుండా వుండటానికేనా వాళ్ళందరికి నేతి పెసరట్లు, ఉప్మా పెట్టిందా బామ్మ? ఆలోచిస్తూ బాత్‌రూంకి వెళ్ళాడు కామేశ్వరరావు మొహం కడుక్కోవడానికి.

* * * * *

**బా**మ్మగారు, పద్మాంజలి పోలీస్ ఆఫీసర్లతో జోకులు వేసుకుంటూ మాట్లాడతుండగా ఎస్.పి. గారి సెల్ రింగయ్యింది. ఫోన్ మాట్లాడి "బామ్మగారూ! సార్ రెండు నిముషాల్లో ఇక్కడికి వస్తారు" అన్నారు ఎస్.పి.

పోలీసులందరూ వీధి గుమ్మం దగ్గర అలర్ట్‌గా నిలబడ్డారు.

కొద్దిసేపట్లోనే వ్యాన్ గుమ్మం ముందు ఆగింది. డి.ఐ.జి. ప్రకాష్ కుటుంబ సభ్యులతో కారు దిగి లోపలకు వచ్చి బామ్మగారికి నమస్కరించారు.

"ప్రయాణం బాగా జరిగిందా?" అని పలకరించారు బామ్మగారు. బాగానే జరిగిందని సమాధానం చెప్పి భార్య సునందని, కూతురు అపర్ణని బామ్మగారికి పరిచయం చేశారు ప్రకాష్.

బామ్మగారి సూచన మేరకు పద్మాంజలి లోపలి గదిలోకి వచ్చి ఒక మంచిషర్ట్‌ని బీరువాలోంచి తీసి కామేశ్వరరావు కందించి కళ్ళతోనే ఆర్డరేసింది వేసుకోమని. కోపాన్ని దిగమింగుకొని షర్ట్ వేసుకొని ఆమెతో కలిసి సావిట్లోకి వచ్చాడు. అంతమందిని చూసి అర్థం కాక బామ్మ పక్కకెళ్ళి కూర్చున్నాడు కామేశ్వరరావు.


పద్మాంజలి కామేశ్వరరావు వెనకచేరి చెవిలో "కాముడూ నీకు మేరేజీ లుక్సేయ్?" అంది చిలిపిగా.

డి.ఐ.జి ప్రకాష్‌ని పరిచయం చేసింది బామ్మగారు కామేశ్వరరావుకి. పరస్పర నమస్కారాలయ్యాయి.

బామ్మగారు తన మెటాలిక్ వాయిస్‌ని ఓపెన్ చేశారు.

"వీడు నా మనవడు కాముడు. వీడు భూమి మీద పడగానే వీళ్ళమ్మ కాలం చేసింది. వీడ్ని బళ్ళో వేశాక వీళ్ళ నాన్న పాము కరిచి చనిపోయాడు. చిన్నప్పటినుంచీ నా దగ్గరే పెరిగాడు. ఎంబిఎ చేసి బ్యాంకు ఆఫీసరుగా పనిచేస్తున్నాడు వెర్రినాగన్న. ఇప్పటికీ ఏదైనా పీడకల వస్తే భయం వేసి నా దగ్గరే పడుకుంటాడు. ఉత్తి అమాయకపు సన్యాసి.

ముక్కు ఎగబీలుస్తూ... మధ్యలో కళ్ళజోడు తీసి కొంగుతో తుడుచుకుంటూ కామేశ్వరరావు బాల్యం... విద్యాభ్యాసం... వీరత్వం వివరించింది బామ్మగారు. ఈ విషయాలన్నీ ఇంత వివరంగా చెప్పాలా అని బామ్మని గుడ్లురిమి చూద్దామని ప్రయత్నించిన కామేశ్వరరావు చుట్టూ వున్న పోలీసుల్ని చూసి విధిలేని పరిస్థితుల్లో అసందర్భమైన నవ్వుని ప్రదర్శించాడు.




"బామ్మగారూ! మాకు ఒక్కర్తే కుమార్తె. వీళ్ళిద్దరికీ ఏ విధంగా పరిచయమైందో మా అపర్ణ మీకు తెలియజేసిందిగా! అందుచేత ఇద్దరూ ఇష్టపడితే మనకు ఇష్టమేగా..." డి.ఐ.జి.గారి మాటలకు ఉలిక్కిపడ్డాడు కామేశ్వరరావు.

ఈ అమ్మాయికీ నాకూ... ఎప్పుడు పరిచయం అయ్యింది? అని ఆలోచిస్తూ తలెత్తి అపర్ణకేసి సూటిగా చూశాడు కామేశ్వరరావు. అతను అలా చూడగానే 'మెరుపు' మెరిసింది కామేశ్వరరావు మస్తిష్కంలో.

'యాహూ!' అని గట్టిగా అరవబోయి పోలీసుల వలయంలో వున్న సంగతి గుర్తొచ్చి ఆగిపోయాడు. విజయవాడలో బ్యాంక్ టెస్ట్ రాయడానికి

వెళ్ళినపుడు బుక్‌లోంచి హాల్‌టికెట్ కిందపడి పోయింది. ఆ సంగతి తను చూసుకోలేదు. రూంలోకి వెళ్ళి నెంబరు సరిచూసుకుందామని బుక్‌లో వెతికితే హాల్‌టికెట్ కనిపించలేదు.

గుండె 108 సార్లు కొట్టుకునే పరిస్థితి వచ్చి చేతులు కంపిస్తుండగా బుక్, బ్యాగ్ ఫాంటు జేబులు అన్నీ వెతికేసుకుంటున్న విపత్కర పరిస్థితుల్లో -

"ఎక్స్‌క్యూజ్ మీ, ఈ హాల్ టికెట్ మీదేనా?" అంటూ చిరునవ్వుతో వచ్చింది అపర్ణ.

క్షీరసాగర మథనంలో అమృతం పంచిపెట్టడానికి వచ్చిన జగన్మోహినిలా ధవళవస్త్రాలతో బంగారు రంగుతో మెరిసిపోతున్న ఆమె వంక కన్నార్పకుండా అలా చూస్తూనే వుండిపోయాడు కామేశ్వరరావు.




మొహం ముందు చిటికె వేసి 'హలో' అని పిలిచి హాల్‌టికెట్ చేతిలో పెట్టి వెళ్ళిపోయిన ఆనాటి తన కలలరాణి ఇలా ఇప్పుడు తన కళ్ళముందు మరోసారి కన్పించడం నమ్మలేక ఎడం చేతిని ఒకసారి 'గిల్లి' చూసుకున్నాడు కామేశ్వరరావు. నిజమే అని ఋజువయ్యింది. నేను కూడా 'గిల్లనా' అని చెవిలో అంటున్న పద్మాంజలి కేసి చిరునవ్వుతో చూశాడు కామేశ్వరరావు.

"ఒక రోజు మీ అమ్మాయి మా కాముడికి రాసిన లెటరు నేను చదివాను. తన బ్యాంక్ టెస్ట్ పాసయ్యానని, ఇంటర్వ్యూలో కూడా సెలక్ట్ అయ్యానని రాసి అడ్రసు యిచ్చింది. మా వాడికి ఆ లెటరు యివ్వకుండా మీ అమ్మాయి ఇ-మెయిల్‌కి మెసేజ్ పంపాను. అలా మేం ఇద్దరం ఛాటింగ్ చేస్తూ బాగా సన్నిహితమయ్యాం. ఆ చనువుతోనే మా మనవడ్ని పెళ్ళి చేసుకుంటావా? అని అడిగాను. రెండురోజులు వ్యవధి తీసుకొని ఆలోచించుకొని అంగీకారం తెలిపింది. అప్పుడు నేను మీకు ఢిల్లీ ఇ-మెయిల్ పంపాను. మీ అమ్మాయి అంగీకరించినందున మీరు ఇలా వచ్చారు. చాలా సంతోషం" బామ్మగారు తన సుదీర్ఘ ఉపన్యాసానికి చిన్న 'బ్రేక్' యిచ్చి కళ్ళజోడు మరలా తీసి కొంగుతో కళ్ళు ఒత్తుకున్నారు.

"బామ్మా! నీకు కంప్యూటర్ ఆపరేట్ చేయడం ఎలా వచ్చు?" ఆశ్చర్యాంబుధిలో మునిగి భారంగా అడిగాడు కామేశ్వరరావు.

"నువ్వు బ్యాంకు నుండి ఆలస్యంగా వచ్చేవాడివి గుర్తుందా! పద్మాంజలి రోజు సాయంకాలం వచ్చి నీ కంప్యూటర్ ఎలా ఉపయోగించాలో నాకు నేర్పింది. నాకో ఇ-మెయిల్ అడ్రసు కూడా క్రియేట్ చేసింది. మేమిద్దరం తరచూ అపర్ణతో ఛాటింగ్ చేసేవాళ్ళం. సంప్రదాయాన్ని గౌరవించే ఈ కుటుంబంలోని పిల్ల దొరకడం నిజంగా నీ అదృష్టంరా కాముడూ" అంది ఆనందంగా బామ్మగారు.

రోజూ తనని అలా పిలిస్తే వినుగనిపించినా, ఈ రోజు 'కాముడూ' అన్న బామ్మ పిలుపులో కొండంత ప్రేమ, సముద్రమంత ఆప్యాయతా కన్పించాయి కామేశ్వరరావుకి.

"సారీ మిస్టర్ కామేశ్వరరావు నీకు తెలియకుండా ఇలా పెళ్ళి చూపులు ఏర్పాటు చేసినందుకు ఏమీ అనుకోవద్దు. హైద్రాబాద్‌లో మా బావమరిది ఇంటివద్ద ఏర్పాటు చేద్దామనుకున్నాం. కానీ పెద్దవారైన మీ బామ్మగారి వద్దకే మేం రావడం సముచితంగా వుంటోందనిపించి మేమే మా అమ్మాయితో  మీ వద్దకు వచ్చాం. మా అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం నీకిష్టమేనా?" డి.ఐ.జి. ప్రకాష్ అలా అడిగేసరికి సంతోషంతో పులకించిపోయాడు కామేశ్వరరావు.

బామ్మగారి కేసి ఆరాధనాపూర్వకంగా చూశాడు. తన కోసం ఎంత శ్రమించింది? తనని పెంచి పెద్ద చెయ్యడానికి ఎన్ని కష్టాలు పడింది? అటువంటి అమృతమూర్తి ఈ వయసులో కూడా కంప్యూటర్ నేర్చుకుని తనకి సరైన జోడిని అందించింది. బామ్మకు 'జయహో... ' అనుకున్నాడు. బామ్మగారి రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని కళ్ళకద్దుకున్నాడు కామేశ్వరరావు. ఈ దృశ్యం చూడగానే ఆనందంగా చప్పట్లు కొట్టింది పద్మాంజలి. ఆమె కేసి ఆత్మీయంగా చూసి షేక్ హాండిచ్చాడు. కామేశ్వరరావు. అపర్ణని చూస్తుంటే అతని మనసు గాలిలో తేలిపోసాగింది.

"మీ అమ్మాయి గారికి కూడా నన్ను పెళ్ళి చేసుకోవడం యిష్టమేనా?" డి.ఐ.జి.ని అడిగాడు కామేశ్వరరావు.

అపర్ణ వెంటనే లేచి బామ్మగారి కాళ్ళకి నమస్కరించింది తన యిష్టాన్ని వ్యక్తం చేస్తూ. బామ్మగారు ఆప్యాయంగా అపర్ణని తన కుడిపక్కన కూర్చోపెట్టుకొని కామేశ్వరరావు, అపర్ణ భుజాల చుట్టూ చేతులు వేసి ముసిముసి నవ్వులు నవ్వింది.

పద్మాంజలి ఈ దృశ్యం చూసి మరోసారి ఆనందంగా చప్పట్లు కొట్టి అపర్ణ, కామేశ్వరరావులకు షేక్‌హాండిచ్చి అభినందించింది.

'పోలీసుల జోక్యంతో పెళ్ళిళ్ళు జరగడం చూశాం. కానీ పోలీసుల పహారాలో 'పెళ్ళిచూపులు' జరగడం ఇదే ప్రథమం అనుకుంటా" పద్మాంజలి మాటలకు అందరూ నవ్వులతో శృతి కలిపారు.

◆



# ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీలు, సమాంతర సంస్థలు - ఓ పరిశీలన

**గత శతాబ్దం 90వ దశకం తొలినాళ్ళలో రాజ్యాంగానికి చేసిన 73, 74వ సవరణల వల్ల గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగంలో చోటు లభించింది. తమ తమ ప్రాంతాలలో సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి సాధనకు అనువైన ప్రణాళికలను తయారు చేసుకోవడం, ఈ సంస్థలు నిజమైన స్థానిక ప్రభుత్వాలుగా రూపొందాలనే ఆశయాలతో ఈ రాజ్యాంగ సవరణలు చేశారు.**

ఆచరణలో ఆ తర్వాత ఆర్థికాభివృద్ధి సాధనకు, ప్రజలకు చేరువ కావడానికి ఎన్నో ప్రత్యామ్నాయ పద్ధతులు అమలులోకి వచ్చాయి. ఈ పద్ధతులు 'అభివృద్ధికి' ప్రత్యామ్నాయ పంధాలుగా మార్గాన్ని సుగమం చేశాయి. ఈ ప్రక్రియ వల్ల ప్రస్తుతం ప్రజల చేత ఎన్నికైన స్థానిక ప్రభుత్వాల చట్టబద్ధత, సామర్థ్యానికి, అదేరకమైన విధులను నిర్వహించడానికై ఏర్పాటు చేసిన సంస్థలకు మధ్య తలఎత్తిన ఘర్షణ పలు చర్చలకు దారితీసింది.

అభివృద్ధి గురించి మాట్లాడేటపుడు ఈ విషయాన్ని పంచాయతీరాజ్ సంస్థలు, సమాంతర సంస్థల మధ్య 'సంబంధం'గా పేర్కొంటున్నాము. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ సంస్థల పనితీరుకు సంబంధించి సైద్ధాంతిక, విధాన పరమైన అంశాలను క్షేత్ర స్థాయిలో అమలవుతున్న పద్ధతులను, పంచాయతీరాజ్, సమాంతర సంస్థల శక్తిసామర్థ్యాలు, లోటుపాట్ల గురించి ఈ వ్యాసంలో చర్చించటం జరిగింది.

ఈ వ్యాసంలో 1990 దశకం నాటి పరిస్థితి గురించి, ముఖ్యంగా 2004 తర్వాత ఉత్పన్నమైన పరిస్థితుల గురించి ప్రధానంగా పరిశీలించడం జరిగింది.

భారతదేశంలో పంచాయతీలకు, పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ పరంగా తగిన అధికారాలు, హక్కులు కల్పించడంతోబాటు, వ్యవస్థాపరమైన సర్దుబాట్లు, సంస్కరణలు 1990వ దశకంలో ఆరంభమయ్యాయి. ఆర్థిక వ్యవస్థలో సర్దుబాట్లు, అట్టడుగు స్థాయి వరకు ప్రజాస్వామ్యాన్ని వికేంద్రీకరించడం, బలోపేతం చేయడంపై చర్చ ఏకకాలంలో ప్రారంభమైంది. ఆర్థికాభివృద్ధి సాధనకు 'సుపరిపాలన' అవసరమని నూతన ఆర్థిక సూత్రాలు వక్కాణించాయి. (సమర్థత ఏ రూపంలో వున్నా ప్రాధాన్యత ఇవ్వాలనే కొత్త ఆలోచనా ధోరణి వ్యక్తమైంది). కాగా, ప్రజాస్వామ్యాన్ని అట్టడుగు స్థాయికి వికేంద్రీకరించాలనే భావన సామాజిక న్యాయంతో ఆర్థికాభివృద్ధి జరగాలనే తర్కంతో ముడిపడివుంది. శక్తివంతంగా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ జరగాలనే చర్చ స్థానిక ప్రభుత్వ సంస్థలు కేవలం పంపిణీ ప్రభుత్వ యంత్రాంగాలుగా గాక నిజమైన భాగస్వామ్య ప్రజాపాలనా సంస్థలుగా రూపొందాలని కోరుతున్నది.

ఈ రెండు ఆలోచనా ధోరణుల మధ్య ఘర్షణే సమాంతర సంస్థలు, పంచాయితీల మధ్య సంబంధాలు బెడిసిపోవడానికి కారణమవుతున్నది. ఆర్థిక సామర్థ్యం పెంపొందాలనే విధాన పరమైన యోచనలు దారిద్ర్య నిర్మూలన, ప్రకృతి వనరుల నిర్వహణ, సేవల పంపిణీలో ప్రత్యామ్నాయ వైఖరుల అభివృద్ధికి దారి తీస్తున్నాయి. విధాన పరమైన ఇటువంటి ప్రయోగాలకు ఆంధ్రప్రదేశ్ ఆరంభవేదికగా వుంది.

ఇలాంటి జోక్యాల కారణంగా పంచాయతీలకు పోటీగా రెండోతరం సమాంతర సంస్థల ఆవిర్భావానికి దారితీశాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఏ గ్రామపంచాయతీలో చూసినా భాగస్వాముల కమిటీలు, వినియోగదారుల బృందాలు, స్వయం సహాయక బృందాలవంటి దాదాపు 10 సమాంతర సంస్థలున్నాయి. వాటిలో నీటి వినియోగదారుల సంఘాలు (WUA), పాఠశాల విద్యా కమిటీల వంటి చట్టపర మద్దతుగల సంస్థలున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా ఏర్పాటు చేసిన వన సంరక్షణ సమితులు, సహకార సంఘాల చట్టాల ప్రకారం ఏర్పడిన మహిళా స్వయం సహాయక బృందాల వంటివి మరికొన్ని.

ఈ సంస్థలన్నీ వివిధ ప్రభుత్వ విభాగాల కింద ప్రత్యేక బాధ్యతలు నిర్వహించే ప్రత్యేక సంస్థలుగా మద్దతు పొందుతున్నాయి. స్థానిక సంస్థల సామర్థ్యంపై విధాన నిర్ణేతలకు, ప్రభుత్వ అధికారులకు నమ్మకం లేనందువల్లనే ఇలాంటి ప్రత్యేక సంస్థలు పుట్టుకొస్తున్నాయని వేరే చెప్పనక్కరలేదు. దారిద్ర్యం, నిరక్షరాస్యత, కుల భేదాలతో నిండిన గ్రామీణ సమాజంలో నెలకొన్న వాస్తవ పరిస్థితుల దృష్ట్యా స్థానిక సంస్థల సామర్థ్యంపై అపనమ్మకం కలగడం సహజమే. ఆంధ్రప్రదేశ్‌లో సైతం సంస్కరణలకు పూర్వం ఇదే పరిస్థితి వుండేది. ప్రభుత్వ కేంద్రీయ వ్యవస్థ నుండి మార్కెట్ దృక్పథంతో కూడిన వ్యవస్థకు మారడం వల్ల మెరుగైన పరిస్థితి ఏర్పడిందేమీలేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వంటి అత్యున్నత వ్యవస్థలకు స్థానిక సంస్థలు పంపిణీ యంత్రాంగాలుగా వున్న అంశాన్ని అవగాహన చేసుకోవడంలోనే అసలు సమస్య ఇమిడి ఉంది. గ్రామీణ పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ రీత్యా అధికారాలు, బాధ్యతలు అప్పగించిన



తర్వాత కూడా ఈ వైఖరిలో వచ్చిన మార్పేమీలేదు. అభివృద్ధి ప్రయత్నాలలో ''భాగస్వాముల'' ప్రవేయాన్ని పెంచడం, సమర్థవంతమైన సేవలకు, 'ఫలితాల సాధన దిశగా పాలన' వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే వాదనను సంస్కరణలు ముందుకు తెచ్చాయి. ఈ చర్య ఆంధ్రప్రదేశ్‌లో పురోగమిస్తున్న పంచాయతీల పరిధిని కుదించింది. వినూత్న ఆలోచనలకు అవకాశాన్ని తగ్గించి, పంచాయతీలను క్రుంగదీసింది. 1990ల దశకం నుండి దాతలు ఇచ్చిన విరాళాల ఆధారంగా సేవలందించే ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాలవల్ల కూడా స్థానిక సంస్థలు నామ మాత్రంగా మిగిలాయి. ప్రభుత్వేతర సంస్థలు (NGOS) కూడా అట్టడుగుస్థాయిలోని స్థానిక ప్రజాస్వామ్య సంస్థలను లెక్కచేయలేదు. ఈ పరిస్థితుల్లో స్థానిక స్వపరిపాలనా సంస్థలను పునరుత్తేజితం చేయడం పెద్దసవాలు.

రాజ్యాంగం 11వ షెడ్యూలులో గ్రామ పంచాయతీలకు ప్రత్యేకించిన 29 అంశాలపై అధికారాలను, అమలును (కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలతో కలిపి) బాధ్యతలను, కర్తవ్యాలను ఈ ప్రత్యేక సంస్థలు కాజేయడం విచారకర విషయం, మానవ, ప్రకృతి వనరుల నిర్వహణ వంటి ఎన్నో కీలక అంశాలను పంచాయతీల నుండి తప్పించి ప్రత్యేక సంస్థలకు ఇవ్వడం ఆందోళనకరం. ఇలాంటి పథకాలను అమలుచేయగల సామర్థ్యం పంచాయతీలకు లేదని, అవి అసమర్థ ప్రతినిధులతో కూడినవనే వాదనను మళ్ళీ ముందుకు తెస్తున్నారు. ఈ ప్రత్యామ్నాయ సంస్థలతో పోలిస్తే పంచాయతీల సామర్థ్యం ఎంతో మెరుగు. ఇలా ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేయడంవల్ల ఎన్నికైన పంచాయతీల కంటే ప్రత్యేక సంస్థల భాగస్వాముల సామర్థ్యాన్ని పెంచడానికి ప్రాధ్యాన్యం ఇస్తున్నారు. ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు రాజ్యాంగ బద్ధ అధికారాలుగల పంచాయతీల వంటి స్థానిక సంస్థలను ఈ విధంగా నిర్లక్ష్యం చేస్తూ, వాటిని పట్టించుకోని పరిస్థితి ప్రస్తుతం నెలకొంది.

## క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో 2004 ఆఖరులో మహిళా స్వయం సహాయక బృందాలు (WSHGS), నీటి వినియోగదారుల సంఘాలు, వనసంరక్షణ సమితులు, వాటర్‌షెడ్ కమిటీలు (జిల్లానీటి నిర్వహణ సంస్థ DWMA తదితర సంస్థల మద్దతుతో) తగిన మద్దతు లేకుండా అనృష్టమైన రీతిలో ఏర్పడ్డాయి. అంతకుమునుపు చట్టబద్ధంగా ఏర్పడిన పాఠశాల విద్యాకమిటీలను రద్దుచేశారు.

## సమాంతర సంస్థల సాధారణ లక్షణాలు

- నగటు పంచాయతీ కంటే ఈ సమాంతర సంస్థలు ఆర్థికంగా బలమైనవి : ఉదాహరణకు, కనీసం 200 హెక్టార్ల వాటర్‌షెడ్ కమిటీ కూడా ఐదేళ్ళలో రూ.12 లక్షల (GOI 2008) నిధులు కలిగి వుంటాయి.
- అవి తక్కువ సంఖ్యలో వున్న భాగస్వాములకు, ప్రభుత్వశాఖల అధికారులకు జవాబుదారీగా వుంటాయి.
- భాగస్వాములుగా వారు నిర్దిష్ట కర్తవ్యాలపై కేంద్రీకరించి పని చేస్తారు. ఉదాహరణకు చిన్న వాటర్ షెడ్ ద్వారా ఎన్నికైన గ్రామసంఘాలు కూడా పొదుపు - పరపతి అనేవి వ్యక్తిగత విషయాలని, వాటి గురించి గ్రామసభలో చర్చించనవసరం లేదని భావిస్తుంటాయి.
- ఈ సంస్థలలో అత్యధికం ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా ఏర్పడినవే.
- ఈ సంస్థలు సాధారణంగా పంచాయతీల విధుల క్రమం నుండి దూరంగా వుంటాయి.

## ఘర్షణ లేదా వివాదకారణాలు

- సమాంతర సంస్థలు పంచాయతీలను సంపూర్ణంగా నిర్లక్ష్యం చేస్తూ, స్వతంత్రంగా పనిచేస్తున్నాయి.
- పంచాయతీరాజ్ సంస్థలతో కలిసి విధిగా పనిచేయాలనే నిబంధనను ఉల్లంఘించడం ద్వారా ఈ సమాంతర సంస్థలు అదే పనులు చేయడమేగాక, అవకతవకలకు ఆస్కారమిస్తున్నాయి.
- ప్రభుత్వ విభాగాలు ఈ సమాంతర సంస్థల కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహాయం అందిస్తున్నాయి.
- పథకాల సమాచారం, నిధులు, కర్తవ్య నిర్వహణ ఫలితాల గురించి సమానాంతర సంస్థలు పంచాయతీలకు తెలియజేయడం లేదు.
- నిజానికి పంచాయతీలకు, సమాంతర సంస్థలకు మధ్య సహజమైన బంధమేదీలేదు. కొన్నిసార్లు కొన్ని సంస్థలలో సర్పంచ్ సభ్యుడుగా వున్నా, వాస్తవానికి అందువల్ల ఎలాంటి ఫలితం లేదు.

ఈ అన్ని కారణాల వల్ల సమాంతర సంస్థలు, పంచాయతీల మధ్య సంతోషకరమైన సంబంధం లేకుండా పోయింది.

## కలిసి పని చేసేందుకు క్షేత్ర స్థాయిలో ప్రయత్నాలు

సమాంతర సంస్థల వల్ల విధానపరంగా పంచాయతీలతో శత్రుపూరిత వాతావరణం నెలకొన్నా, కొన్ని సానుకూల కార్యకలాపాలు కూడా లేకపోలేదు. నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయిలో కలిసి పనిచేస్తున్న కొన్ని ఉదాహరణలు.

**ఉదాహరణ.1**

**స్వయం సహాయక బృందాలు పంచాయతీలు :**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అనంతారం గ్రామ పంచాయతీలో గ్రామ స్థాయి మహిళా స్వయం సహాయ బృందం, పంచాయితీ ఏకీభావంతో కలసి పనిచేస్తున్నాయి. సర్పంచ్, స్వయం సహాయ బృందం నాయకుల మధ్య సదవగాహన, సాహోర్ద్రత వల్ల ఈ

విజయం సాధ్యమైంది. ఈ రకమైన సదవగాహనవల్ల మహిళాస్వయం సహాయ బృందాలు నీటి శుద్ధి యంత్రాన్ని నెలకొల్పి ప్రజలకు రక్షిత మంచినీరు సరఫరా చేసి లాభాలు గడిస్తున్నారు. వార్డు సభ్యుడుకూడా సభ్యుడిగా వున్న కమిటీ ఈ నీటి శుద్ధి యంత్ర నిర్వహణను పర్యవేక్షిస్తోంది. పంచాయతీ ద్వారా ఆ యంత్రానికి నీటి సరఫరా జరుగుతున్నది. నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు కోసం అవసరమైన భవనాన్ని పంచాయతీ సాధారణ నిధులతో నిర్మించారు. కమిటీ నెలవారీగా పంచాయతీకి నీటి సరఫరా నివేదిక ఇస్తుంది. సహకారం ద్వారా సత్ఫలితాల సాధనకిది నిదర్శనం.

**ఉదాహరణ:2**

**నీటి వినియోగదార్ల సంఘం, గ్రామపంచాయతీ చిన్న రమణగారిపల్లె)**

నీటి వినియోగదార్ల సంఘం, పంచాయతీ కలిసి పనిచేసి సత్ఫలితాలు సాధించిన ఉదాహరణ అనంతపురం జిల్లా నల్లమాడ మండలం చిన్నరమణగారిపల్లెలో జరిగింది.

నీటి వినియోగదారుల సంఘం గ్రామ పంచాయతీతో కలసిపని చేసింది. రైతులు కొత్తగా బోరు బావులు వేయడం ఆపేశారు. అంతేగాక, ఇప్పటికే ఉన్న 38 బోరు బావుల నీటిని పరస్పరం వాడుకుంటున్నారు. గ్రామ చెరువుకు నీరు వచ్చే పరీవాహక ప్రాంతాన్ని మరమ్మతు చేశారు. ఇందుకు నీటి వినియోగదార్ల సంఘం నిధులు వాడి, జమ ఖర్చు వివరాలు గ్రామసభకు సమర్పించారు.


నీటి వినియోగ దార్ల సంఘం తమ జమఖర్చు వివరాలను గ్రామప్రజలందరికీ అందుబాటులో వుంచింది. గ్రామ పంచాయతీ నీటి వినియోగదార్ల సంఘంతో కలిసి సన్నిహితంగా పనిచేస్తున్నది. పంచాయతీ, నీటి వినియోగదారుల సంఘం రెండూ కలిసి వర్షపాతం, నీటి మట్టాన్ని దృష్టిలో వుంచుకుని ఏటా పంటల ప్రణాళికను, నీటి వినియోగ ప్రణాళకను సిద్ధం చేస్తున్నాయి. చక్కటి సహకారానికి ఇది నిదర్శనం..

**ఉదాహరణ : 3**

**పంచాయతీరాజ్ సంస్థలు, వన సంరక్షణ సమితుల మధ్య నిర్వహణ సంబంధాలను ఏర్పరచి, పటిష్ఠంచేయడం. ఎస్‌విఆర్‌డాఇఎస్ అనుభవాలు.**

ప్రకృతి వనరులను అర్థవంతంగా, సమర్థవంతంగా నిర్వహించడం, పంచాయతీరాజ్ సంస్థలు, వన సంరక్షణ సమితుల మధ్య (వివిఎస్ఎస్) నిర్వహణ సంబంధాలను ఏర్పరచి, అవి సన్నిహితంగా కలసి పనిచేసేలా చూడటమే ఇందులో ప్రధానోద్దేశ్యం. కలసి పని చేయవలసిన అవసరాన్ని, ముఖ్యంగా ప్రకృతి వనరులను సమర్థవంతంగా నిర్వహించేందుకుగాను పటిష్టం చేయాలని రెండు సంస్థలు గుర్తించాయి. పలు దఫాలుగా సమావేశాలు జరిగిన తర్వాత రెండు సంస్థల మధ్య అవగాహన కుదిరింది. సమాచారాన్ని పరస్పరం తెలియజేసుకోవడం వల్ల రెండు సంస్థలమధ్య సంబంధాలు పటిష్టమైనాయి. పరస్పర అవగాహన, విశ్వాసం పెంపొందడం వల్ల, రెండు సంస్థలు కలిసి పనిచేయడానికి మార్గం సుగమమైంది.

పైన పేర్కొన్న ఉదాహరణలను బట్టి రెండు సంస్థలు కలిసి పని చేయడానికి కొన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని సూచిస్తున్నది.



### ప్రతికూల ప్రాధాన పరిస్థితులలో కలిసి పనిచేయడానికి ప్రయత్నాలు:

- పంచాయతీలు, సమాంతర సంస్థలు కలసి పనిచేయవలసిన అంశాలపై అవగాహనకు రావడం రెండు సంస్థల మధ్య సమాచార మార్పిడి.
- సంస్థల మధ్య వనరుల పంపిణీ

### విధాన స్థాయిలో ఏం చేయగలం?

- సమగ్ర అభివృద్ధితో ముడిపడిన సంబంధిత ప్రభుత్వ విభాగాలన్నీ (Line Departments) ఉన్నతస్థాయిలలో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేయడానికి, కార్యాచరణకు తీవ్ర ప్రయత్నాలు చేయాలి.
- పంచాయతీలలో కమిటీ పద్ధతిని పటిష్టం చేయాలి.
- పంచాయతీలు, సమాంతర సంస్థలు, ఆర్థిక సాంఘికాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల తయారీలో తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు చేపట్టాలి.
- గ్రామ సభను పటిష్టం చేసి, సమాంతర సంస్థలన్నీ గ్రామసభకు జవాబు దారీగా వుండేలా చర్యలు తీసుకోవాలి.
- పంచాయతీల సర్వసభ్యులు, సమాంతర సంస్థల కార్యవర్గ సభ్యులు నెలకోసారైనా సంయుక్తంగా సమావేశం జరిపి సమస్యల గురించి చర్చించాలి.
- పంచాయతీలు, సమాంతర సంస్థలు ఆర్థిక వనులకు సంబంధించిన రికార్డులన్నింటినీ ప్రజల పరిశీలనకు అందుబాటులో వుంచాలి.
- సమాంతర సంస్థలు అభివృద్ధి చేసిన నిర్మాణాల నిర్వహణ బడ్జెట్‌లు, నిర్వహణను పంచాయతీల ద్వారా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

ప్రజల జీవితాలపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకునే ముందు వాటిపై జరిగే చర్చలలో పాల్గొనడానికి పౌరులకు గల న్యాయమైన హక్కును గుర్తించాలి. అనుబంధ సమర్థత, ప్రజాస్వామికీకరణకు సంబంధించిన సూత్రాలపై నిర్దిష్టంగా ఆలోచనలు చేయాలి.

**వాగీశన్**
**అసిస్టెంట్ ప్రొఫెసర్, నల్సార్ యూనివర్శిటీ, హైదరాబాద్**
(అనువాదం - **టి. సురేష్ కుమార్**)

# హోమియో వైద్యమే ఎందుకు మంచిది ?

### కంటివ్యాధులు

**వివరణ :** కళ్ళలోని తెల్లదనం ఎరుపు ఛాయలోకి మారినప్పుడు కళ్ళకు వ్యాధి వచ్చినట్లు కాగలదు, కళ్ళలో నుంచి వేడి ఆవిరి రావడం, కనుగుడ్లలో భరింపలేని నొప్పి కలగడం, ఆ నొప్పి తలలోకి చొరబడటం (వ్యాపించడం), కాంతి (వెలుగు) ని ఏ మాత్రం కళ్ళు భరించలేకపోవడం, కన్నీళ్ళు ఆవిరి అయిపోయి కళ్ళు ఎండిపోయినట్లుగా పొడిగా వుండడం, జ్వరం రావడం మొ॥ లక్షణాలు వుంటాయి.

**లక్షణాలు :**

1. కళ్ళు బాధగా వుండి ఎర్రబడటం, వెలుతురును భరించలేకపోవడం, కళ్ళు తెరవడమంటేనే భయం వేయడం.
2. కంటిపొర (కన్నులోని తెల్ల గుడ్డును, కనురెప్పలలోన అంటివుండే పొర) కు ఏర్పడే బాధ, పసుపు పచ్చని ద్రవం కారుతుండటం.
3. రాత్రి వేళల్లో తీవ్రమైన నొప్పితో కళ్ళనుంచి పసుపు పచ్చని ద్రవం కారుతుండటం.
4. పిల్లలలో కంటిపొరలకు బాధ ఏర్పడి, సహించలేని పరిస్థితిలో ఉండటం.

### వాడవలసిన మందు, వాడకం

బెల్లడోనా- ప్రతి ఒక గంటకు ఒక డోస్.
పల్సటిల్లా- ప్రతి మూడు గంటలకు ఒక డోస్.
కామోమిల్లా- ప్రతి మూడు గంటలకు ఒక డోస్.

### చెవులకు సంబంధించిన వ్యాధులు

**వివరణ :** చెవిలో భరింపలేని నొప్పి, చెవిపోటు, బాధలు ఒక తీరుగా ఉండవు. చల్లదనం సోకితే బాధ ఎక్కువవుతుంది. అనేక సందర్భాలలో పంటినొప్పికి కూడా దారితీయవచ్చు. చెవి లోపలి భాగంలో నొప్పి పెరగవచ్చు.

**లక్షణాలు :**

1. జలుబు, పడిశం చిహ్నాలతో కలిసి చెవిపోటు ఉండటం.
2. తీవ్రమైన జ్వరంతో చెవిపోటు ఎక్కువగా ఉండటం.
3. చెవిపోటు బాగా ఎక్కువగా ఉండి, రాత్రివేళల్లో ప్రత్యేకించి పిల్లలలో బాధ కలిగి గుక్కపట్టి ఏడుస్తుండటం.
4. తీవ్రమైన చెవిపోటుతో రాత్రిళ్ళు బాధపడుతుండటం.

### వాడవలసిన మందు, వాడకం

బెల్లడోనా,
మెర్క్‌సాల్- ఒక దాని తర్వాత ఒకటి ప్రతి గంటకు ఒక డోస్ చొప్పున బెల్లడోనా.
కామోమిల్లా- ప్రతి గంటకు, రెండు గంటలకు ఒక డోస్
పల్సటిల్లా- ప్రతి గంటకు, రెండు గంటలకు ఒక డోస్.

### చెవి నుంచి చీము కారడం

**లక్షణాలు :**

1. శీతాకాలంలోను, చల్లటి గాలివల్ల చెవులు సున్నితంగా వుండి చీముకారినప్పుడు.
2. చలిగాలి వల్ల నొప్పి లేకపోయినా, చెవిలో నుంచి ముదురు ఆకుపచ్చ రంగులో చీము కారుతున్నప్పుడు.
3. పైన చెప్పిన మందుల వల్ల బాధలు తగ్గక పోయినప్పుడు.
4. చలిగాలికి చెవులలో పోటు / బాధ కలిగినా, బాధ వున్న చెవి వున్న దిశగా పడుకోలేని పరిస్థితిలో.
5. చెవులు దిబ్బడ కట్టి, కొద్దిగా వినికిడి శక్తి కోల్పోయినప్పుడు (ముక్కుపై భాగమును, మధ్య చెవిని కలుపు వినికిడి వాహిని (కర్ణకంఠ నాళం) దెబ్బతింటే కలిగే పరిస్థితి) .

### వాడవలసిన మందులు - వాడకం

సిలికా. రోజుకు నాలుగు డోస్‌లు వాడాలి.
పల్సటిల్లా. రోజుకు మూడు డోస్‌లు వాడాలి.
మెర్క్ సాల్. రోజుకు మూడు సార్లు వాడాలి.
హెపార్‌సల్ఫ్. రోజుకు మూడు పూటలా మూడు డోస్‌లు వాడాలి.
మెర్క్ సాల్. ప్రతి రెండు గంటలకు, నాలుగు గంటలకు ఒకసారి ఒక్కొక్క డోస్ చొప్పున తీసుకోవాలి.

### ముక్కుకు సంబంధించిన వ్యాధులు

**వివరణ :** ముక్కు లోపలి భాగంలో రక్తం ఎక్కువగా వున్న ప్రాంతం నుంచి నెత్తురు (రక్తం) చుక్కలుగా పడటం, సాధారణంగా మధ్య వయసు గల వారికి ఈ వ్యాధి కలుగుతుంది.

**లక్షణాలు :**

1. పొడి వాతావరణంలో ముక్కు నుంచి రక్తం కారడం జరిగితే.
2. ముక్కుకు దెబ్బ తగిలిన కారణంతో లేదా బాగా దగ్గడం వల్ల రక్తం కారితే.

### వాడవలసిన మందులు-వాడకం

బ్రయోనియా. ప్రతి ఆరు గంటలకు ఒకసారి ఒక డోస్ చొప్పున ఇవ్వాలి.

ఆర్నికా. రక్తం కారడం తగ్గి, ఉపశమనం కలిగేవరకు ప్రతి గంటకు ఒక డోస్.

- డా॥ సోహన్ సింగ్

**"నా జీవితమే నా సందేశం" అంటూ మహాత్మాగాంధీ యావత్ ప్రపంచానికి మానవుడు మానవునిగా జీవించగలిగే ఒక మానవీయ సమాజ స్థాపనకు కృషి చేశారు. గాంధీ సిద్ధాంతాలు ఉత్తమ జీవన విధానానికి మార్గాలు. శాంతియుత సహజీవనానికి, సౌభ్రాతృత్వానికి దోహదపడే సూత్రాలు- సిద్ధాంతాలను గాంధీజీ ప్రపంచానికి అందించారు.**

**నేడు భారతదేశమే గాక, యావత్ ప్రపంచం కూడా గాంధీజీ సిద్ధాంతాల ప్రాధాన్యతను గుర్తించింది. అందుచేతనే ఐక్యరాజ్యసమితి గాంధీ జన్మదినమైన అక్టోబర్ 2ను 'అంతర్జాతీయ అహింసా దినోత్సవం'గా ప్రకటించడం గాంధీజీ ద్వారా మనకు దక్కిన గౌరవం. మహాత్ముని సందేశాలు శాంతియుత సహజీవనానికి, సర్వమానవ శ్రేయస్సుకు పూలబాటలు... నేటి హింసాయుత సమాజానికి గాంధీ అహింసా మార్గాలే దివ్య ఔషధాలు.**

# గాంధీ మార్గం ఉత్తమ జీవనానికి సోపానం

గాంధీ ప్రబోధించిన సత్యం, అహింస, సర్వోదయ, గ్రామస్వరాజ్ వంటి సిద్ధాంతాలు నాటికి, నేటికి, ఏనాటికీ అనుసరణీయమే. గాంధీ సిద్ధాంతాలు జనజీవన స్రవంతికి మార్గదర్శకాలు. అంతటి మహనీయుడిని భారతీయులుగా మనం స్మరించుకోవటం తప్పనిసరి. ఒక సామాన్యుడు ప్రపంచంలో అనన్య సామాన్యమైన ఘనకీర్తిని సముపార్జించటం అనేది ఒక్క మహాత్ముడికే సాధ్యమైంది. గాంధీజీ నేడు భారతీయుల సొత్తే కాదు ప్రపంచ సంపద కూడా.

## గ్రామీణాభివృద్ధిపై గాంధీ అభిప్రాయాలు

భారతదేశం సుమారు 200 సంవత్సరాలు బ్రిటిష్ వారి పాలనలో ఉంది. ఆంగ్లేయులు తమ పరిపాలనా కాలంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం గావించారు. గ్రామీణ పరిశ్రమలు కాలరాచారు. గ్రామీణ ప్రాంతాలను తిరిగి అభివృద్ధి చేయాల్సిన విషయాన్ని మహాత్ముడు పలుమార్లు గుర్తుచేశాడు.

గాంధీజీ నిజమైన ప్రజాస్వామ్యవాది. ప్రజాస్వామ్య మనుగడకు అధికార వికేంద్రీకరణ అవసరమని ప్రగాఢంగా ఆయన విశ్వసించారు. గ్రామ పంచాయితీలను అభివృద్ధి పరచాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. గాంధీజీ అభిప్రాయంలో గ్రామాలు స్వయం పోషకాలుగా, అభివృద్ధి చెందడమే కాక, గ్రామ స్వరాజ్యాలుగా అవతరించాలి. గ్రామీణుల అభివృద్ధికి ఆ గ్రామ ప్రజలే కృషి చేయాలి. విధాన నిర్ణయాలు వికేంద్రీకరించబడాలని గ్రామాభివృద్ధికి సంబంధించిన అన్ని విధానాలను ఆ గ్రామపంచాయతీయే నిర్ణయించాలని గాంధీజీ ఉద్బోధించారు. గ్రామీణాభివృద్ధిలో ఆ గ్రామానికి చెందిన అన్ని కులాలు, మతాల యువకులను భాగస్వామ్యులను చేయాలంటూ యువశక్తి సామర్థ్యాన్ని మహాత్ముడు చాటిచెప్పాడు. మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా నేటి యువత గ్రామీణాభివృద్ధిలో ప్రముఖ పాత్రను నిర్వహించాలి.

గ్రామీణ ప్రాంతాల రోజువారీ అంశాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోరాదని గ్రామపంచాయితీలకు గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలను అప్పగించాలని జాతిపిత అభిప్రాయపడ్డారు. మహాత్ముడు చెప్పినట్లుగా గ్రామీణ సమస్యలను పరిష్కరించే అంశాన్ని ఆయా గ్రామపంచాయితీలకే వదలివేయాలి. గ్రామీణుల సమస్యలు అన్ని గ్రామాలలోనూ ఒకేరకంగా ఉండవు.



గ్రామీణ సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించే సమయంగాని, ఓపిక గాని కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలకు ఉండదు.


గ్రామీణాభివృద్ధిలో భాగంగా భూసంస్కరణల అమలు ప్రాముఖ్యాన్ని గాంధీజీ వివరించారు. ఆయన ఉద్దేశ్యంలో ఎక్కువ భూమిని కలిగి ఉన్న వారు స్వచ్ఛందంగా భూమిని గ్రామపంచాయితీలకు అప్పగించాలి. అటువంటి భూములను గ్రామపంచాయితీలలో భూమి లేని నిరుపేదలకి పంచారు. గ్రామపంచాయితీలు నిర్వహించ వలసిన విధులను గాంధీజీ వివరించారు.

ప్రతి గ్రామంలోను పారిశుధ్యం, విద్య, వైద్యం వంటి అంశాలను గ్రామపంచాయితీలకు అప్పగించి వాటి నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చాలి. గ్రామీణులు గ్రామీణ ప్రాంతాలను వదలి పట్టణ, నగర, ప్రాంతాలకు రావడం పట్ల మహాత్ముడు విచారాన్ని వెలిబుచ్చాడు. ఆయన ఉద్దేశ్యంలో ఇందుకు ప్రధాన కారణం గ్రామీణులకు కనీస విద్యా, ఆరోగ్య, రవాణా ప్రసార సాధనాలు అందుబాటులో లేకపోవడం.

గ్రామీణ ప్రాంతాలలో పలుకారణాల వల్ల పెరుగుతున్న నిరుద్యోగం తీవ్ర సమస్యగా పరిణమిస్తోంది. 63 సంవత్సరాల స్వతంత్ర్య భారతంలో కనీసం త్రాగునీరు లభించని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. అవినీతి

అన్నిస్థాయిలలో ఉండడం వలన గ్రామీణాభివృద్ధి ఆశించిన మేర జరగడం లేదు. హర్షించదగ్గ అంశం ఏమిటంటే 'గ్రామీణ ఉపాధి హామీ' పథకాన్ని 'మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం'గా మార్చడం. ఈ పథకం మహాత్ముడు అందించినట్లు గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి పట్ల వరంగా మారింది. గ్రామీణ ప్రాంతాలలో మానవీయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్తును సరఫరా చేస్తుంది. మహాత్ముడు గ్రామీణుల కీ నిరంతరాయంగా విద్యుత్తుచ్ఛక్తిని సరఫరా చేయాలని అభిలాషించాడు.

మహాత్ముడి ఆశయాలకీ అనుగుణంగా గ్రామ పంచాయితీలను 73వ రాజ్యాంగ సవరణ ద్వారా బలోపేతం గావించి వాటికి రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించడం జరిగింది.




## మానవాభివృద్ధిపై గాంధీజీ ఉవాచ

గాంధీజీ అభిప్రాయంలో ప్రతి ఆధునిక ప్రభుత్వం మానవుల అభివృద్ధికి కృషి చేయాలి. మానవాభివృద్ధికి వ్యక్తిగత, పౌరస్వేచ్ఛ అనివార్యం. ప్రజాస్వామ్యవాదిగా మహాత్ముడు ప్రజలకు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి అవకాశం ఉండాలని భావించాడు. ప్రజాభిప్రాయం మాత్రమే సమాజాన్ని పరిశుద్ధంగా, ఆరోగ్యంగా ఉంచగలుగుతుందని జాతిపిత అభిప్రాయపడ్డాడు.


ప్రజాభిప్రాయం ఏర్పడడంలో ఆంక్షలు లేని పత్రికలు, సంఘాలు, వేదికలు ప్రముఖపాత్ర నిర్వహిస్తాయన్నది మహాత్ముడి విశ్వాసం. మహాత్ముడి ఉద్దేశ్యంలో స్వేచ్ఛ అంటే రాజకీయ స్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛ, సామాజిక స్వేచ్ఛ. స్వరాజ్య సాధనకు ఈ స్వేచ్ఛ అవసరమన్న అంశాన్ని ఆయన గాఢంగా విశ్వసించారు. భారతదేశంలో కొనసాగుతున్న సామాజిక అసమానతలను తీవ్రంగా వ్యతిరేకించిన గాంధీజీ అంటరానితనం నిర్మూలనకు విశేషంగా కృషి గావించారు.

## మహిళాభివృద్ధికి పాటుపడ్డ మహాత్ముడు

స్త్రీ పురుషుల మధ్య అసమానతలను తీవ్రంగా ఖండించాడు మహాత్ముడు. ఆయన ఉద్దేశ్యంలో మహిళాభివృద్ధి జరగాలంటే మహిళలకు ఓటు హక్కు విధిగా కల్పించాలి. పురుషులకు, స్త్రీలకు సమానంగా చట్టపరమైన హక్కులు కల్పించడాన్ని గాంధీజీ సమర్థించారు. సాధికారత కలిగిన మహిళలు వారి న్యాయపరమైన హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## మతము - రాజకీయాలు వేరు కాదు

సర్వసాధారణంగా అందరూ రాజకీయాలకు మతానికి సంబంధం ఉండరాదని అభిప్రాయపడతారు. మహాత్ముడి ఉద్దేశ్యంతో మతానికి - రాజకీయాలకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. మతానికి రాజకీయాలకు సంబంధం లేదనే వారికి మతమంటే తెలియదని ఆయన భావించారు. గాంధీజీ అభిప్రాయంలో మతం, నైతికత రెండూ ఒకటే. ఆయన ఏ ఒక్క మతాన్ని విశ్వసించలేదు. మహాత్ముడి మతం 'మానవసేవ'. ఆయన సత్యాన్ని భగవంతుడిగా భావించారు.




జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలు, సూత్రాలు మానవ వికాసానికి, శాంతియుత జీవనానికి మార్గాలు. మానవుడు దానవుడిగా కాక మానవుడిగా మనుగడ సాగించేందుకు ప్రతి ఒక్కరూ సత్యం, అహింసను అనుసరించాలి. దేశ ప్రజలందరూ ఇతరుల సంక్షేమం కోసం, సమాజ సంక్షేమం కోసం కృషి గావించాలి. ప్రకృతిని అవసరం మేరకు ఉపయోగించి భవిష్యత్ తరాల మనుగడకు సహకరించాలి. అవినీతి అక్రమాల ను నియంత్రించేందుకూ కృషిసల్పాలి, హింసా ప్రవృత్తిని విడనాడాలి. సత్యనిష్ఠ, అస్పృశ్యతానివారణ, పరమత సహనం కలిగి ఉండాలి. గాంధీ మార్గంఉత్తమ జీవనానికి సాధనం.

*- డా॥ వి. మోహన్‌రావు, అసోసియేట్ ప్రొఫెసర్,*
*రైల్వే డిగ్రీ కాలేజ్, సికింద్రాబాద్*

# వాన

యమ్. జగదీశ్వరరావు

కన్సోలేషన్ బహుమతి పొందిన గ్రామీణ కథ

**తెల్లవారింది. వాన అలాగే కురుస్తోంది. ఆగి ఆగి కొంతసేపు గాలి వీస్తూ కొంతసేపు, కుండపోతగా మరికొంతసేపు కురుస్తూనే వుంది. రెండు రోజుల క్రితం మొదలైన వాన. ఇంపూ తెంపూ లేకుండా కురుస్తూనే వుంది.**

**మాసడు అడ్డాకుల గుత్తిని తలకి అడ్డుపెట్టుకుని కొండమీద నడుస్తున్నాడు. ముడతలు పడిన శరీరమ్మీంచి వాననీరు జారిపోతోంది. ఒంటి మీద ఏ అచ్ఛాదనా లేదు, మొలకి కట్టిన గోచీ గుడ్డ తప్ప. నడుస్తున్నాడన్న మాటే గాని సన్నగా వొణుకుతున్నాడు. వొంట్లో సత్తువ లేకపోయినా చేతిలో 'కంక' సాయంతో జారిపోకుండా జాగ్రత్తగా అడుగులేస్తున్నాడు.**


కొండవాలులోంచి సాగుతున్న దారది. ఎదురుగా ఏమీ కనిపించడం లేదు. ఒక తుప్ప దగ్గర ఆగేడు ముసిలోడు. కంటిమీది నీరుని తుడుచుకుని చూసేడు. అతడు అనుకున్న మొక్కని నిర్ధారించుకున్నాక దాని మొదలు పట్టి లాగేడు. దాని ప్రక్కనే మరో పాదుని చూసేడు. అతని కళ్ళు మెరిసేయి. అది పులి దుంపల పాదు. దాని మొదలెక్కడుందో పట్టుకున్నాడు. కంకతో తవ్వేడు. దుంపల్ని చేత పట్టుకుని పాకవైపు అడుగులేసేడు.

"దొరికినవా?" అడిగింది కోడలు.

'ఔ' నన్నట్టు తలవూపి ముంజూరు మీంచి కారుతున్న నీటిలో దుంపల్ని కడిగేడు. కాళ్ళూ, కంకా కూడా శుభ్రం చేసి పాక లోపలికి అడుగు పెట్టాడు. చిలక్కొయ్యకి దోపిన పాడి గుడ్డతో తల తుడుచుకున్నాడు. మూల దాచిన ఎండు పుల్లత్తో పొయ్యి ముట్టించింది కోడలు. కుక్కి మంచం కింద కుంపటి లాగి అగ్గి రాజేసింది.

"ఊష్టమొగ్గుండదు గలా, మల్లా వాన కాడ తడుస్తున్నవూ" పొయ్యి వూదుతూ అంది కోడలు.

"ఊష్టమని తొంగుంటే తిండి దొరుకుతాదమ్మ" దుంపల్ని వెదురు బుట్టలో వుంచుతూ ముసిలోడు అన్నాడు.



'నిజమే ఆ దుంపలే లేకపోతే రాతిరికి పస్తులే' అని యిద్దరికీ తెలుసు.

పొయ్యి మీద దాకలో నీళ్ళు సల సలా మరుగుతున్నాయి. అట్టుకు మీద నుంచి బుట్ట దించింది కోడలు. అందులోని టెంక పిండిని వెలుగులోకి తెచ్చి చూసింది. కనబడిన రెండు పురుగుల్ని ఏరి బయటికి తీసింది. పిండిని చేటలోకి పోసి చెరిగింది. అది కిందటేడు పిండి. మామిడి బాగా కాయబట్టి టెంకలు ఆ పాటైనా దొరికినాయి. టెంకలు ఎండబెట్టి, పగలగొట్టి గుజ్జుని గూటంతో సితగ్గొట్టి, గెడ్డలోన కసపోయిందాక కడిగి కడిగి ఎండబెట్టి యిసిరిన పిండది.

మరుగుతున్న నీళ్ళలో పిండిని కలిపి అంబలి చేసింది. ఉప్పు గడ్డల్ని వేసి రుచి చూసింది. ఆ వానన పాకంతా వ్యాపించి ఆకలిని గుర్తు చేసింది.

ముసిలోడు తడిసిన గోచి గుడ్డని మార్చుకుని 'పింటుగాడు' తెచ్చిన హాస్టల్ దుప్పటిలోకి దూరి పోయేడు. హాస్టలు పుణ్యమా అని మనవడి తిండికి లోటులేదు. అయినా పింటుగాడు బడొగ్గిసి అమ్మ కొంగు పట్టుకుని తిరుగుతుంటాడు. తండ్రిలేని పిల్లడు. తల్లి మీద పిల్లడికి దీవెయ్యదా?

పింటు గాడిని ఒడిలోకి చేర్చుకుని కొడుకు జ్ఞాపకాల్లోకి జారిపోవడం ముసిలోడికి అలవాటే.

కొండమీద వానల్లేక, పనుల్లేక తిండికి కట కటా అయిపోతున్న రోజుల్లోన ఎంకటి గాడు ఇంటి కొచ్చేడు. అడు దిగువూరోడు. కొడుక్కి నేస్తుడు. కిందిటేడు దేశిమెల్లి తిరిగొచ్చినోడు.

'ఎలగున్నావురా?" అడిగేడు కొడుకు

'నాకేటి? సూపరు." అన్నాడు ఎంకడు.

"రెండు పూటలు తిండి, వుండడానికి యిల్లు, రోజుకి వంద"


"మరి పనో?"

"పని లేకుండా డబ్బులిస్తార్రా? సార్‌కి సేపల సెరువులు, కోల ఫారాలు బోల్డున్నాయి. అక్కడ మందు వెయ్యడం క్లీనింగు... ఫీడింగు... అంతే..."

"అంతేనా?"

'అంతేనేటి? మన ఖర్చులు పోను వందలోన అరవై మిగుల్తాది"

"వుపాది ఆమీల మల్లా వందే యిస్తరట. గాని మన కొండల్లంట ఆ పనులు సేస్తెగదా" నిస్సహాయంగా అన్నాడు.




"ఈ బాధలన్నీ ఏలల్రా. నా తోటి పొర్రారా. యిద్దరమూ వుందాము. కష్టపడతాం. పైసో పరకో యింటికి తెస్తము." అన్నాడు ఎంకటి. మేస్త్రికిచ్చిన మాట కోసం. మేస్త్రి తనకిచ్చే పర్సింటేజ్ కోసం.

సినుకుల్లేని కరువు గుర్తొచ్చిందో... గింజల్లేని గాది గుర్తొచ్చిందో కొడుకు దేశమెలి పోయేడు.

అప్పుడప్పుడూ వుత్తరాలు వచ్చేవి. దిగువూరి పెసిరెంటు బాబుకి ఒకసారి ఫోను సేసేడని తెలిసింది. ఫీడింగు, క్లీనింగ్ మందుల వాసనకి జబ్బు పడ్డాడని తెలిసింది. అంతే యీడిని తీసుకెళ్ళిన మేనేజరు కనపడక, డబ్బులు లెక్కతేలిక అక్కడే... ఎవరికీ కాకుండా పోయేడని తెలిసొచ్చింది.

ముసిలోడి కళ్ళలోంచి కన్నీటి బొట్టొకటి నిశ్శబ్దంగా జారి చెక్కిలి తడిపింది.

ఒక్కసారిగా మేఘం గర్జించింది. ఎక్కడో పిడుగు పడినట్టే అయింది. ఆ శబ్దంతో పాటు 'గర్ గర్' మని శబ్దం రావడంతో అటు చూసేడు ముసిలోడు. మనవడు బడిలోంచి ఎప్పుడు జారుకున్నాడో రేడియోతో ఆడుకుంటున్నాడు. అప్పుడెప్పుడో కొన్న రేడియో. మొన్న సంతలో బేటరీలు తెచ్చి పలికించేడు. రాటకి కట్టిన రేడియోని కిందకి దించి మళ్లీ ఆడుకుంటున్నాడు వొద్దన్నా వినకుండా.

వాన కురుస్తూనే వుంది.

పాకముందు 'పావ కోళ్ళతో' రెండు కాళ్ళు కనిపించేయి.

"ఓరె బాబు వున్నాలా? ఎటెల్లినార్రా?" ఎజ్జోరు గొంతు వినపడింది.

"రాయె మామా! ఈ వాన కడ ఎక్కడికెల్తమూ?" కోడలు పిలిచింది.

బద్దల గిడుగుతో లోపలికి దూరి పావకోలిప్పేడు

"ఏటీ వోన! తల్లికి కోపమొచ్చింది గావాల" అని కుంపటి ముందు కూర్చున్ని నిప్పుల్ని చెయ్యితో నెరిపేడు.

"ఎలాగుంది రా?" అని అడిగేడు.

"తగ్గలేదు మామా" వొణుకుంటూ చెప్పేడు ముసిలోడు.

"ఎలగ తగ్గుతాదిరా? నీకు 'కానికు' నూడకుండా, తల్లికి దూపమెయ్యకుండా, మొక్కలు మొక్క కుండగ ఎలగ తగ్గుతాదిరా?" అంటూ ముసిలోడి మంచం ముందు కూర్చున్నాడు ఎజ్జోడు.

చేటతో బియ్యం తెచ్చింది కోడలు. సట్టంతో నిప్పులు ముందుంచింది. అడివి గుగ్గిలం అందించింది.

'రాయఘడ మజ్జిగౌరి

*మా వూరి మాలతమ్మ*

*బెజువాడ కనకదుర్గ*

*నీలావడి మా తల్లి*

*మా వూరి జాకరమ్మ*

*అనిరమ్మ, పోలమ్మ, దుర్గమ్మ, మాయమ్మో..."*

దీర్ఘాలు తీస్తూ... రాగాలు పాడుతూ... వూగిపోతూ... దేవతలందర్నీ పిలుస్తున్నాడు ఎజ్జోడు.

నిప్పుల్లో గుగ్గిలం ధూపం పట్టేడు 'తుఫ్ తుఫ్' మని వూస్తూ మాసడి చెవిలో ఏదో వూదేడు. కోడలు కోడిపిల్ల అందించింది. చేటలోని బియ్యాన్ని మేపించేడు. కోడిపిల్ల పీకను కోసి తూర్పువైపు తలని వుంచి మొండేన్ని వేరు చేసేడు. మొలలో దోపిన ఆకు పొట్లం విప్పి ముసిలోడి ఒళ్ళంతా రాసి మంత్రించేడు. దిష్టితీసి నిలబడి తలమీంచి వెనక్కి విసిరేసి వెనుతిరిగి చూడకుండా బద్దల గిడుగులో దూరి చినుకుల్లో కలిసిపోయేడు ఎజ్జోడు.

పొగ... ఊపిరాడనివ్వని పొగ.

వాన కురుస్తూనే వుంది..


ముంజూరు కింద కొయ్య గోడలూ, గడప నాని మెత్తగా కరిగిపోతున్నాయి. కొండ మీద నుంచి వరద అక్కడక్కడా రాళ్ళు జారుతున్నాయి. పాక ఎదురుగా పశువుల విసర్జనాలతో రొచ్చు కంపు కొడుతోంది. శాల ముంజూరు ముందే చుట్ట వుమ్మి పింటుగాడి మూత్ర విసర్జన... ఆ దుర్గంధాన్ని పాగొట్టడానికి గుగ్గిలం పొగ విశ్వ ప్రయత్నం చేస్తోంది.

కోడలు గిన్నెతో టెంక పిండంబలి అందించింది. ముసిలోడికి నోట్లోని చుట్ట తీసి రాటకి రాస్తూ ఆర్పేడు ముసిలోడు. ముంజూరు

నీరుతో చెయ్యి కడిగేడు. కాళ్ళు కడిగేడు. పాదం మీద రసికారుతున్న పుండుని కడిగేడు. పుండులోంచి కదులుతున్న పురుగునీ కడిగేడు. గిన్నె ముందు గ్లాసుతో నీళ్ళందించింది కోడలు.

గ్లాను ఎత్తి నీళ్ళవైపు చూసేడు. గుక్కెడు నీళ్ళు తాగేడు. అవి చెలమవూట నీళ్ళు. ఇంత వానలో చెలమ బురదయిపోయింది. బురద నీళ్లే తెచ్చి ఇండిప్పిక్క అరగదీసి నీళ్ళతో కలిపితే తేట దేరిన నీళ్ళని, అంబలి తాగి ముసిలోడు మంచమెక్కి దుప్పట్లోకి దూరిపోయేడు.

పింటుగాడు ఆడుకుంటున్న రేడియో లోంచి 'మంచి పోషక విలువల గల ఆహారం' అనే అంశమ్మీద డాక్టరు గారి ప్రసంగం వినవస్తోంది. ఈదురుగాలి రివ్వున వీచింది. బలిపీరికి చినుకులు విసురుగా గడపలోకి రాలేయి.




కొండమీద ఒంటరి పాకచుట్టూ దట్టమైన అడవి. ఎటు చూసినా కొండలు అలలు అలలుగా. ఎక్కడో దూరంగా వూరు. అక్కడికి అడవి దారి గుండా గంట నడిస్తే గాని రాని సంతవూరు. ఇలాంటి వాన కురిస్తే ఎవరికి ఎవరూ కారు.

పొద్దు ములిగి పోయిందేమో ఇంట్లోని వస్తువులు ఇంకా మసక మసకగా కనపడుతున్నాయి. రాతిరి తిండి కోసం కోడలు దుంపల్ని కడుగుతోంది. ఇంతలో... ముసిలోడు బళ్ళున వాంతి చేసుకున్నాడు. ఆపైన విసర్జనమూ చేసుకున్నాడు.

"మామా, ఏటైందే?" అని కోడలు గాబరా పడుతూ పరిగెత్తుకొచ్చింది మంచమ్మీద వాంతి, విసర్జనాన్ని శుభ్రం చేయబోయింది. ముసిలోడు వాంతి చేసుకున్నాడు మళ్ళీ.

వాన... వాంతులు..... విరేచనాలు...

ఏవీ ఆగలేదు ముసిలోడు స్పృహ కోల్పోయేడు. గూటిలోని కిరసనాయిలు బుడ్డీ కొన వూపిరితో కొట్టుకుంటుంది.

కోడలు అనుమానంగా ముసిలోడి ముక్కుమీద చెయ్యివేసి వూపిరి పరీక్షించింది.

"అన్నా... రండర్రో... బతికేవున్నాడు... రండర్రో" అని కేకలు పెడుతు వానలోకి పరుగుతీసింది.

పరుగూ...నడక... పరుగూ నడక.

వాన... ఈదురుగాలి

కనీ కనపడని కొండదారి

ఉరుములు మెరుపుల హోరు


ఊరు చేరింది. అందరినీ వెంటపెట్టుకుని పాక చేరింది. అందరూ తలో మాటన్నారు.

"ఈ రేతిర కాడ ఎలగ దించుతాము?"

"వాన ఒగ్గుండదు"

"ఇక్కడే వుంతే ముసిలోడు బతకడు"

"కొండమీద ఏ జంతువో, ఏ పురుగో... దారి ఎలగుండో"




"అలగని ఒగ్గెస్తామేట్రా పట్టండి" అని కొండ దించడానికే నిర్ణయించుకున్నారు. గొడుగు, గిడుగులు సిద్ధం చేసేరు. మంచం తిరగేసి కోళ్ళకు కర్రలు కట్టి ముసిలోడిని ఎత్తేరు.

అంతా కొండ దిగుతున్నారు. పింటుగాడిని ఎవరో ఎత్తుకుని చేరదీసేరు. వాడి చేతిలోని రేడియో మాత్రం మాట్లాడుతూనే వుంది.

"మనిషి చంద్రుడి మీద నివాసం ఏర్పాటు చేసుకోవడం ఎంతో దూరంలో లేదు. చంద్ర మండలం మీదకి మనమూ కొన్నాళ్ళకి చేరుకోగలం. అక్కడ కాలనీలు కట్టి నివశించగలం. చంద్రయాన్ శాస్త్రవేత్తలను ప్రధాని అభినందిస్తూ రెండు వేల కోట్ల రూపాయలను కేటాయించేరు" అని వార్తలు గాల్లో తేలుతున్నాయి.

మనిషి చంద్రుడి మీదకి ఎగిరే రోజుల్లో.... మాసడు కొనవూపిరితో చీకట్లో కొండ దిగుతూ.....

◆

**అమ్మాయికి 11వ సంవత్సరాల ఓణీల పండుగ, పెద్దమనిషి అయినపుడు మరో పండుగలను అట్టహాసంగా చేస్తూ ఉన్నాం. అంగరంగ వైభవంగా బంధువులను, స్నేహితులను ఆహ్వానించి మా అమ్మాయి పెద్దమనిషి అయింది అనే విషయాన్ని చెప్పకనే చెప్తున్నాం.**

అయితే అమ్మాయి పెద్దమనిషి అవుతుందనే విషయం, ఆ క్రమంలో శారీరకంగా అనేక మార్పులు చోటు చేసుకుంటాయనే విషయం పట్ల కావలసిన అవగాహన కల్పించడంలో మాత్రం ఇంకా మనం వెనకబడే ఉన్నాం. దీనికి ప్రధాన కారణాలు రెండు :

1. *తల్లిదండ్రులకు ఆ విషయంపై సరైన అవగాహన లేకపోవడం.*
2. *ఇటువంటి విషయాలు పిల్లలతో మాట్లాడడాన్ని తప్పుగా భావించడం.*

పై కారణాలు మన ఆడపిల్లలకు 11 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల మధ్య కాలంలో సంభవించే శారీరక మార్పులపై సరైన అవగాహన లేదు. దీని ఫలితంగా 1. స్తనాల ఎదుగుదల సమయంలో భుజాలు వంచి నడవడం, 2. జననేంద్రియాల వద్ద మొదటిసారిగా రక్తం స్రవించినపుడు విపరీతమైన ఆందోళనకు గురి అవ్వటం, 3. చంకల క్రింద, జననేంద్రియాల పైభాగంలో వచ్చే వెంట్రుకలను ఎప్పటికప్పుడు తొలగించుకోలేకపోవడం మొదలైనవి ఇబ్బందులకు దారి తీస్తున్నాయి. తెలుసు. అయితే అంతర్గత మార్పుల గురించి చాలా తక్కువ తెలుసు అని ఒప్పుకోవలసిందే.

*బహిరంగంగా సంభవించే మార్పులు*

- ★ రొమ్ము భాగం ఎదుగుదల
- ★ చంకలలో, జననేంద్రియాల భాగంలో రోమాలు వృద్ధి చెందడం
- ★ గొంతు మృదువుగా మారడం
- ★ నడుము భాగం సన్నగా మారి, సీటు భాగం వెడల్పు కావడం.
- ★ రుతుస్రావం అంటే నెలనెలా రక్తస్రావం కావడం
- ★ మొహంపై భాగంలో మొటిమలు వృద్ధి చెందడం
- ★ తెల్లబట్ట అనగా (వైట్ డిశ్చార్జి) తెల్లని, చిక్కని ద్రవం జననేంద్రియాల వద్ద స్రవించడం వంటి మార్పులు సంభవిస్తాయి.

*అంతర్గతంగా సంభవించే మార్పులు*

- ★ గర్భాశయం అభివృద్ధి చెందడం
- ★ అండాశయాలు అభివృద్ధి చెంది నెలనెలా అండం విడుదల.
- ★ గర్భాశయం లోపలి గోడలు దృఢంగా అనగా మందంగా తయారవడం (రక్తనాళాలతో కూడి)

# నెలనెలా బహిష్టులు ఎందుకు వస్తాయి?

ఎదుగుతున్న ఆడపిల్లలకు, వారి తల్లిదండ్రులకు, సోదరులకు, సోదరీలకు, స్నేహితులకు, బంధువులకు అమ్మాయిలలో 11 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల మధ్య జరిగే శారీరక మార్పులకు గల కారణాలను తెలియచెయ్యాలనే ఉద్దేశ్యంతో ఈ సమాచారాన్ని పొందుపరిచారు.

### ఆడపిల్లలలో - శారీరక మార్పులు

11 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల మధ్య అమ్మాయిలలో అంతర్గతంగా, బహిర్గతంగా అనేక మార్పులు సంభవిస్తాయి. బహిర్గతంగా జరిగే మార్పుల గురించి కొంతమేరకు మనందరికీ



- ★ అండం ఫలదీకరణ జరగని సందర్భంలో గర్భాశయపు లోపలి గోడలు చిట్లి, రక్తంతో సహా యోని మార్గంగుండా బయటకు రావడం.
- ★ ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ వంటి హార్మోన్‌ల ఉత్పత్తి జరగడం వంటి మార్పులు సంభవిస్తాయి.

పై మార్పులలో ముఖ్యమైన వాటి గురించి వివరంగా తెలుసుకుందాం.

### స్త్రీలలో గర్భాశయం - పనితీరు

ఆడ శిశువు పుట్టుకతోనే గర్భాశయాన్ని కలిగి ఉంటుంది. అమ్మాయి వయసు పెరిగేకొద్దీ శరీరం లోపలి గర్భాశయం కూడా వృద్ధి చెందుతూ వస్తుంది. ఇలా వృద్ధి చెందుతున్న గర్భాశయం అమ్మాయిలకు 11 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల మధ్య వారి వారి శరీరతత్వాన్ని బట్టి పరిపక్వత చెందుతుంది. పరిపక్వత చెందిన గర్భాశయం క్రింది విధంగా ఉంటుంది.

- ★ అమ్మాయిలలో నాభి భాగంకి క్రింది నుండి యోనీ భాగంకు పైన వరకు దాదాపు 10 సెంటిమీటర్ల పొడవు, 5 సెంటిమీటర్ల వెడల్పుతో గర్భాశయం ఉంటుంది.
- ★ ఈ గర్భాశయం మూత్రాశయంకు వెనుక భాగాన ఉంటుంది.

* గర్భాశయంను ఆనుకొని రెండు వైపులా, రెండు అండాశయాలు ఉంటాయి.
* అమ్మాయి వయసుకు రావడం అనగా గర్భం దాల్చడానికి వీలుగా గర్భాశయం వృద్ధి చెందిన తదుపరి అండాశయంలో ఉన్న వందల కణాల నుండి ఒక్క కణం వృద్ధి చెంది 'అండం' విడుదల అవుతుంది.
* ఇలా అండం విడుదల అయ్యే సమయానికి గర్భాశయ నాళాలు అండాన్ని స్వీకరిస్తాయి.
* గర్భాశయ నాళంలోనికి చేరిన అండం గర్భాశయ నాళం యొక్క పై భాగానికి చేరి ఫలదీకరణ కొరకు 24 గంటలు వేచి ఉంటుంది.
* అపుడు గర్భాశయంలోని లోపలి పొర శిశువును మోయడానికి వీలుగా మందంగా తయారు అవుతుంది.
* గర్భాశయం నాళంలో వేచియున్న అండాన్ని పురుష బీజ కణాలు చేరని పక్షంలో అండం నిర్వీర్యమౌతుంది.
* నిర్వీర్యమైన అండం గర్భాశయంలోనికి చేరుతుంది.
* వెంటనే గర్భాశయంలో లోపలి పొర చిట్లి ఆ పొర మొత్తం కృంగి పోతుంది.
* పొరలోని భాగాలు, రక్తనాళాల నుండి విడుదల అయిన రక్తం స్త్రీ జననేంద్రియాలలోని యోని భాగం నుండి బయటకు వస్తుంది.
* ఇది మొదటిసారిగా సంభవించినపుడు దీనినే అమ్మాయి పెద్దమనిషి కావడం అంటారు.
* పెద్దమనిషి అయిన అమ్మాయికి ప్రతి మాసం పైప్రక్రియ జరుగుతూనే ఉంటుంది. దీని ఫలితమే ప్రతినెలా జరిగే ఋతుస్రావం.

*అండం ఫలధీకరణ*


* విడుదల అయిన అండంను పురుష బీజకణాలు చేరడం వలన అండం ఫలదీకరణ జరుగుతుంది. అలా ఫలదీకరణ జరిగిన అండం గర్భాశయంలోని లోపలి గోడలకు అంటుకొని ఉంటుంది.
* గర్భాశయంలోని లోపలి గోడలు బిడ్డగా రూపుదాల్చేందుకు వీలుగా రక్షణ కల్పిస్తాయి.
* ఇలా తొమ్మిది మాసాలు నిండిన పిదప గర్భాశయం నుండి యోని మార్గం ద్వారా శిశువు బయటకు వస్తుంది.

ఇదండీ గర్భాశయం ప్రాముఖ్యత.

### అండాశయాలు

గర్భాశయానికి ఇరువైపులా రెండు అండాశయాలు ఉంటాయి. ఈ అండాశయాల పాత్ర ఇలా ఉంటుంది.

* ప్రతి నెలా ఓ అండాశయం అండాన్ని విడుదల చేస్తుంది.
* మరుసరి నెల రెండవ అండాశయం అండాన్ని విడుదల చేస్తుంది. ఇలా ప్రతి నెలా జరుగుతుంది.
* చిన్ని పిల్లలుగా ఉన్నప్పుడు అండాశయంలో వేల సంఖ్యలో ఉన్న అండకణాలు, యుక్త వయసు వచ్చేనాటికి ఆ సంఖ్య వందలలోనికి పడిపోతుంది.




* 11 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల మధ్య అండాల విడుదల ప్రారంభించిన అండాశయాలు 45 నుండి 50 సంవత్సరాలు వచ్చే వరకు తమ పనిని ప్రతినెలా నిర్వహిస్తూనే ఉంటాయి.
* సాధారణంగా ఋతుస్రావం ప్రారంభమైన మొదటి రోజు నుండి లెక్కిస్తే ఖచ్చితంగా 14వ రోజు అండం విడుదల అవుతుంది.
* ఒకే నెలలో రెండు అండాశయాలు అండాలను విడుదల చేస్తే, ఆ అండాలు ఫలదీకరణ జరిగితే అపుడు కవల పిల్లలు జన్మిస్తారు.

### ఋతుచక్రం

సాధారణంగా ఋతుచక్రం '28' రోజుల కాలవ్యవధితో ఉంటుంది. వివరంగా చెప్పాలంటే:

* ఒకటి నుండి '7' రోజుల వరకూ రక్తస్రావం
* 14వ రోజు అండం విడుదల
* 11వ రోజు నుండి 15 రోజుల వరకు ఫలదీకరణ సమయం.

ఇలా ప్రతీ '28' రోజులకు ఒకసారి ఋతుచక్రం తిరుగుతూనే ఉంటుంది. అయితే కొందరిలో ఇది రోజుల ముందుకు, 2 రోజుల వెనుకకు జరుగవచ్చు.

### నెలసరికి ముందు ఆందోళన

సాధారణంగా ప్రతీ ఆడవారిలో నెలసరి వచ్చే ముందు క్రింది లక్షణాలు కన్పిస్తాయి. దీనినే ప్రీ మెన్స్టువల్ సిండ్రోమ్ అని అంటారు.

* స్తనాలు బరువుగా, నొప్పిగా ఉండడం, ఆ భాగాన్ని తాకడానికి కూడా జంకేలా నొప్పి పుట్టడం.
* కోపం, చిరాకు, ఆందోళనలు కల్గి ఉండడం.

ఈ లక్షణాలు ఒక స్థాయికి మించి ఉన్నట్లయితే అందుకై డాక్టరును సంప్రదించవలసి ఉంటుంది. దీనినే నెలసరికి ముందు కలిగే ఆందోళన అని అంటారు.

*- వి. మాధురి, ఫాకల్టీ, అపార్డ్*
*- డా. నాగమణి, ఫ్రీలాన్స్*

# శుభ్రమైన చేతులతో ఆరోగ్యం పదిలం



అక్టోబరు 15, 2008 ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా చేతులు శుభ్రపరచుకోనే దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించుకోవడం ప్రారంభమైన రోజు. ప్రభుత్వ, ప్రభుత్వేతర అనగా ప్రైవేటు భాగస్వామ్యంలో ప్రతి సం॥రం అక్టోబరు 15వ తేదీని "గ్లోబల్ హాండ్ వాష్ దే" గా జరుపుకోవాలని నిర్ణయించి 2008 సం॥రం నుండి అమలు పరచారు. గ్లోబల్ హాండ్ వాష్ దేని నిర్వహించుకోవడానికి గల ప్రధాన ఉద్ధేశ్యాలు మూడు. అవి

1. సబ్బుతో చేతులను శుభ్రపరచుకోవడం ప్రతి ఒక్కరిలో ఓ అలవాటుగా మారి అది ఓ ఆచారంగా రూపొందేలా చేయడం.
2. ప్రతి దేశం 'సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడం' అనే అంశాన్ని ముఖ్యాంశంగా పరిగణించి తగు ప్రాధాన్యత నిచ్చేలా చేయడం.
3. సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడం వలన కలిగే లాభాలను అందరూ గుర్తించగలిగేలా చేయడం.

'గ్లోబల్ హాండ్ వాష్ డే' ని పిల్లలను, పాఠశాలలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేయడం జరిగింది. అయితే పిల్లలతో పాటు పెద్దలు (అన్ని వర్గాల ప్రజలు) సుమారు (100) వంద దేశాలకు చెందిన 200 మిలియన్ల ప్రజలు ఈ వేడుకలలో పాల్గొంటున్నారంటే, ఈ అంశం ఎంత ప్రభావితం చేస్తున్నది అనేది మనం అర్థం చేసుకోవచ్చు.

### చేతులను సబ్బుతో ఎందుకు శుభ్రం చేసుకోవాలి?

మన చేతులు వ్యాధి కారిక క్రిములను మన శరీరంలోనికి తీసుకుపోగల ఓ ముఖ్యమైన వాహకాలు. అనగా, మనచేతులలోని క్రిములు, మల అవశేషాలు, దుమ్ము, ధూళి, ఇతర హాని కారకాలు సరిగా శుభ్రం చేసుకోకుంటే మన శరీరంలోనికి సులభంగా ప్రవేశిస్తాయి. దానివలన డయేరియా (అతిసార వ్యాధి), శ్వాస కోశ సంబంధిత వ్యాధులు ప్రబలుతాయి. ఇవేకాక, న్యుమోనియా, చర్మ వ్యాధులు, కళ్ళకు ఇన్ఫెక్షన్లు, నులిపురుగులు, సార్స్, అవైన్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ వంటి వ్యాధులు సంక్రమిస్తాయి.

ముఖ్యంగా డయేరియా అంటే, వాంతులు, నీళ్ళ విరేచనాల వలన ప్రతి సం॥రం 3.5 మిలియన్ల చిన్నారులు (ఐదు సంవత్సరాల లోపు వారు) మరణిస్తున్నారు. అంటే చిన్నారుల మరణాలకు కారణమౌతున్న అతిసార వ్యాధిని మనం మన చేజేతులా కొని తెచ్చుకుంటున్నామన్న మాట. మన మిలీనియం అభివృద్ధి లక్ష్యాలలో ఒకటైన '5' లోపు పిల్లల మరణాలను 2/3 వంతుకు తగ్గించాలన్నది సాధించాలంటే, తక్కువ ఖర్చుతో, ఎక్కువ సమర్థవంతంగా వ్యాధులను ఎదుర్కోనేందుకు / వ్యాధులు సంక్రమించకుండా ఉండేందుకు ఉన్న సులభమైన మార్గం "సబ్బుతోనే చేతులను శుభ్రం చేసుకోవడం".

### చేతులను ఎప్పుడు, ఎక్కడ శుభ్రం చేసుకోవాలి?

మరుగు దొడ్డికి వెళ్ళి వచ్చిన తరువాత, చిన్న పిల్లలు, ముసలి వారి మల, మూత్ర ద్వారాల వద్ద శుభ్రపరచిన తదుపరి, వ్యాధి గ్రస్తులకు సేవలు చేసిన తదుపరి, ఆహార పదార్థాలను చేతులలోనికి తీసుకొనే ముందు, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలి.

ఇక ఎక్కడ శుభ్రపరచుకోవాలి అంటే, చేతులను శుభ్రం చేసుకోవడానికి ఏదో ఒక ప్లాట్‌ఫామ్ తప్పనిసరి. సాధారణంగా, గ్రామాలలో చేతులను శుభ్రపరచుకోవడానికి అంటూ ఓ ప్రత్యేకమైన సదుపాయం ఏమి ఉండదు. ఏ కొద్ది మందికో గానీ, వాష్ బేషిన్ వంటి సదుపాయాలు ఉండవు. కనుక ప్రత్యామ్నాయాలను ఏర్పాటు చేసుకోవాలి. అందుకు తక్కువ ఖర్చుతో, తక్కువ సాంకేతికతతో వీలయ్యే 'టిప్పీ ట్యాప్'ను స్వంతంగా తయారు చేసుకుని మరుగుదొడ్లో, ఆరు బయట నీటి తొట్టిల వద్ద ఏర్పాటు చేసుకోవచ్చు. దీని ద్వారా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవడం సులభమౌతుంది. ఎలాంటి పరిస్థితిలోనైనా చేతులను శుభ్రం చేసుకోవడం మరచి పోవద్దు.



## చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలి?

భోజనం ఎలా అయితే ఓ క్రమ పద్ధతిలో చేస్తామో, రోజువారీ కార్యక్రమాలకు ఎలా ఓ విధానాన్ని పాటిస్తామో, అలాగే చేతులను శుభ్రం చేసుకోవడానికి కూడా ఓ పద్ధతి పాటించడం ఎక్కువ సత్ఫలితాలను కలిగిస్తుంది. అదేమిటో చూద్దాం.

- ముందుగా రెండు చేతులనూ నీటితో తడపాలి.
- తరువాత సబ్బు రాయాలి.
- ఆ తదుపరి రెండు చేతులనూ ఓ క్రమపద్ధతిలో రుద్దాలి.
    1. ఒక అరచేతిని మరో అరచేతితో రుద్దాలి.
    2. అరచేతి పైభాగాన్ని రెండవ అరచేతి సహాయంతో రుద్దాలి.
    3. అరచేతి మధ్యభాగాన్ని మరో చేతి మునివేళ్లతో శుభ్రం చేయాలి
    4. ఓ అరచేతి వేళ్ళ మధ్య మరో అరచేతి వేళ్ళను ఉంచి శుభ్రం చేయాలి.
    5. మణికట్టు నుండి మొత్తం చేతిని మరో అరచేతి సహాయంతో బాగా రుద్దాలి.

ఇలా రెండు చేతులనూ శుభ్రం చేయాలి. దీనికి ఒక్కో స్టెప్‌కు కనీసం మూడు సంఖ్యలు లెక్కపెట్టండి. ఐదు స్టెప్‌లు, రెండు చేతులనూ కలిపి పది స్టెప్‌లు, ఒక్కో స్టెప్‌కు ఒక్కో నెంబరు చొప్పున ముప్పై నెంబర్లు లెక్కపెడుతూ రుద్దండి.

- తదుపరి నీటితో చేతులను శుభ్రం చేసుకోండి. ఇప్పుడు శుభ్రమైన చేతులు మీ కళ్ళముందు సాక్షాత్కరిస్తాయి.

## చేతులను శుభ్రపరచుకోనేలా చేయడానికి ముందుగా ఎవరిని ఎంపిక చేసుకోవాలి?

ఇంకెవరినీ, పిల్లలనే. పిల్లల ద్వారా సబ్బుతో చేతులను శుభ్రపరచుకోనే అలవాటును త్వరగా ప్రజలలోనికి తీసుకువెళ్ళవచ్చు. ఎందుకంటే, పిల్లలు చాలా శక్తివంతమైన, ఆసక్తికలిగిన, ఆతృత కలిగిన వారు. అంతేకాదు, నేర్చుకున్నది నేర్చుకున్నట్లు తమ తల్లిదండ్రులకు, స్నేహితులకు, తమ తోటి వారికీ చెప్పడంతో సిద్ధహస్తులు. అందుకే ఈ కార్యక్రమానికి పిల్లలని ముందుగా ఎంచుకుందాం. ఎక్కువ సంఖ్యలో పిల్లలు మనకు ఒకే చోట అంటే పాఠశాలలో అందుబాటులో ఉంటారు.

### 'టిప్పీ ట్యాప్' తయారీ



**కావలసిన పరికరాలు**

- ఓ ప్లాస్టిక్ డబ్బా (ఐదు లీటర్లు/ రెండు లీటర్లు)
- ఓ మేకు
- తాడు (సుమారు నాలుగు మీటర్లు)
- పొడవాటి సబ్బు
- ప్లాస్టిక్/ ఇనుప/ స్టీల్ / ఇండాలియా గిన్నె.
- కొవ్వొత్తి, అగ్గిపెట్టె.

**తయారీ ప్రక్రియ**: బిరడా బిగించిన ఓ ఖాళీ ప్లాస్టిక్ డబ్బాకు ఓ వైపున మూతకు ప్రక్కగా వేడి చేసిన మేకును గుచ్చి చిన్న రంధ్రాన్ని చేయాలి. ఈ రంధ్రం నీరు బయటకు రావడానికి ఉద్దేశించినది. మరో వైపున మధ్య భాగంలో ఓ అంగుళం వెడల్పులో రెండు రంధ్రాలను ఏర్పరచాలి. ఆ రెండు రంధ్రాల గుండా తాడును దూర్చి దానిని ఓ కర్రకు / కడ్డీకి కట్టాలి. బాటిల్ మూత భాగంలో మరో త్రాడును వేలాడదీయాలి. అది బాటిల్‌ను క్రిందికి వంచుకోవడానికి తద్వారా నీరు బయటకు రావడానికి ఉపకరిస్తుంది. తదుపరి పొడవాటి సబ్బును ఓ త్రాడుకు కట్టి, దానికి కొంత పైభాగంలో సబ్బును వాన నుండి, ఎండనుండి రక్షించడానికి వీలుగా గిన్నెను అమర్చి, ఆ తాడును, కర్రను / కడ్డీకి వేలాడదీయాలి. ఇప్పుడు టిప్పీ ట్యాప్ రెడీ.

## ఈ "గ్లోబల్ హాండ్ వాష్ డే" కి మనమేం చేద్దాం?

ఈ అక్టోబరు 15వ తేదీన మన మందరం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం. జిల్లాస్థాయిలో, మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో ఉన్న అధికారులందరినీ ఓ చోటికి చేర్చి ఈ ప్రక్రియపై చర్చించి ప్రతి పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని కవర్ చేసేలా, ఒక్కొక్కరికీ ఒక్కోగ్రామ పంచాయితీలో బాధ్యత కేటాయిస్తూ బడి పిల్లలందరిలో అవగాహన కల్పించవచ్చు. అందుకు ఈరోజే సన్నద్ధులవుదాం. అందుకు గాను "హాండ్ వాష్ కిట్" ను సమకూర్చుకుందాం. అందులో ఓ గాజు పాత్ర, రెండు గాజు గ్లాసులు, ఓ లీటరు నీళ్ళు, ఒక సబ్బు (పెట్టెతో సహా), ఓ తెల్లని తువాలు. బాలబాలికల నుండి ఒకరిని రమ్మని, వారితో (గాజు పాత్రలోనికి) ముందు పేర్కొన్న పద్ధతిలో చేతులను శుభ్రం చేయిద్దాం. ఆ నీటిని ఓ గాజు గ్లాసులోనికి పంపి అందరికీ చూపించగలిగితే, మన చేతులలో ఎంత మురికి దాగి ఉంటుందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోగలుగుతారు. ఈ అంశాన్ని తమ కుటుంబ సభ్యులకు చేర్చగలుగుతారు. ఇందులో మనం అనుకున్నది. సాధించగలిగితే తోటి మనుషుల పట్ల కొంతమేరకు మన బాధ్యతలను నెరవేర్చినట్లే. "బెస్ట్ ఆఫ్ లక్".

- పి. మాధురి




# డిసెంబరు లోగా దేశవ్యాప్తంగా లక్ష మంది భారత నిర్మాణ్ వాలంటీర్లు



డిసెంబరు నాటికి దేశ వ్యాప్తంగా ఒక లక్ష మంది భారత్ నిర్మాణ్ వాలంటీర్లను తయారు చేయాలన్న లక్ష్యంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పనిచేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ శ్రీ బి.కె. సిన్హా ఐ.ఎ.ఎస్. అన్నారు. భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉపయోగపడతారని, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు గ్రామీణాభివృద్ధిని ఏ విధంగా వేగవంతం చేయగలరో అన్నదానికి ఆంధ్రప్రదేశ్‌లోని రంగారెడ్డి జిల్లా చీదేడ్ గ్రామంలోని వాలంటీర్లు ఉదాహరణగా నిలుస్తున్నారని ఆయన అన్నారు.

తాను చీదేడు గ్రామంలో రాత్రి బస చేసి, వాలంటీర్లు చేస్తున్న కృషిని ప్రత్యక్షంగా చూసానని, వారు గ్రామంలో మద్యపాన నిషేధానికి, పారిశుద్ధ్యానికి, త్రాగునీటి వసతి మెరుగుపర్చటానికి కృషి చేస్తూ, సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయ సాగు తదితర రంగాలలో గ్రామ అభివృద్ధిని వేగ వంతం చేస్తున్నారని అన్నారు. సెప్టెంబరు 15 నుండి 17వ తేదీ వరకూ త్రివేంద్రంలో కేంద్ర మంత్రిత్వ శాఖ, ఎన్.ఐ.ఆర్.డి.ల ఆధ్వర్యంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల అధిపతులు, సిబ్బందితో జరిగిన సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించిన శ్రీ బి.కె. సిన్హా మాట్లాడుతూ, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు ప్రభుత్వ




యంత్రాంగానికి సహాయకారులుగా ఉంటూ, ప్రభుత్వ సేవలను ప్రజల దరిచేర్చటానికి కృషి చేసేందుకు మాత్రమే అన్న విషయాన్ని గుర్తెరగాలనీ, వీరు ప్రభుత్వ యంత్రాంగానికి ప్రత్యామ్నాయం కాదని అన్నారు.

ఇటీవల ప్రధాని సమక్షంలో జరిగిన జాతీయ భద్రతా సమావేశంలో కూడా నక్సల్ ప్రభావిత ప్రాంతాలలోని యువత పెడత్రోవ పట్టకుండా వారిలో దేశ సమగ్రత, సమైక్యతల పట్ల అవగాహన పెంపొందించి, ఆయా ప్రాంతాల అభివృద్ధిలో వారిని భాగస్వామ్యులను చెయ్యాలని సూచించారని, నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో జిల్లాకు 1000 మంది వాలంటీర్లకు శిక్షణ అందచేసి, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలందరికి చేరేలా చూడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ నితేన్ చంద్ర మాట్లాడుతూ, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల సమగ్ర సమాచారాన్ని రూరల్ దీక్షా వెబ్‌సైట్‌లో (http://ruraldiksha.nic.in) పొందుపర్చాలని సూచించారు. ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమ అమలు విశేషాలను ఎప్పటికప్పుడు ఈ వెబ్‌సైట్‌లో నిక్షిప్తంచేయాలని అన్నారు.







ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమ అమలు తీరుపై ఆయా రాష్ట్రాల ప్రతినిధులు వివరించారు. శ్రీ నితేన్ చంద్ర మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం అమలు దేశానికే ఆదర్శప్రాయమని, తాము కేవలం కార్యక్రమం ఎలా ఉండాలనే దానిపై మార్గదర్శకాలు మాత్రమే ఇచ్చామని, ఈ ప్రయోగాన్ని విజయవంతంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసి దేశానికే ఒక నమూనాను ఇచ్చిన ఘనత అపార్డు కమీషనర్ చంద్రమౌళికి దక్కుతుందని అన్నారు. అందుకే మంత్రిత్వ శాఖ 'చీదేడ్' గ్రామంపై హిందీలో ప్రత్యేకంగా డాక్యుమెంటరీ చిత్రాన్ని రూపొందించిందని అన్నారు. అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ అడుగు జాడల్లో నడవాలని అన్నారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌లలో కూడా ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమ ప్రగతి బాగున్నదని ఆయన కితాబిచ్చారు.

ఈ కార్యక్రమంలో మన రాష్ట్రం నుండి రంగా రెడ్డి జిల్లా కలెక్టరు శ్రీ డా. శేషాద్రి, చిత్తూరు కలెక్టర్ సాల్మన్ ఆరోగ్యరాజ్‌లు హాజరయ్యారు. కొటాల గ్రామం నుండి భారత్ నిర్మాణ్ వాలంటీర్ శ్రీమతి సింగుసుధ, మాజీ సర్పంచ్ మదన్‌మోహన్ నాయుడు పాల్గొన్నారు. వారు తమ అనుభవాలను మిగిలిన వారితో పంచుకున్నారు.

# facebook చిగురుతొడిగిన గత పరిచయాలు

## అపార్డ్ ఫేస్‌బుక్ సహాయంతో...

అపార్డ్ ఫేస్‌బుక్ సహాయంతో కొటాల గ్రామంలోని భారత్ నిర్మాణ్ వాలంటీర్లు తాము చేస్తున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు బాహ్య ప్రపంచానికి తెలియచేయటానికి ఇటీవల కాలంలో ఫేస్‌బుక్‌లో నమోదయ్యారు. అపార్డుకి ఎప్పటికప్పుడు తమ కార్యక్రమాలను తెలియచేయటానికి సుధ అనే వాలంటీరు ఫేస్‌బుక్‌లో అకౌంటు తెరిచి సమాచారాన్నంతా నిక్షిప్తం చేయటం ప్రారంభించింది.

సుధ ఫేస్‌బుక్‌లో పంచుకుంటున్న సమాచారాన్ని గమనించిన అమెరికావాసి, ఆమె సమీప బంధువు 12 సంవత్సరాల తరువాత ఆమె చిరునామాను సంపాదించగల్గారు. అపార్డ్ ఫేస్ బుక్ వల్ల కీ - క్యాప్ కార్యక్రమంతో పుష్కర కాలం నాడు తెగిన బంధం నేడు మళ్ళీ చిగురించింది. అందుకే సుధ అపార్డుకి తన కృతజ్ఞతలు తెలియ చేస్తోంది.

# మీ అడుగు జాడల్లోనే మేము!

## బి.ఎన్.వి.లుగా ముందుకు వస్తున్న మాజీ సర్పంచ్‌లు

**భారత్ నిర్మాణ్ వాలంటీర్లుగా ముందుకు వస్తున్న మాజీ సర్పంచ్‌లు, ధనాపేక్ష లేకుండా, అంకిత భావంతో ప్రజలకు సేవ చేస్తే సమాజంలో ఎంత గుర్తింపు వస్తుందో, అంత మానసిక సంతృప్తి కూడా లభిస్తుందని, ఇటీవల కాలంలో పదవీ కాలం పూర్తి చేసిన సర్పంచ్‌లు అంటున్నారు. ల్యాబ్ టు ల్యాండ్ కీ - క్యాప్ కార్యక్రమంలో భారత్ నిర్మాణ్ వాలంటీర్లతో కలిసి సమాజంలోని ఆపన్నుల సేవ చేయటంతో ఈ విషయం స్వానుభవంలోని వచ్చిందని, తమను కూడా భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా చేర్చుకోవాలని పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు అపార్డును సంప్రదిస్తున్నారు. వీరిలో కొంత మంది సెప్టెంబర్ మాసంలో అపార్డులో జరిగిన భారత్ నిర్మాణ్ వాలంటీర్ల శిక్షణలో పాల్గొని, తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. వారి అభిప్రాయం వారి మాటల్లోనే :**




సర్పంచ్‌గా కేవలం 5 సంవత్సరాలు మాత్రమే పదవీ కాలం ఉంటుంది. భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా జీవిత కాలం సేవలందించవచ్చు. అభివృద్ధికి తోడు ఆదర్శం జత అయితే గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దాలన్న ఆకాంక్ష నెరవేరుతుంది. గ్రామాలలో నేటికీ పేదరిక సమస్య, పారిశుధ్య తదితర సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ ప్రజా భాగస్వామ్యంతో పరిష్కరించాలంటే సర్పంచ్‌గా కాకుండా మరే మార్గమేదైనా ఉందా అని ఆలోచిస్తున్న సమయంలో ఈ ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమం గూర్చి తెల్సింది. వాలంటీర్‌గా ఉంటూ జీవితాంతం ప్రజలకు సేవ చేయవచ్చు అని అన్పించి నా 5 సంవత్సరాల సర్పంచ్ పదవీ కాలం పూర్తయిన వెంటనే బి.ఎన్.వి.గా చేరాను. ప్రస్తుతం మా గ్రామంలో ఈ వర్షాకాలంలో 500 మొక్కలు నాటాము. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాము. గ్రామంలోని ఒక మహిళకు చెందిన పోస్టల్ అకౌంట్‌లో ఆ శాఖ సిబ్బంది చేతి వాటం వల్ల నష్టపోయిన రూ. 7000/-లు, భారత్ నిర్మాణ్ వాలంటీర్ల పోరాటం వల్ల ఆమెకు తిరిగి లభించాయి. ఇలాంటివి ఎన్నో చెయ్యవచ్చు.

**శ్రీమతి జి. కృష్ణ వేణి,**
**సర్పంచ్, ఈదులమద్దాలి (2006-11), కృష్ణా జిల్లా**



సర్పంచ్‌గా కొన్ని పనులు మాత్రమే చేయటానికి వీలు ఉంటుంది. కానీ ఒక భారత్ నిర్మాణ్ వాలంటీర్‌గా స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేయవచ్చు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమ అమలుకు ప్రభుత్వ అధికారుల సహకారంతో పనిచేయవచ్చు. ఈ అవకాశం కల్పించిన అపార్డ కమీషనరు గారికి కృతజ్ఞతలు

**శ్రీ దేవేందర్,**
**సర్పంచ్, అనంతారం, పర్వతగిరి మండలం, వరంగల్ జిల్లా**



అపార్డ్ ప్రారంభించిన ల్యాబ్ టు ల్యాండ్ కీ క్యాప్ కార్యక్రమం ఒక వినూత్నమైనది. ఈ కార్యక్రమంలో ఒక మహోన్నత ఆశయం ఉంది. అందుకే నేను సైతం ఈ కార్యక్రమంలో ఒక వాలంటీర్‌గా నా పదవీ కాలం పూర్తయిన తరువాత నమోదు అయ్యాను. గ్రామ సేవే దేశ సేవ అందుకే నా గ్రామానికి సేవ చేయటానికి స్వచ్ఛంద కార్యకర్తగా ముందుకు వచ్చాను.

**శ్రీ విజయకుమార్,**
**సర్పంచ్, ఈడ్పుగల్లు (2006-11), కృష్ణా జిల్లా**



నేను గత ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు కొన్ని ఇంకా మిగిలి పోయాయి. భారత్ నిర్మాణ్ వాలంటీర్ రూపంలో ఆ వాగ్దానాలను నెరవేర్చాలని స్వచ్ఛందంగా ముందుకు వచ్చాను. అపార్డ అందచేసేది శిక్షణ అనటం కన్న ఒక మంచి ప్రబోధం అనటం సముచితం. మానవ సేవ చేయాలనే సంకల్పం ఉన్న ఏ సర్పంచ్ అయినా ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలి.

**శ్రీ వెంకటేశ్వర్లు**
**సర్పంచ్, బొద్దుపల్లి పంచాయితీ, (2006-11), అనంతపూర్ జిల్లా**



గ్రామ పంచాయితీకి అపార్డ శిక్షణ ద్వారా 50 మంది సుశిక్షితులైన వాలంటీర్లు లభించారు. వీరి సహకారంతో గ్రామ అభివృద్ధిని ద్విగుణీకృతం చేస్తాము. గతంలో గ్రామ అభివృద్ధికి రాజకీయాలు అడ్డువచ్చేవి... ఇప్పుడు అన్ని పక్కన పెట్టి అభివృద్ధే ధ్యేయంగా ముందుకు పోతున్నాం. అహింస, సత్యాగ్రహం వంటి ఆయుధాలతో మనం స్వాతంత్ర్యం సిద్ధించుకున్నాం. ఇప్పుడు స్వచ్ఛంద సేవతో గ్రామాలను నిర్మించుకొనేందుకు ఈ భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, కీ - క్యాప్ కార్యక్రమం చాలా బాగా ఉపయోగపడుతున్నాయి.

**శ్రీ మదన్‌మోహన్**
**సర్పంచ్, కొటాల, చిత్తూరు జిల్లా**



# గ్రామీణ నిరుపేదల జీవితాల్లో ఆశాదీపం - సెర్ప్

ఆంధ్రప్రదేశ్ప్రభుత్వం 2000 సంవత్సరంలో సొసైటీ చట్టం క్రింద గ్రామీణ నిరుపేదల జీవితాల్లో కాంతింఖలు నింపేందుకు, గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన శక్తివంతంగా అమలు చేసేందుకు అనువుగా గ్రామీణాభివృద్ధి దారిద్ర్య నిర్మూలన సంఘరే ను (SERP) ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థగా ర్పాటు చేయడం జరిజింది.

ఈ సంఘం ప్రపంచ బ్యాంకు ఇచ్చిన 260 మిలియన్ల డాలర్ల ఆర్థిక సహాయంతో స్థాపించబడినది. ఈ సంస్థ ఉద్దేశ్యం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రజల దారిద్ర్యాన్ని నిర్మూలించి, వారి జీవితాలలో చిరుదివ్వెలు వెలిజించటం, తద్వారా సామాజికాభివృద్ధి వేగవంతమయ్యే విధంగా కార్యక్రమాలను చేపట్టడం, పథకాలను అమలు చేయడం.





సెర్ప్ యొక్క మరొక ముఖ్య ఉద్దేశ్యం ఏమంటే, గ్రామీణ నిరుపేదలే లబ్ధి దారులుగా, యజమానులుగా బాధ్యతలను చేపట్టి, వారి జీవితాల్లోని దారిద్ర్యాన్ని నిర్మూలించి, అన్ని కోణాలలో అభివృద్ధి చెందేందుకు అవసరమైన స్వయం సహాయక స్ఫూర్తిని వారిలో నింపటం ద్వారా అభివృద్ధిని సాధించేలా గ్రామీణ ప్రజలను తీర్చిదిద్దటం.

సెర్ప్ సంస్థతో అనుసంధానించబడిన ప్రభుత్వ అధికార యంత్రాంగం ప్రాథమిక విధి ఏమంటే రాష్ట్రంలోని సుమారు 30 లక్షల గ్రామీణ నిరుపేదల జీవనోపాధిని, జీవన ప్రమాణాలను పెంపొందించటానికి వీలుగా వారి నైపుణ్యాలను (Capacity Building) అభివృద్ధి చేయటం.

## 'సెర్ప్' ప్రాజెక్టులు

ప్రారంభంలో గ్రామీణ నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపాలనే ఉద్దేశ్యంతో అదే ఆశయాన్ని ప్రతిబింబింపజేసేలా, సెర్ప్ సంస్థ భారీగా దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ అంతటా కొనసాగించేలా 'వెలుగు' అనే ప్రాజెక్టు పేరుతో 2 సమగ్రమైన పథకాలను ప్రవేశపెట్టింది.

*1. ప్రాజెక్టు మొదటి దశలో అంటే జూన్ 2000 నుంచి డిశంబర్ 2005 వరకు 'ఆంధ్రప్రదేశ్‌లోని 6 జిల్లాలలో దారిద్ర్య నిర్మూలనకు అవసరమైన చర్యలు చేపట్టే పథకం':*

* ఈ పథకం క్రింద 6 జిల్లాలు, అంటే అనంతపురం, చిత్తూరు, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, విజయనగరం, శ్రీకాకుళంలోని 316 మండలాలను ఎంపిక చేయటం జరిగింది.
* ఈ పథకం క్రింద ఎంపిక కాబడిన 316 మండలాలలోని 9,30,000 గ్రామీణ పేద కుటుంబాలను ఈ 5 సంవత్సరాల కాలంలో అభివృద్ధి పరచటానికి గాను రూ. 654 కోట్ల నిధులు కేటాయించారు.

*2. ప్రాజెక్టు రెండవ దశలో అనగా ఏప్రిల్ 2003 నుంచి సెప్టెంబర్ 2008 వరకు 'ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ దారిద్ర్య తగ్గింపు పథకం':*

* ఈ ప్రాజెక్టులో మిగిలిన 16 జిల్లాలలోని 548 మండలాలను ఎంపిక చేయటం జరిగింది.
* ఈ ప్రాజెక్టు క్రింద 20,00,000 గ్రామీణ పేద కుటుంబాలను ప్రాజెక్టు 5 సంవత్సరాల కాలంలో అభివృద్ధి చేసేందుకు రూ. 1486 కోట్ల నిధులు కేటాయించారు.

ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 22 జిల్లాల్లో అనేకమైన దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలను చేపట్టి తద్వారా గ్రామీణాభివృద్ధికి కృషి చేయడం జరిగింది. అంతేకాకుండా గ్రామీణ మహిళల నైపుణ్యాలను అభివృద్ధి చేయటం ద్వారా, వారు పాల్గొంటున్నటువంటి స్వయం సహాయక సంఘాల ద్వారా జీవనోపాధిని పెంపొందింపజేసుకునేలా, తద్వారా వారి ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అనువైన వ్యూహాలను అనుసరిస్తూ, కమ్యూనిటీ ఆధారిత సంస్థలను (Community Based Organizations - CBOs) పటిష్ఠం చేయడంలో 'సెర్ప్' విజయం సాధించింది.

2005 సంవత్సరం జనవరి నుండి పై రెండు ప్రాజెక్టులను సమీకృత పరచి 'ఇందిరాక్రాంతి పథం' (ఐకెపి)గా పిలవటం జరిగింది. తరువాత జి.వో. యమ్.ఎస్. నెం. 15, తేది: 25.01.2005 ద్వారా





'గ్రామీణ ప్రాంతాల మహిళా శిశు అభివృద్ధి పథకం' (డ్వాక్రా)ను కూడా ఇందిరాక్రాంతి పథంలో విలీనం చేయడం జరిగింది.

జాతి, మతం, కులాలతో సంబంధం లేకుండా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నటువంటి అతి నిరుపేదల నుండి మొదలుకొని అన్నివర్గాల వారు ఈ పథకం క్రింద లబ్ధిదారులే.

భారత ప్రభుత్వం జారీ చేసినటువంటి మార్గదర్శకాల (The Identification of families below poverty line for the Tenth five year plan [2002 - 2007]) ఆధారంగా, ప్రాజెక్టులో భాగమైన గ్రామాలలో గ్రామసభల ద్వారా 'భాగస్వామ్య అవసరాల గుర్తింపు' (Participatory Need Identification) పద్ధతిని అనుసరించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది.

సెర్ప్ పథకాలు, కార్యక్రమాలను గనుక మనం స్థూలంగా పరిశీలించినట్లయితే 5 భాగాలుగా విభజించవచ్చును.


## I. దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలు

### a) శక్తి, సామర్థ్యాల నిర్మాణం (Institution Building):

కమ్యూనిటీ ఆధారిత సంఘాల (CBOs)ను స్థాపించి తద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామసంఘాలు, మహిళా సమాఖ్యలను బలోపేతం చేయటం.

చిత్రపటం -I

సమాజ ఆధారిత సంఘం - నిర్మాణక్రమం




### b) సూక్ష్మరుణాలు (Micro Finance):

స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆదాయం లభించే విధంగా ఉపాధి పొందటానికి రుణాలు అందించటం.

### c) కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (Community Investment Fund):

ఉపాధి కల్పన, ఆస్తుల కల్పన, ఇతర ఆర్థికాభివృద్ధి సంబంధిత చర్యలు చేపట్టడానికి అవసరమైన నిధిని కమ్యూనిటీ ఆధారిత సంఘాలకు అందించడం.

### d) ఈ దిగువ విధానాల ద్వారా గ్రామీణ పేదలకు జీవనోపాధి అవకాశాలను కల్పించడం.

★ గ్రామీణ ప్రజలు తమ వ్యవసాయాధారిత ఉత్పత్తులను సామూహికంగా క్రయ విక్రయాలు జరపటం ద్వారా మంచి లాభాలను పొందేందుకు, నేరుగా మార్కెటింగ్ చేసే విధంగా వారికి సహాయం అందించటం. (Marketing Assistance)

★ పాలకేంద్రాల స్థాపన (Setting up Diaries)

★ పొలాలు లేని పేదవారికి స్థలాలు కల్పించడం, పొలాలను సాగులోనికి తీసుకురావటం ద్వారా, ఎటువంటి తగాదాలు లేకుండా పొలాలను వినియోగించుకొనేలా యాజమాన్యాన్ని తయారు చేయడం.

★ వ్యాపార, పరిశ్రమలు, సేవారంగాలలోని సంస్థలతో భాగస్వామ్యం ద్వారా వృత్తి, జీవన సంబంధిత శక్తి సామర్థ్యాలపై శిక్షణనివ్వటం ద్వారా గ్రామీణ యువత ఉపాధిని, ఉద్యోగ అవకాశాలను పెంపొందించటం.

★ గ్రామీణ యువతకు నిర్మాణ రంగంలోని నైపుణ్యాలపై ప్రత్యేకంగా శిక్షణనివ్వటం ద్వారా వారి ఉద్యోగితను, ఆదాయార్జన అవకాశాలను పెంపొందించటం (Construction Skills)

★ గ్రామీణ వనరుల సమతుల్యతను కాపాడేందుకు, ప్రజల జీవన విధానాలను కాపాడేందుకు వీలుగా వాతావరణానికి సహాయకారిగా వుండే చర్యలను చేపట్టడం.

e) గ్రామీణ వికలాంగుల జీవనోపాధి అవకాశాలను పెంపొందించటానికి, హక్కులను కాపాడటానికి ప్రత్యేక చర్యలను చేపట్టటం. ఇందుకుగాను గ్రామ, మండల స్థాయిలలో వికలాంగుల సంఘాలను ఏర్పాటు చేసి వాటి మనుగడకు ప్రోత్సాహమివ్వటం.

f) పేద ప్రజల ఆరోగ్య, పోషకాహార పరిస్థితులను సాధికారిక కమ్యూనిటీ ఆధారిత సంఘాల ద్వారా మెరుగుపరచడం.

g) జెండర్ అంశాలపై అవగాహన కల్పించటం, వ్యక్తిగత, కుటుంబ, సామాజిక అంశాలపై సామర్థ్యాలను పెంపొందించటం ద్వారా మహిళా సాధికారతను సాధించటం.

h) గ్రామీణ యువత తమ జీవనోపాధిని పెంచుకోవడానికి, సామాజిక అభివృద్ధిలో పాలుపంచుకొనే విధంగా వారిని సమీకరించి, గ్రూపులుగా ఏర్పాటు అయ్యేందుకు ప్రోత్సహించడం.

## II. భారత ప్రభుత్వ ఆర్థిక సహాయంతో చేపట్టిన పథకాలు

### స్వర్ణజయంతి గ్రామ స్వరాజ్‌గార్ యోజన (SGSY):

స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ. 10,000ల నుండి రూ. 1,25,000ల వరకు సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయాన్ని ఈ పథకం క్రింద అందించటం ద్వారా ఆదాయాన్ని కల్పించే కార్యక్రమాలను / ఆస్తులను కల్పించటం.

### SGSY ప్రత్యేక పథకం:

పెద్ద స్థాయిలో ఉపాధి కల్పనకు, మార్కెట్ కార్యకలాపాలకు అనుగుణమైన ప్రాంతీయ సామర్థ్యాలు, కళలు, కనుమరుగవుతున్న కళలపై ఆధారపడినటువంటి ఆర్థిక కార్యకలాపాలను చేపట్టే స్వయం సహాయక సంఘాలకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించటం.

★ భారత ప్రభుత్వం ప్రస్తుతం ఈ పథకాన్ని మరిన్ని మార్పులు, చేర్పులతో 'జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్' (National Rural Livelihood Mission - NRLM) గా పునర్వ్యవస్థీకరించటం జరిగింది.

★ 65 సంవత్సరాలు నిండి, దారిద్ర్య రేఖకు దిగువన వున్నటువంటి వ్యక్తులకు వృద్ధాప్య పింఛను రూ. 100/- లను, కుటుంబ యజమాని/పోషకుడు మరణించినట్లయితే రూ. 5000/-ల సహాయాన్ని జాతీయ సాంఘిక సహాయ కార్యక్రమం (National Social Assistance Programme) ద్వారా బాధిత కుటుంబాలకు అందించడం.

★ ప్రస్తుతం వృద్ధాప్య పింఛను మొత్తం రూ. 200లను అర్హులైన వారికి చెల్లిస్తున్నారు. అంతేకాకుండా నిస్సహాయులైన వికలాంగులకు రూ. 500/- లను, వితంతువులకు రూ. 200/- లను నెలకు పింఛనుగా చెల్లిస్తున్నారు.



## III. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో చేపట్టిన పథకాలు

### రాష్ట్ర రివాల్వింగ్ నిధి (State Revolving Fund):

బ్యాంకు లింకేజి పథకంలో రుణాలు పొంది సక్రమంగా తిరిగి చెల్లింపులు చేసినటువంటి స్వయం సహాయక సంఘాల సభ్యులకు సహాయమందించటానికి వారు పొందిన రుణం రూ. 25,000 లలో, రూ. 10,000 లను సబ్సిడీగా ఈ నిధి ద్వారా అందిస్తారు.

### స్వయం సహాయక సంఘాల (SHG) బ్యాంకు లింకేజి పథకం

అర్హత పొందినటువంటి స్వయం సహాయక సంఘాలకు ఈ పథకం ద్వారా రుణాలు అందజేస్తారు. ఈ స్కీంలో ఒక్కొక్క స్వయం సహాయక సంఘానికి ఆదాయాన్ని కల్పించే పనులు చేపట్టటానికి గాను రూ. 10,000 ల మేరకు రుణ సౌకర్యం కల్పిస్తారు.

### పావలావడ్డీ (బ్యాంకు రుణాలపై వడ్డీ సబ్సిడీ)

స్వయం సహాయక సంఘాలకు ఈ పథకం ద్వారా రుణాలపై వారు చెల్లించిన వడ్డీ, బ్యాంకు వడ్డీ రేట్లతో సంబంధం లేకుండా 3% కనుక మించినట్లయితే 3% మించి చెల్లించిన మొత్తం తిరిగి సబ్సిడీగా వారికి అందజేయబడుతుంది. 2004 జూలై 1వ తేదీ నాటికి వున్న, ఆ తర్వాత మంజూరు చేయబడిన అన్ని స్వయం సహాయక సంఘాల బ్యాంకు రుణాలకు ఇది వర్తిస్తుంది.

## IV. ఉమ్మడి కార్యక్రమాలు

### కమ్యూనికేషన్లు & డాక్యుమెంటేషన్

ఈ విభాగం ద్వారా కార్యక్రమాల వ్యాప్తి, వ్యూహరచన, సంబంధిత ప్రకటనలు సత్వరంగా జారీ అయ్యేటట్లు చేస్తూ, అన్ని స్థాయిలలోని లబ్ధిదారులకు లబ్ధికలిగేలా చేస్తారు. అంతేకాకుండా విజయాలు సాధించిన సంఘాల కథలు, అనుభవాలను డాక్యుమెంట్లు రూపంలో భద్రపరచటం వల్ల ముందు తరాల వారికి విజ్ఞాన గనిని అందించటం జరుగుతుంది. ఇవన్నీ ప్రజలు తమంతట తాము అభివృద్ధి చెందేందుకు, సంబంధిత కార్యక్రమాలలో పాలుపంచుకొనేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

## V. మానిటరింగ్ & లెర్నింగ్


పథకం అమలు, నిర్వహణపై సలహాలు, సూచనలు అందజేయటానికి మానిటరింగ్, లెర్నింగ్ అంశాలు చేపట్టారు. కమ్యూనిటీ ఆధారిత సంస్థలు ఈ విభాగం ద్వారా క్రమం తప్పకుండా స్వీయ పర్యవేక్షణ ద్వారా సాధించిన ఫలాలను మూల్యాంకన చేయటం ద్వారా ప్రాజెక్టులు విజయవంతంగా అమలు చేయటానికి కృషి జరుపుతున్నాయి.

## సెర్ప్ నిర్వహణ

స్వయం ప్రతిపత్తి కలిగినటువంటి సంస్థగా ఏర్పడిన సెర్ప్‌ను నిర్వహించేందుకుగాను జి.వో. యమ్.ఎస్. నెం. 115, తేది: 16.04.2005 ద్వారా 25గురు సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ 25 మందిలో 9 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు కాగా, మిగిలిన 16 మందిలో ప్రత్యేకంగా దారిద్ర్య నిర్మూలన, కమ్యూనిటీ అభివృద్ధికై పనిచేసిన నిపుణుల నుండి 6 గురు, స్వయం సహాయక సంఘాలు, మండల, జిల్లా సమాఖ్యల సభ్యుల నుండి 10 మంది నామినేటు అవుతారు. ఈ పాలకవర్గానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఛైర్మన్‌గాను, ముఖ్య కార్యనిర్వహణాధికారి, కార్యదర్శిగాను వ్యవహరిస్తారు.

చిత్రపటం -2

గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంఘం : రాష్ట్ర స్థాయి ప్రాజెక్టు నిర్వహణ విభాగం విధులు




అంతేకాకుండా సంఘం ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, మానవ వనరుల నిర్వహణ, ప్రణాళికలు, వార్షిక పనులు మొదలైనటు వంటి విషయాలను చూసుకోవడానికిగాను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. ఈ కౌన్సిల్‌లో 7గురు సభ్యులుండగా, అందులో 5 గురు ఎక్స్ అఫిషియో సభ్యులు కాగా, ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి పదవీ విరమణ చేసేవిధంగా పాలకవర్గం ఇద్దరు సభ్యులను నామినేటు చేస్తుంది.


ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ప్రతినెలా కనీసం ఒక సమావేశం నిర్వహించి సెర్ప్ అమలు చేస్తున్నటువంటి కార్యక్రమాల నివేదికలు ప్రభుత్వానికి సమర్పిస్తుంది. సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్లు కలసి పథకాలు, కార్యక్రమాల అమలుకు కృషి చేస్తారు. కాలానుగుణంగా నిర్ణయాలు తీసుకొనేందుకుగాను ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కొన్ని ప్రత్యేకమైన అధికారాలను ముఖ్యకార్యనిర్వహణాధికారి, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్లకు అప్పగిస్తుంది.

రాష్ట్ర స్థాయిలోని సంస్థ రోజువారీ కార్యక్రమాలను ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఇతర బృందం కలసి నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ డైరెక్టర్ అధ్వర్యంలో పని చేస్తుంది. జిల్లా స్థాయిలో ఇందిరాక్రాంతిపథం పథకాలను ప్రాజెక్టు డైరెక్టరు, జిల్లా కలెక్టరు వారి సహాయ సహకారాలతో అమలుచేస్తారు.

ఇదీ SERP గురించిన సమగ్ర సమాచారం. అయితే ఈ సంస్థ నిర్వహించే కీలక కార్యక్రమాలు, విభాగాల గురించి వచ్చే సంచికలలో తెలుసుకుందాం!

*- జి. సత్యవాణి, ఫ్యాకల్టీ, అపార్డ్*

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : K. Chandra Mouli



ల అధిపతులతో త్రివేండ్రంలో జరిగిన
గిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ
శ్రీ నితేన్ చంద్ర, ఐ.ఏ.ఎస్.



అంటున్న భారత్ నిర్మాణ్ వాలంటీర్లు

